ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

ప్రకాశం 5

జిల్లా వార్తలు

గురువారం 7, మార్చి 2024



వెలిగొండ ప్రారంభం అనంతరం నీరు లేని కాలువను చూస్తున్న సీఎం జగన్

పశ్చిమ ప్రాంతవాసుల చిరకాలవాంఛ అయిన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభ వేడుక ఉత్తుత్తిగా మారింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కూడా అసలు విషయం కన్నా రాజకీయాలకే ప్రాధాన్యం ఇచ్చారు. తన అనుకున్న వారిని పిలిచి పక్కన కూర్చోబెట్టుకొని ఆ ప్రాంతవాసులైన దళిత, దళితేతరులను నిల్చోబెట్టి అగౌరవపర్చారు. నిర్వాసితులను ఆవైపు రాకుండా కట్టడి చేశారు. పిలిచిన రైతులకు ఒక్కమాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా కార్యక్రమం ముగించేశారు. వచ్చే జూన్ తర్వాత నీళ్లు రావచ్చు.. అప్పటికి నిర్వాసితులకు డబ్బులు చెల్లించే అవకాశం ఉందనే మాట ఇచ్చి సభను ముగించారు. దీంతో ప్రారంభ కార్యక్రమంపై యావత్తు ప్రజానీకం పెదవి విరుస్తోంది. బుధవారం వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభం తీరుతెన్ను అంతా ఇదే.



ఉత్తుత్తి ప్రారంభం

అంతా రాజకీయమే

- పూర్తికాని పనులపై స్పష్టత లేదు
- జూన్ నాటికి నీళ్లు రావచ్చు.. అప్పటికి డబ్బులు చూస్తానంటూ సీఎం వ్యాఖ్య
- సొంతవారికి కుర్చీ... దళిత నేతలకు అగౌరవం
- రైతులను పిలిచారు.. ఒక్క మాటకు అవకాశం ఇవ్వలేదు
- నిర్వాసితులను మాత్రం భయపెట్టి అడ్డుకున్నారు
- వెలిగొండలో సీఎం సభ తీరుతెన్ను

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు) అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే వెలిగొండను పూర్తిచేసి ప్రాజెక్టును ప్రారంభిస్తానని చెప్పిన జగన్ మాట మారుస్తూనే ఉన్నారు. పదేపదే ప్రారంభ కార్యక్రమం వాయిదా వేస్తూ కాలం గడిపి తీరా రేపోమాపో ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతున్న నేపథ్యంలో బుధవారం వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసే కార్యక్రమం నిర్వహించారు. అయితే ప్రాజెక్టుకు నీరు ఇచ్చే ముహూర్తం మాత్రం జూన్ తర్వాత అంటూ చెప్పడం విశేషం. ప్రారంభ కార్యక్రమం మొత్తం గంట వ్యవధిలోపే ముగించిన సీఎం జగన్.. ప్రజలనుద్దేశించి మాట్లాడింది మాత్రం ఎనిమిది నిమిషాలే. అందులోనూ అధిక సమయం రాజకీయ అంశాల ప్రస్తావనకే ప్రాధాన్యత ఇచ్చారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా చేపట్టిన రెండు టన్నెళ్ల తవ్వకం పూర్తయిందనేది జగన్ చెప్పిన మాట. కానీ రెండు టన్నెళ్లలో ఇంకా కాంక్రీట్ పని కొంతభాగం పూర్తి కావాల్సి ఉంది. అంతేకాక టన్నెళ్ల నుంచి బయటకు వచ్చిన కృష్ణాజలాలు రిజర్వాయర్‌కు చేరాల్సి ఉంది. టన్నెల్‌కు, రిజర్వాయర్‌కు మధ్య 23 కిలోమీటర్ల పొడవున కెనాల్ నిర్మాణం ఇంకా పూర్తిస్థాయిలో జరగలేదు. రెండోవైపు ముంపు గ్రామాల తరలింపు జరగలేదు. అయితే త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తిరిగి తాము అధికారంలోకి వస్తామన్న ధీమాతో వచ్చే జూన్ నాటికి ముంపుబాధితులకు డబ్బులు చెల్లిస్తామన్న మాట మాత్రం చెప్పారు. ప్రాజెక్టుకు నీళ్లు కూడా జూన్ తర్వాత వచ్చే అవకాశం ఉందని సెలవిచ్చారు. దీంతో ప్రస్తుతం ప్రాజెక్టును జాతికి అంకితం చేసే కార్యక్రమం అంతా ఉత్తుత్తిదేనని స్పష్టమవుతుంది.

నిర్వాసితులను కట్టడి చేశారు

ముంపునకు గురయ్యే గ్రామాలకు చెందిన ప్రజలను ఆ వైపునకు రాకుండా ముందుగానే కట్టడి చర్యలు తీసుకున్నారు. పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చి మరీ అడ్డుకున్నారు. దీంతో మొత్తం ఈ కార్యక్రమం అంతా రాజకీయ కోణంలోనే సాగిందంటూ పశ్చిమప్రాంతంలోని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఉత్తుత్తి ప్రారంభం అయినప్పటికీ సభలో దళిత మంత్రి, నాయకులను అగౌరవపర్చటం దారుణమంటూ వైపాలెం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు బహిరంగంగానే విమర్శలు చేయగా వాటిని వైసీపీ నేతలు కూడా ఖండించిన దాఖలాలు లేవు.

మాట్లాడే అవకాశమే ఇవ్వలేదు

కార్యక్రమానికి ప్రాజెక్టు ప్రయోజనం పొందే ఆయకట్టు రైతులను ఆహ్వానించారు. అదీ గ్రామానికి ఆరుగురిని ఎంపిక చేసి మరీ పిలిచారు. కానీ ఒక్కమాట కూడా మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. వారు మాట్లాడితే మిగిలిన పనులు ఎప్పుడు పూర్తవుతాయి, ఎప్పుడు నీళ్లు ఇస్తారు అని అడుగుతారని అనుకున్నారో ఏమో ఒక్కరికీ అవకాశం ఇవ్వలేదని సభ అనంతరం రైతులు వ్యాఖ్యానించారు.

రాజకీయ ప్రసంగానికే ప్రాధాన్యం


వెలిగొండ వద్దకు సమీకరించిన లబ్ధిదారులైన రైతులనుద్దేశించి జగన్ మాట్లాడింది కొన్ని నిమిషాలే అయినా అందులోనూ రాజకీయ అంశాలకే అధిక ప్రాధాన్యం ఇచ్చారు. కాబోయే మంత్రి బాలినేని అంటూ కితాబిచ్చారు. అంతకు ముందు టన్నెల్‌లోకి వెళ్లేటప్పుడు కూడా బాలినేనిని, వైపాలెం ఇన్‌చార్జి చంద్రశేఖర్‌ను మాత్రమే పక్కన తీసుకెళ్లారు. రైతులతో జరిగిన చిన్న కార్యక్రమంలో వేదిక కింద ఉన్న తన బాబాయి అయిన వైవీ సుబ్బారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను పైకి పిలిపించారు. వారి రాకతో అప్పటివరకు వేదికపై కూర్చున్న మంత్రి ఆదిమూలపు సురేష్ లేవాల్సి వచ్చింది. కనుసైగతో ఆయన లేచి వైవీకి సీటు ఇవ్వగా వైపాలెం అభ్యర్థి చంద్రశేఖర్ లేచి వెంకాయమ్మకు కుర్చీ ఇచ్చారు. వేదికపై ఇతర ముఖ్యులతో బాలినేని, వైవీ సుబ్బారెడ్డి, వెంకాయమ్మలే కూర్చున్నారు. సభ జరిగినంతసేపు సురేష్ ఎదురుగా నిలబడక తప్పలేదు. తన సహచర మంత్రి, దళితవర్గానికి చెందిన సురేష్ నిలబడి ఉన్నా చూసి వదిలేశారే తప్ప కూర్చోమన్న దాఖలాలు లేవు. సభలో జగన్ మాట్లాడుతూ వైపాలెం అభ్యర్థి చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. తానూ పోటీలో ఉన్నాననే చందంగా మార్కాపురం అభ్యర్థి అన్నా రాంబాబు ముందుకు రాగా అప్పుడు ఆయన్ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి సురేష్ ఒక అడుగు ముందుకు వేయగా మీరు కొండపిలో కదా పోటీలో ఉందంటూనే ఆయననూ గెలిపించాలని కోరారు. అసలు విషయం కన్నా తన ప్రసంగంలో ఈ తతంగానికే ఎక్కువ సమయం పట్టిందంటే అతిశయోక్తి కాదు. దీంతో అక్కడ ఉన్న నాయకులు, వేదిక కింద ఉన్న రైతులు కూడా ఈ వ్యవహారాన్ని చూస్తూ నివ్వెరపోయారు.



అనుమతి లేదంటూ వైసీపీ కార్యకర్తలను నెట్టివేస్తున్న పోలీసులు

చంద్రబాబు పర్యటన ఖరారు


- 11న వైపాలెం, కొండపి సెగ్మెంట్లలో ప్రజాగళం సభలు
- అదేరోజు పార్టీలోకి మాగుంట?



ఒంగోలు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు జిల్లా పర్యటన ఖరారైంది. ఈనెల 11న ఆయన జిల్లాలో పర్యటించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పార్లమెంట్ స్థానాల పరిధిలో ఒక్కో నియోజకవర్గ కేంద్రంలో బహిరంగ సభ నిర్వహించిన బాబు తాజాగా మరో విడత ప్రజాగళం పేరుతో పర్యటించాలని నిర్ణయించారు. అందులోభాగంగా ఈనెల 11న జిల్లాకు వస్తున్నారు. ఆరోజు ఉదయం ఎర్రగొండపాలెంలో జరిగే సభలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం తర్వాత కొండపి నియోజకవర్గంలోని టంగుటూరులో జరిగే సభకు హాజరవుతారు. ఆమేరకు జిల్లా నేతలకు టీడీపీ అధిష్ఠానం నుంచి స్పష్టత రావడంతో తదనుగుణ ఏర్పాట్లపై ఆ నియోజకవర్గాల నేతలు దృష్టి సారించారు. కాగా వైసీపీకి రాజీనామా చేసిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, రాబోయో ఎన్నికల్లో ఎంపీగా పోటీకి సిద్ధమైన ఆయన కుమారుడు రాఘవరెడ్డి, వారి అనుచరులు అదేరోజున బాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు సమాచారం.

పండుగ సమయంలోనూ ఎదురుచూపులే!

- 15శాతం మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఇంకా అందని వేతనం



ఒంగోలు (కలెక్టరేట్), మార్చి 6 : జిల్లాలో కొన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు ఇంకా జీతాలు అందలేదు. ప్రతినెలా 1,2 తేదీల్లో రావాల్సిన జీతాలు 6వ తేదీ వచ్చినా 15శాతం మంది ఉద్యోగులకు పడలేదు. జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సుమారు 45వేల మంది వరకు పనిచేస్తుండగా, రిటైర్డ్ ఉద్యోగులు మరో 30వేల మందికిపైన ఉన్నారు. అయితే ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు నెల ప్రారంభమైన వెంటనే జీతాలు, పెన్షన్లు వారివారి బ్యాంకు ఖాతాల్లో వేయాల్సి ఉంది. సుమారు ఏడెమిదివేల మంది ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు వేతనాలు, పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఈనెల 8వతేదీ శివరాత్రి పండుగ. ఈ నేపథ్యంలో ఖర్చుల కోసం జీతాలు తప్పనిసరి. అయితే బుధవారం సాయంత్రం వరకు కూడా వేతనాలు పడని పరిస్థితి ఏర్పడింది.

రేపటి నుంచి బ్యాంకులకు మూడు రోజులు సెలవు



ఒంగోలు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులు ఈనెల 8 నుంచి 10వతేదీ వరకు మూతపడనున్నాయి. వరుసగా మూడు రోజులు సెలవులు రావడమే అందుకు కారణం. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 8న సెలవుకాగా తర్వాత రెండో శనివారం కావడంతో 9వతేదీన, ఆదివారంతో 10వతేదీన బ్యాంకులు పనిచేయవు. ఇలా వరుసగా మూడు రోజులు సెలవు దినాలు రావడం చాలా అరుదుకాగా ఖాతాదారులకు కొంతమేర ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉంటాయి. అయినప్పటికీ ఏటీఎంలకు ప్రజలు బాగా అలవాటు పడిన నేపథ్యంలో ఒకట్రెండ్రోజులు సెలవులు వస్తేనే వాటిలో నగదు అందుబాటులో ఉండక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటిది వరుసగా మూడు రోజులు అందులోనూ నెల రెండో వారంలోనే కావడం మరింత ఇబ్బందికరం కానుంది. బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి ఏటీఎంలలో నగదు కొరత లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఓడించాలి

- సర్పంచ్‌ల ధర్నాలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ పిలుపు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 6 : స్థానిక సంస్థల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ఓడించాలని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. పంచాయతీ నిధులను ప్రభుత్వం దారిమళ్లించడాన్ని నిరసిస్తూ బుధవారం సర్పంచ్‌ల సంఘం, పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన



ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న రాజేంద్రప్రసాద్, సర్పంచ్‌లు

ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీ వ్యవస్థకు సమాంతరంగా సచివాలయ వ్యవస్థను తెచ్చిందన్నారు. పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకే ప్రభుత్వం ఇలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ఆర్థిక సంఘం నిధులను దారిమళ్లించడం దుర్మార్గమన్నారు. సీఎం జగన్‌రెడ్డి పంచాయతీ నిధులు, అధికారాలు, విధులను దొంగిలించేశారని ఆరోపించారు. అవి తిరిగి అప్పగించాలని రాజకీయాలకతీతంగా మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఆందోళనలు నిర్వహించినా చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. ప్రభుత్వ విధానాలతో సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోవాల్సిన పరిస్థితి నెలకొనడం బాధాకరమన్నారు. అందుకే పార్టీలకతీతంగా వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. అంతకు ముందు చర్చి సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం జేసీ గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల రమేష్, గౌరవ సలహాదారులు వీరభద్రాచారి, రావెళ్ల సుధాకర్, సింగంశెట్టి సుబ్బరామయ్య, కొత్తపు మునిరెడ్డి, చుక్కా ధనుంజయ్, చింతాకిరణ్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



అక్రమణలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, చెట్లతో ఉన్న పోతురాజు కాలువ

చేయలేక చేతులెత్తేశారు..!

- 'పోతురాజు కాలువ' ఆధునికీకరణ పనులు రద్దు
- వైసీపీ పాలనలో ముందుకు సాగని వైనం
- ఆక్రమణల తొలగింపులో రాజకీయ జోక్యం
- కదలని కార్పొరేషన్, రెవెన్యూ యంత్రాంగం
- చేసేదేమీ లేక విరమించుకున్న ఇరిగేషన్ శాఖ
- టీడీపీ హయాంలో పనుల్లో పురోగతి, బ్రిడ్జిల నిర్మాణం

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 6: జిల్లాకేంద్రమైన ఒంగోలులో కీలకమైన పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులు అటకెక్కాయి. కాలువ కట్టలపై ఉన్న ఆక్రమణల తొలగింపులో రాజకీయ ఒత్తిళ్లు రావడంతో కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు ఆవైపు కన్నెత్తి చూడలేదు. దీంతో పదమూడేళ్ల క్రితం చేపట్టిన పోతురాజు కాలువ బాగు కథ మళ్లీ మొదటికొచ్చింది. అయితే ఏళ్ల తరబడి పనుల్లో పురోగతి లేకపోవడంతో ఈఎన్‌సీ (ఇంజనీర్ ఇన్ చీఫ్)కి కూడా విసుగెత్తింది. మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుకోసం చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేయలేకపోవడంతో వాటిని రద్దుచేస్తూ క్లోజింగ్ లెటర్ ఇచ్చేశారు. దీంతో అధికారుల అలసత్వం, రాజకీయజోక్యం, ఆక్రమణల తొలగింపుల్లో ఒత్తిళ్లతో ఇన్నాళ్లపాటు ఆగుతూ.. సాగుతూ వచ్చిన ఆధునికీకరణ పనులకు ఫుల్‌స్టాప్ పడినట్లే.

ప్రారంభమైన పదమూడేళ్లకు ఫుల్‌స్టాప్

2010 మే 19వ తేదీ అర్ధరాత్రి లైలా తుఫాన్ వరద దెబ్బకు శివారు కాలనీలు వణికిపోయాయి. ఇప్పటికీ ఆ దారుణం అందరి కళ్లల్లో మెదులుతూనే ఉంది. అయితే అందుకు ప్రధాన కారణం పోతురాజు కాలువేనని అధికారులు తేల్చారు. ఆధునికీకరణకు ప్రత్యేక నిధులు కేటాయిస్తే ఇకపై ముప్పు వాటిల్లే అవకాశం ఉండదని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. దీంతో స్పందించిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. కానీ తూతూమంత్రంగా చేసిన పనులు కొట్టుకుపోయాయే తప్ప కాలువ పరిస్థితి మెరుగుపడలేదు. అయితే ఆ తర్వాత అత్యవసర సహాయక సేవల పేరుతో ఏటా రెవెన్యూ అధికారులు రూ.50లక్షలు, మురుగునీరు తొలగింపునకు, కాలువల్లో పూడికతీతకు, నిలిచిన నీటి మళ్లింపునకు రూ.50లక్షల వరకూ ఖర్చుచేస్తూ వస్తున్నారు.

మొదట రూ.12.5 కోట్లు.. ఆ తర్వాత రూ.80 కోట్లు

పోతురాజు కాలువ పేర్నమిట్ట సమీపంలో ఆరంభమై దాదాపు 6 కిలోమీటర్ల వరకు విస్తరించింది. ఈ కాలువ ఆధునికీకరణ ప్రారంభసమయంలో రూ.12.5కోట్లు అవసరమని ప్రతిపాదించగా రూ.11.78 కోట్లను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించింది. పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో అవి కొట్టుకుపోయాయి. ఆ తర్వాత టీడీపీ అధికారంలోకి రాగా, పూర్తిస్థాయిలో పనులు చేపట్టడానికి రూ.40కోట్లు అవసరమని అధికారులు లెక్కలు కట్టారు. దీంతో ఎమ్మెల్యే దామచర్ల హయాంలో గుంటూరు రోడ్డులో పోతురాజుకాలువపై నాలుగు వరసల బ్రిడ్జిని నిర్మించారు. అయితే కాలువ కరకట్టపై కొన్ని నివాసగృహాలు ఉండటంతో మిగిలిన పనులకు అడ్డంకులు ఏర్పడ్డాయి. ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. తదనంతరం చోటుచేసుకున్న పరిణామాల్లో వైసీపీ అధికారంలోకి రాగా, పోతురాజు కాలువ పూర్తిచేయడానికి అప్పటికీ రూ.80 కోట్లు అవసరంగా అధికారులు మళ్లీ లెక్కలు మార్చారు.

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

పోతురాజు కాలువ పనులు ప్రారంభం నుంచే నత్తనడకన సాగాయి. శాఖల మధ్య సమన్వయం లేదు. కార్పొరేషన్, రెవెన్యూ శాఖలు కలిసి రాలేదు. దీంతో ఒంటిచేత్తో పనులు ప్రారంభించిన ఇరిగేషన్ శాఖ తర్వాత అంతగా పట్టించుకున్నట్లు లేదు. కాలువ పూడికతీత, దశరాజుపల్లె వద్ద వంతెన, జయప్రకాష్ కాలనీల్లో వంతెన, అప్రోచ్ రోడ్లు, సీసీ గోడలు నిర్మాణం, క్రాస్‌వాల్స్ కోసం దాదాపు రూ.11.5 కోట్లు ఖర్చుచేసినా పనులు కొలిక్కి రాలేదు. కాలువపై ఆక్రమణల తొలగింపులో రెవెన్యూ కార్పొరేషన్ అధికారులు కలిసి రాకపోవడంతోనే పనుల్లో జాప్యం జరిగింది. పోతురాజు కాలువ వ్యవహారం ప్రజాప్రతినిధుల పంచాయితీకి చేరింది. దీంతో ఆక్రమణల తొలగింపులో అలసత్వం నెలకొనడంతో అప్పటివరకు సాగిన పనులు ఉపయోగం లేకుండాపోయాయి. యథాప్రకారం కాలువల్లో వ్యర్థాలు చేరి మురుగుతో మూసుకుపోయింది. కాలువకట్టపై చెట్లు పెరిగి అడవిని తలపిస్తోంది. దీంతో చేపట్టిన పనులు మరలా చేపట్టలేమంటూ ఇరిగేషన్ శాఖాధికారులు చేతులెత్తేశారు. ఖర్చుచేసిన కోట్లాది రూపాయలు కాలువలో కలిసిపోయాయి.



వెల్లంపల్లిలో వేలాన్ని పరిశీలిస్తున్న బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

పొగాకు కిలో రూ.232

- అన్నికేంద్రాల్లోనూ కొనుగోళ్లు
- వెల్లంపల్లి, ఒంగోలు-2 కేంద్రాల్లో వేలాన్ని ప్రారంభించిన బోర్డు చైర్మన్

ఒంగోలు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలోని అన్ని వేలం కేంద్రాల్లోనూ బుధవారం నుంచి పొగాకు కొనుగోళ్ల ప్రారంభమయ్యాయి. గరిష్ఠ ధర కిలోకు రూ.232 లభించింది. రాష్ట్రంలో ప్రస్తుత సీజన్ కొనుగోళ్లను మూడు విడతలుగా చేపట్టాలని నిర్ణయించిన పొగాకు బోర్డు అధికారులు తొలివిడత ఫిబ్రవరి 29న కొండపి, ఒంగోలు-1లో చేపట్టారు. రెండో విడత ఈనెల 6 నుంచి, మూడో విడత 14వ తేదీ నుంచి చేపట్టాలని షెడ్యూల్ ఇచ్చారు. అయితే పలు కారణాలతో రెండో దశలోనే మిగిలిన అన్ని కేంద్రాల్లోనూ కొనుగోళ్లను ప్రారంభించారు. అందులో భాగంగా దక్షిణాదిలోని 11 కేంద్రాల్లో తొలివిడత చేపట్టిన రెండు మినహా మిగిలిన తొమ్మిది కేంద్రాల్లోనూ బుధవారం వేలం మొదలైంది. ఆయా కేంద్రాల్లో 16 బేళ్ల వంతున తొలిరోజు వేలానికి అనుమతించారు. వెల్లంపల్లి, ఒంగోలు-2 కేంద్రాల్లో పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ వేలం ప్రక్రియను ప్రారంభించగా బోర్డు ప్రాంతీయ మేనేజర్ ఎం.లక్ష్మణరావు, ఇతర అధికారులు, వ్యాపారులు, రైతుప్రతినిధులు పాల్గొన్నారు. ఇతరచోట్ల స్థానిక వేలం కేంద్రం అధికారులు ప్రారంభించారు. ఆయా కేంద్రాల్లో ఇంచుమించు 15 కంపెనీలకు చెందిన బయ్యర్లు పాల్గొనగా గరిష్ఠ ధర కిలో రూ.232 పలికింది. వెల్లంపల్లి, పొదిలి కేంద్రాల్లో ఈ ధర లభించగా ఒంగోలు-2లో కిలోకు రూ.231 లభించింది. తొలి విడత కేంద్రాల్లో కిలో రూ.230 ప్రారంభ ధర ఇచ్చిన వ్యాపారులు బుధవారం రెండో దశలో రూ.2 అదనంగా ఇచ్చారు. ఈ ధరలపై ఆయా ప్రాంతాల రైతులు ఒకింత సంతృప్తి వ్యక్తంచేస్తున్నప్పటికీ ఉత్తరాది కేంద్రాల్లో కూడా బుధవారమే వేలం ప్రారంభం కాగా అక్కడ గరిష్ఠ ధర కిలో రూ.240 లభించడంతో అలాగే పెంచాలని బోర్డు అధికారులను కోరినట్లు సమాచారం.



నోరు తెరిస్తే అబద్ధాలు

- మైకు పట్టుకుంటే మాపై నిందలు
- బాలినేనిపై దామచర్ల ధ్వజం

లోపలి పేజీల్లో..

నోరు తెరిస్తే అబద్ధం..

మైకు పట్టుకుంటే మాపై నిందలు..!

అమాయకంగా అబద్ధాలు చెబితే నిజాలు కావు ● ఎమ్మెల్యే బాలినేనిపై దామచర్ల ధ్వజం ● టీడీపీ అధికారంలోకి రాగానే జర్నలిస్టులకు 3 సెంట్లు స్థలం



సమావేశంలో మాట్లాడుతున్న దామచర్ల జనార్దన్

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 6 : "ఆయన నోరు తెరిస్తే అబద్ధాలు. మైకు పట్టుకుంటే మాపై నిందలు. అబద్ధాలు చెబితే అన్నీ నిజాలు అయిపోవు. సీనియర్ అంటావు..వయస్సులో పెద్దోడివి..వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుంది. అమాయకంగా ఫేస్ పెట్టి అబద్ధాలు చెబితే నిజాలు కావు. ఇప్పటికైనా నాటకాలు ఇక చాలించాలి. టీడీపీ అధికారంలోకి రాగానే అన్నీ లెక్కలు తేలుస్తాం." ఇదీ ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిపై టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఘాటుగా ధ్వజమెత్తారు. బుధవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దామచర్ల మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలినేని నోరు తెరిస్తే అబద్ధాలు ఆడటం, వాటినే పదేపదే చెబితే నిజం అయిపోతుంద భ్రమంలో ఉన్నారని మండిపడ్డారు. షాదీఖానా సాక్షిగా సిగ్గులేకుండా మాట్లాడటం మాని గతాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలని ఆయన హితవు పలికారు. తన తాత దామచర్ల ఆంజనేయులు మార్కెటింగ్‌శాఖ మంత్రిగా ఎకరా స్థలాన్ని కేటాయించారని, ఆ సమయంలో గుంటూరు ఎంపీగా లాల్‌జాన్ బాషా, ఒంగోలు ఎంపీగా కరణం బలరామకృష్ణమూర్తి ఉన్నారని, షాదీఖానా నిర్మాణం కోసం రూ.కోటి నిధులు కూడా కేటాయించారని తెలిపారు.అప్పట్లో శిలాఫలకం వేసి శంకుస్థాపన చేశారని, 2004లో వైఎస్సార్ వచ్చి మరోసారి శంకుస్థాపన చేశారని చెప్పారు. ఆ తర్వాత మాగుంట శ్రీనివాసులురెడ్డి ఎంపీ నిధుల కింద రూ.75లక్షలు ఇచ్చామని తెలిపారు. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చి రూ.1.5 కోట్లు కేటాయించి, మొదటి అంతస్తు పూర్తిచేసి, 2వ అంతస్తు పిల్లర్లు కూడా వేసినట్లు దామచర్ల వెల్లడించారు. అందుకోసం అదనంగా మరో రూ.2కోట్లు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. ఇవన్నీ వాస్తవరూపంలో జీవో కాపీలతో సహా తమ వద్ద ఉన్నాయన్నారు. చిత్తశుద్ధి ఉంటే రెండో అంతస్తు శ్లాబ్ వేశామని, అలాగే కిచెన్, టాయిలెట్లు నిర్మించామని చెప్పుకో తప్పులేదని, ఐదుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు మంత్రి అయిన బాలినేని ముస్లింలకు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం హయాంలోనే ఖబరస్తాన్లు, మసీదులు ఆధునికీకరణ చేశామన్నారు. ఎన్నికలొచ్చినపుడు శిలాఫలకాలు వేసి, రిబ్బన్లు కట్ చేస్తే అభివృద్ధి అంటారా అని ప్రశ్నించారు. షాదీఖానాకు ఒక్క రూపాయి కూడా తేలేని పెద్ద మనిషి పక్కన ఉండే కొందరు బఫూన్లు నాడు తమ పక్కన ఉన్నారని, వారి మాటలు నమ్మి నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ప్రజలు కూడా వాస్తవాలు గుర్తించాలని, బాలినేని చెప్పే అబద్ధాలు నమ్మి మోసపోవద్దని దామచర్ల పేర్కొన్నారు.

పట్టాల పేరుతో మరో డ్రామా..

యరజర్ల వద్ద ఇళ్ళ పట్టాలు ఇస్తుంటే టీడీపీ వాళ్ళు కోర్టులో కేసులు వేశారని ఎమ్మెల్యే బాలినేని పదేపదే అబద్ధాలు చెప్పడం మానుకోవాలని దామచర్ల హితవు పలికారు. గతంలో ఆ ప్రాంతాన్ని ఐరన్ ఓర్‌కు కేటాయించారన్నారు. వైసీపీ ఇళ్ళ పట్టాల అంశానికి ముందే తాము కూడా ఆ స్థలాన్ని చూశామని, అక్కడ టిడ్కో ఇళ్లు, ట్రిపుల్ ఐటీ, స్టేడియం కట్టాలని పరిశీలిస్తే ఐరన్‌ఓర్ కింద ఉందని విరమించుకున్నట్లు చెప్పారు. దీంతో టిడ్కో ఇళ్ళు చింతల వద్ద, ట్రిపుల్ ఐటీ కనిగిరికి మార్చామన్నారు. ఇవన్నీ వాస్తవం అని తెలిసి కూడా పదేపదే టీడీపీ అడ్డుకుందని అబద్ధాలు చెప్పడం, నిందలు వేయడం ఆయన చేతగానితనమని విమర్శించారు. మరలా ఎన్నికలు వచ్చేసరికి ప్రజలను మోసం చేయడం కోసం నగరానికి పది కిలోమీటర్ల దూరంలో నిరుపయోగం లేని సెంటు భూమి ఇచ్చి చీరలు పంచితే ప్రజలు నమ్మరన్నారు. తాము నగరానికి రవాణా సులువుగా ఉండేలా చింతల, కొప్పోలు వద్ద టిడ్కో ఇళ్ళు నిర్మించామని దామచర్ల పేర్కొన్నారు. వాటిని పేదలకు ఇవ్వకుండా ఇప్పుడు కొత్తగా పట్టాల పేరుతో డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. తాజాగా పేదల ఇళ్ళ పట్టాలపై కోర్టులో కేసు వేసిందెవరో తెలిసీ టీడీపీపై నిందలు వేయడం పెద్దమనిషికే సిగ్గు చేటన్నారు.

గేట్లు పెట్టలేని వాళ్లు..
ప్రాజెక్టులు ప్రారంభించడమా..

గుండ్లకమ్మ ప్రాజెక్టుకు మూడు గేట్లు కొట్టుకుపోతే ఏడాదిగా పట్టించుకోలేని వైసీపీ పాలకులు నేడు వెలిగొండ ప్రారంభించడం విడ్డూరంగా ఉందని దామచర్ల జనార్దన్ విమర్శించారు. తెలుగుదేశం పాలనీలో 1996లో చంద్రబాబు నాయుడు సీఎంగా రూ.980 కోట్లు రెండు టన్నెల్‌కు బడ్జెట్ వేసి పనులు మొదలు పెట్టినట్లు తెలిపారు. 2004లో మరోసారి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి రీ షెడ్యూలు చేసి రూ.5,500 కోట్లు బడ్జెట్ వేయగా, 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చి 17.5 కి.మీ. మొదటి టన్నెల్, 3 కి.మీ రెండవ టన్నెల్ వేసినట్లు తెలిపారు. 2019 తర్వాత వైసీపీ వచ్చాక రూ.953 కోట్లు ఇచ్చారన్నారు. చిత్తశుద్ధి లేకుండా అసెంబ్లీలోనే ప్రతి ఏటా అబద్ధాలు చెబుతూ పనులు పూర్తి చేయలేక పోయారని చెప్పారు. అక్కడ పోలవరం, ఇక్కడ వెలిగొండ పనులు చేయలేక, ఇపుడు ఎన్నికలు వచ్చాక హడావిడి ప్రారంభత్సవాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు.

అన్ని లెక్కలు తేలుస్తాం..

అధికారం ఉంది కదా అన్ని రకాలుగా టీడీపీ శ్రేణులను ఇబ్బందులు పెట్టారని దామచర్ల మండిపడ్డారు. గ్రానైట్ క్వారీలపై కొలతలు వేసి మరీ దాడులు చేయడం, పోలీసులు ఉన్నారని కేసులు పెట్టడం తమకు చేతవుతాయన్నారు. అధికారంలోకి రాగానే అవినీతి లెక్కలన్నీ తేలుస్తామని ఆయన హెచ్చరించారు. వైసీపీ పాలకుల చేతగాని తనంతో నగరంలోని పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులు కూడా రద్దు చేయడం సిగ్గు చేటని దామచర్ల విమర్శించారు.

జర్నలిస్టులకు 3 సెంట్ల ఇంటి స్థలం

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్‌తో సంబంధం లేకుండా 3 సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని దామచర్ల తెలిపారు. అలాగే గతంలో నిలిచిపోయిన టిడ్కో ఇళ్ళను పూర్తి చేసి అర్హులందరికీ ఇస్తామన్నారు. ఇంకా ఎవరైన అర్హులు ఉంటే వారికి కూడా టిడ్కో ఇళ్ళు, 2సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని దామచర్ల హామీ ఇచ్చారు. సమావేశంలో నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, మాజీ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, మైనార్టీ సెల్ జిల్లా నాయకులు పఠాన్ హనీఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో

బాలినేని కుటుంబసభ్యులు

నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల పట్టాల పంపిణీ

లబ్ధిదారులకు గిఫ్ట్ ప్యాకెట్లు అందజేస్తున్న వైనం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 6 : ఒంగోలు నగరంలో గత రెండు రోజులుగా పేదలకు ఇస్తున్న ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు అన్ని తామై పనిచేస్తున్నారు. సాధారణంగా ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేతో పాటు మేయరు, డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, వివిధ హోదాల్లో ఉండేవారు అధికారులతో కలిసి పాల్గొనాల్సి ఉంటుంది. కానీ ఒంగోలులో అందుకుభిన్నంగా బాలినేని కుటుంబ సభ్యులందరూ వేదికలపై ఉంటూ లబ్ధిదారులకు ఇంటి పట్టాలతో పాటు చీరలు, ప్యాంటు, షర్టులు అందజేస్తున్నారు. ఎన్నికల సమయం సమీపిస్తుండటం, ఈనెల 13వతేదీన ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందనే ప్రచారం నేపథ్యంలో డివిజన్ల వారీగా ఇంటిపట్టాల రిజిస్ట్రేషన్ల పత్రాలతో పాటు లబ్ధిదారులకు ఇస్తామన్న గిఫ్ట్ ప్యాక్‌లను పంపిణీకి శ్రీకారం చుట్టారు. అయితే ప్రభుత్వ నిబంధనలను పక్కన పెట్టి అన్ని తామై వ్యవహరిస్తుండడటం విమర్శకు తావిస్తోంది. బుధవారం వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసేందుకు యర్రగొండపాలెం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రావడంతో ఆ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈక్రమంలో ఒంగోలులో జరిగిన కార్యక్రమాల్లో బాలినేని సతీమణి శచీదేవి, కుమారుడు ప్రణీత్‌రెడ్డి, ఆయన సతీమణి కావ్యలు పాల్గొని లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేయడం గమనార్హం.

'పోతుల'ను కలిసిన రాఘవరెడ్డి



నరసింహారావుతో చర్చిస్తున్న రాఘవరెడ్డి

టంగుటూరు, మార్చి 6 : ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు రాఘవరెడ్డి మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు, కందుకూరు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు సోదరుడు నరసింహారావును బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. స్థానిక ఎస్‌ఎల్‌టీసీకి వచ్చిన రాఘవరెడ్డికి పోతుల ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారి మధ్య కొంతసేపు రాజకీయాలపై చర్చ జరిగింది. పొగాకు రైతుల స్థితిగతులు, స్థానిక సమస్యలపై మాట్లాడుకున్నారు. అనంతరం రాఘవరెడ్డిని పోతుల సన్మానించారు. కార్యక్రమంలో పోతుల ముఖ్య అనుచరులు కసుకుర్తి శ్రీధర్, చిడిపోతు కోటేశ్వరరావు, రావూరి సతీష్‌బాబు, గుడిపూడి నరసింహం, పి.బ్రహ్మానందం, నార్నె హరిబాబు, పమిడి తులసీరావు, కామినేని కోటేశ్వరరావు, నవులూరి సురేంద్ర పాల్గొన్నారు.

కొండపి నాయకులతో సత్య భేటీ



నాయకులతో మాట్లాడుతున్న సత్య

కొండపి, మార్చి 6 : టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్యన్నారాయణ కొండపి నాయకులతో బుధవారం సమావేశమయ్యారు. ఈనెల 11న నియోజకవర్గంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పర్యటించనున్న నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల నాయకులకు సత్య పలు సూచనలు చేశారు. ప్రధానంగా నియోజకవర్గ కేంద్రమైన కొండపి పంచాయతీలోని నాయకులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ ఒంగోలు పార్లమెంటు ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్యచౌదరి, పార్టీ నాయకులు బూదవాటి సోమయ్య, నన్నూరి సుబ్బరామయ్య, యూత్ నాయకులు నేతి రవికుమార్, షేక్ ఖాఈషా తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ రోడ్డును ఏర్పాటు చేయాలి

సింగరాయకొండ, మార్చి 6: రైల్వే మూడో లైన్ నిర్మాణం వలన మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ పరిధిలోని నర్రావారిపాలెంకు రైల్వే ట్రాక్ సమీపంలో ఉన్న రోడ్డును తొలగించనున్నారు. దీంతో గ్రామానికి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని బుధవారం తహసీల్దార్ భవానీశంకర్‌కు కలిసి గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నర్రావారిపాలెం గ్రామస్థులు

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ఒకే రోజు స్టాండింగ్, జడ్పీ సమావేశం ● కేవలం మూడు అంశాలకే అజెండా పరిమితం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 6 : జిల్లాలో అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాల్సిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా నిర్వహించేందుకు జిల్లా పరిషత్ అధికారులు ఏర్పాటు చేశారు. సాధారణంగా జిల్లా పరిషత్ సమావేశం అంటే అన్ని రకాల సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయడంతో పాటు జిల్లాలో తక్షణ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని కోరేందుకు వేదికగా జిల్లా పరిషత్ సమావేశం ఉంటుంది. కానీ ఈ సారి జడ్పీ సర్వసభ్య సమావేశం కేవలం మూడు అంశాలకే పరిమతమైంది. జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా), పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్యశాఖ కార్యకలాపాలపై సమీక్ష మాత్రమే నిర్వహించారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో అనేక గ్రామాల్లో తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజానీకం అల్లాడిపోతున్నారు. ప్రభుత్వం ఇటీవల ట్యాంకర్ల నీటి సరఫరాను నిలిపివేయడంతో ప్రజానీకం నీరు లేక రోడ్డెక్కారు. ఇంకోక వైపు నీటి సరఫరా చేసిన ట్యాంకర్ల యజమానులకు బిల్లులు కూడా రూ.కోట్లలో పెండింగ్‌లో ఉన్నాయి. ఇంకొక వైపు ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ రకాల పనులు మందకొడిగా జరుగుతుండగా, ఉపాధి హామీ పథకం పనులు కూడా అంతంతగా మాత్రంగానే ఉన్నాయి. వేసవిలో ప్రజానీకానికి అవసరమైన సమస్యలపై చర్చించి తక్షణమే నిర్ణయం తీసుకోవాల్సిన సమావేశాన్ని ఏదో మొక్కుబడిగా గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించేందుకు జిల్లా పరిషత్ అధికారులు చర్యలు తీసుకున్నారు.

అలాగూ ఉదయం పదిన్నర గంటలకు జిల్లా పరిషత్ స్టాండింగ్ సమావేశం అనంతరం జిల్లా పరిషత్ సమావేశాన్ని ఏర్పాటు చేయడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో సమస్యలపై సభ్యులు ప్రస్తావించేందుకు కూడా సమయం లేని పరిస్థితి నెలకొంది.

14న మహాపంచాయితీని జయప్రదం చేయాలి

10నుంచి మూడు రోజుల పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రచారం ● కిసాన్ సంయుక్త మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక వెల్లడి



మాట్లాడుతున్న చుండూరి రంగారావు

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 6 : దేశానికి అన్నంపెట్టే అన్నదాతలపై నిర్బంధాలు, దాడులు, హత్యాకాండలు సాగిస్తూ దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్న బీజేపీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని కిసాన్ సంయుక్త మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకోసం ఈ నెల 14న ఢిల్లీలో జరిగే మహా పంచాయితీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. బుధవారం ఒంగోలులోని మాదాల నారాయణస్వామి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి, పమిడి వెంకట్రావులు మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా ఉద్యమ ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పంజాబ్‌కు చెందిన కొన్ని రైతు సంఘాలను చర్చలకు పిలిచి అన్ని సమస్యలను పరిష్కరిస్తున్న నమ్మించి చివరకు పంటల మద్దతు ధరకు చట్టబద్ధత కూడా చేయని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ మోసాన్ని గుర్తించిన రైతు సంఘాలు చివరకు సంయుక్త కిసాన్ మోర్చాతో కలిసి ఈనెల 14న నిర్వహించే మహా పంచాయితీలో పాల్గొనేందుకు ముందుకు రావడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈనెల 10తేదీ నుంచి మూడు రోజుల పాటు గ్రామీణ ప్రాంతాల్లో జరిగే ప్రచారాల్లో అందరూ భాగస్వామ్యులు కావాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు వడ్డె హనుమారెడ్డి, పద్మ, రాజశేఖర్,నాగరాజు, ఎస్‌డీ.సర్దార్, ఉప్పుటూరి ప్రకాశరావు, రాయపాటి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలను ఎండగట్టాలి : బీఎన్



కరపత్రాలను అందజేస్తున్న విజయ్‌కుమార్

మద్దిపాడు, మార్చి 6 వైసీపీ అరాచకాలను కార్యకర్తలు తిప్పికొట్టాలని టీడీపీ అభ్యర్థి బీఎస్.విజయకుమార్ పేర్కొన్నారు. బుధవారం వెల్లంపల్లి రాజుమిట్టలో జరిగిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, ఎం.సుబ్బారావు, దాట్ల వేణురాజు, జనసేన మండల అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

బీఎన్ నివాళి

నాగులుప్పలపాడు : ఒమ్మెవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు పిన్నింటి నాగేశ్వరరావు మృతి చెందారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన దశదినకర్మలో నియెజకవర్గ టీడీపీ అభ్యర్థి బీఎస్.విజయ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు తేళ్ళ మనోజ్‌కుమార్ నాయకులతో కలిసి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని వ్యక్తం చేశారు. వారి వెంట కార్యదర్శి కాకర్ల లక్ష్మీవరప్రసాద్, గుమ్మడి సాయిబాబా, కొమ్మాలపాటి సురేష్, సర్పంచ్ పాలపర్తి బాలకోటయ్య, కనగాల శ్రీనివాసరావు, సెల్వం, వెంకటేశ్వర్లు ఉన్నారు.

పొగాకు రైతులకు అండగా ఉంటాం : చైర్మన్



రైతులతో మాట్లాడుతున్న చైర్మన్ యశ్వంత్‌కుమార్

మద్దిపాడు, మార్చి 6: పొగాకు రైతులను అన్నివిధాల ఆదుకుంటామని బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం వెల్లంపల్లి పొగాకే వేలం కేంద్రంలో కొనుగోళ్లను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ముందుగా ఆక్షన్ సూపరింటెండెంట్ వి.రామకృష్ణ పూజలు నిర్వహించారు. మొదటిరోజు చంద్రపాడు క్లస్టర్ రైతులు 18 బేళ్ల అమ్మకానికి తీసుకురాగా బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ రూ.232 ధర పలికేవిధంగా వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన పొగాకుకు ఎప్పుడూ గిట్టుబాటు ధర ఉంటుందన్నారు. రైతులు బేళ్ల నిర్మాణంలో మెలకువలు పాటించాలని చెప్పారు. బోర్డు సభ్యులు వరప్రసాద్, మారెడ్డి సుబ్బారెడ్డి, వేలం కేంద్రం రైతు సంఘం అధ్యక్షుడు అబ్బూరి శేషగిరిరావు మాట్లాడుతూ బయ్యర్లు రైతుల ప్రతికూల పరిస్థితిని గమనించి బేళ్ల గిట్టుబాటు ధరలు ఇవ్వాలన్నారు. కిలో రూ.240లకు కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రావి ఉమామహేశ్వరరావు, మండవ గోవిందరాజులు, నారిపెద్ది వరహాలచౌదరి, సురేంద్రబాబు, మండవ శ్రీరామమూర్తి, కాకర్ల విజయకుమార్, పల్లకి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

సెమిస్టర్ ఫలితాల్లో 'శ్రీహర్షిణి' విజయకేతనం

ఒంగోలు(విద్య), మార్చి 6 : ఆచార్య నాగార్జున యూనివర్శిటీ డిగ్రీ ఐదో సెమిస్టర్ ఫలితాల్లో ఒంగోలులోని శ్రీహర్షిణి డిగ్రీ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి యూనివర్శిటీ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. బీఎస్‌సీ (ఎంఎస్‌సీఎస్) విభాగంలో టి.మేఘన 783, ఎస్‌కే.ఆదిన్ 781, యాదాల నిఖిత 773 మార్కులతో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం సాధించారు. బిఎస్‌సీ (ఎంపీసీఎస్) విభాగంలో జి.రాజకుమారి 770, జి.నందిని 768, ఎం.లక్ష్మీప్రియ 767 మార్కులు, బీఎస్‌సీ(బయోటెక్నాలజీ)లో తిమ్మరాజు లావణ్య 825, వి.శ్రావణి 807. బీబీఏ విభాగంలో జి.రాజశేఖర్ 502, కె.పద్మిని 492, ఎస్.భార్గవి 489, బీఎస్‌సీ(టీఎండబ్ల్యూ) విభాగంలో ఎర్రంరెడ్డి లక్ష్మీచైతన్య 780 మార్కులు సాధించారు అలాగే బీఎస్‌సీ(ఎంసీసీఎస్)విభాగంలో అంకిత శిరీష 755 మార్కులు, బీజడ్‌సీ విభాగంలో పుచ్చపల్లి ప్రసన్న 840, గోసు వెంకమ్మ 836, పిన్నిదివ్య 835 మార్కులు సాధించారు. బీఎస్‌సీ(ఎంపీసీ) విభాగంలో చీమకుర్తి వెంకటశిరీష 721, బీఎస్‌సీ(ఆక్వాకల్చర్) విభాగంలో వాయిల ధనలక్ష్మి 790, బీఎస్‌సీ(అగ్రికల్చర్) విభాగంలో ఎన్.నిషితారెడ్డి 862, ఎస్.శృతి 864, గంగవరపు మానస 835 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను చైర్మన్ గోరంట్ల రవి కుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోరంట్ల కవిత, పీజీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి, గిరీష్, వైస్ ప్రిన్సిపాల్ వీఎల్, కళాశాల ఏవో శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఆంజనేయులు, అధ్యాపకులు అభినందించారు.

సేవా దృక్పథంతో పని చేయాలి



మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 6 : సేవా దృక్పథంతో పనిచేసినప్పుడే ఎన్ఎస్ఎస్ కార్యక్రమం లక్ష్యం నెరవేరుతుందని, అందుకోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖకు చెందిన ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ పి.అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో బుధవారం జరిగిన ఏకేయూ గుర్తింపు పొందిన కళాశాలల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ల సమావేశం ఉపకులపతి మారెడ్డి అంజిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి కళాశాలలో కనీసం వంద మంది విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఏర్పాటు చేయడం ద్వారా న్యాక్ కమిటీలో కనీసం వంద పాయింట్లు పొందే అవకాశం ఉందన్నారు. రాష్ట్రంలో ఉన్న 38 యూనివర్శిటీల్లో 2173 ఎన్ఎస్ఎస్ యూనిట్లు పని చేస్తున్నాయన్నారు. ప్రతి కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల నుంచి ఆఫీసర్ వరకు సేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బి.హరిబాబు, ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త మండే హర్షప్రీతమ్ దేవ్‌కుమార్, ప్రిన్సిపాల్ రాజమోహన్ పాల్గొన్నారు.

పేస్‌లో అవగాహన సదస్సు



అతిథులకు బొకే అందజేస్తున్న అధ్యాపకులు

ఒంగోలు(విద్య), మార్చి 6: ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులకు బుధవారం డిజైన్ థింకింగ్ ఫర్ ప్రాబ్లమ్స్ సాల్వింగ్‌పై వర్క్‌షాపును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కేఎల్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకటరమణ, ఇన్నోవేషన్ అంబాసిడర్ డిజైన్ థింకర్ ఎం.జానకిరామ్ హాజరై సమస్య, అధ్యయనం, పరిష్కారం, వివిధ రకాల పద్ధతులు, మార్కెటింగ్‌పై అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి, డీన్ ఆర్.వీరాంజనేయులు, విభాగాధిపతురాలు టి.పేరిజోన్స్ తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ ఫలితాల్లో 'వీవీఆర్' విజయభేరి

ఒంగోలు(విద్య), మార్చి 6 : ఆచార్య నాగార్జున యూనివర్శిటీ ప్రకటించిన ఐదో సెమిస్టర్ ఫలితాల్లో ఒంగోలులోని వీవీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారని చైర్మన్ వడ్లమూడి వెంకటరావు బుధవారం తెలిపారు. బీఎస్‌సీలో కె.అభినయ 739, కె.రీనామాధురి 731, డి.కావ్య 727, సీహెచ్.సంధ్య 727, ఎ.ప్రవల్లిక 717, వి.ఆరతి 713, జి.హర్షిణి 711 మార్కులు సాధించారు మాథ్స్‌లో వందకు వంద మార్కులు ఐదుగురు విద్యార్థులు సాధజంచగా 98శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్ వడ్లమూడి పద్మశ్రీ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ముగిసిన టెట్

ఒంగోలు(విద్య), మార్చి 6 : జిల్లాలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) బుధవారంతో ముగిసింది. చివరి రోజు టెట్ పరీక్షకు 122 మంది గైర్హాజరైనట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్ తెలిపారు. ఉదయం సెషన్‌కు 530 మందికి 459 మంది హాజరు కాగా మధ్యాహ్నం 530 మందికి గాను 479 మంది హాజరైనట్లు ఆయన చెప్పారు.

ఇంటర్ పరీక్షకు 1,688 మంది గైర్హాజరు

ఒంగోలు(విద్య), మార్చి 6 : జిల్లాలో జరుగుతున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన జూనియర్ ఇంటర్ గణితం-1ఎ పరీక్షకు 1,688 మంది విద్యార్థులు గైర్హాజయ్యారు. 24,821 మందిగాను 23,133 మంది పరీక్ష రాశారు. జనరల్ విద్యార్థులు 22,069 మందికి 20,823 మంది, ఒకేషనల్ విద్యార్థులు 2,752 మందికి 2,310 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. అధికారులు 52 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ఆర్ఐవో సైమన్‌విక్టర్ తెలిపారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు



మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

ఒంగోలు(రూరల్), మార్చి 6: ఒంగోలు మండలం కరవదిలోని పీఆర్ఆర్ జడ్పీ ఉన్నతపాఠశాలలో ఈ నెల 8నుంచి 10వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలను ప్రధానోపాధ్యాయుడు సూరి గుచ్చి హనుమంతరావు జ్ఞాపకార్థం పూర్వవిద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈమేరకు నిర్వాహకులు బుధవారం స్థానిక స్కూలులో వారు మాట్లాడుతూ సాయంత్రం 4 నుంచి రాత్రి 10గంటలవరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో శిరిగిరి రంగారావు, ప్రభాకర్(బాబు), పల్లపోలు సుబ్బారెడి(పెద్దసుబ్బారెడ్డి), జి.కోటేశ్వరరావు, ఎ.వెంకటేశ్వర్లు, శిరిగిరి అంజయ్య, కొండ్రగుంట శేషయ్య, దేవరపల్లి యూనియారాజు, శిగా కోటేశ్వరరావు, పోకూరి శేషయ్య, ఉప్పుటూరి కోటేశ్వరరావు, గుట్టపల్లి ప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

రైజ్‌లో ముగిసిన వర్క్‌షాప్



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేసిన నిర్వాహకులు

ఒంగోలు(విద్య), మార్చి 6: ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి గ్రూపు ఆఫ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం ఈసీఈ విభాగానికి చెందిన విద్యార్థులకు మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న వర్క్‌షాప్ బుధవారం ముగిసిందని ఆ కళాశాల కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. టెక్నాలజీ అండ్ కన్సల్టెన్సీ సర్వీస్ డైరెక్టర్ ఎస్‌వీ.నరేష్ విద్యార్థులకు లైటింగ్, ఉష్ణోగ్రత నియంత్రణ, స్వయం చాలక భద్రత వ్యవస్థలు, ఆటోమెటిక్ స్ట్రీట్ లైట్ ఆన్‌అండ్ ఆఫ్, సెన్సార్‌లో అగ్నిని గుర్తించడం వంటి పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు యూనివర్శిటీ సిలబస్‌తో పాటు ఇలాంటి వర్క్‌షాపులు ఎంతో ఉపయోగపడుతాయని డైరెక్టర్ ఏవీ.భాస్కరరావు తెలిపారు. కార్యక్రమంలో గౌరవ చైర్మన్ ఈస్కాల చినరంగమన్నార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జిల్లాలో పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ : కలెక్టర్

ఒంగోలు(రూరల్), మార్చి6: జిల్లాలో 12 పోలింగ్‌కేంద్రాలను క్రమబద్ధీకరించినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒంగోలు నియోజకవర్గంలో ఒకటి, మార్కాపురంలో 2, గిద్దలూరులో 6, సంతనూతలపాడులో 1, కనిగిరిలో 1, యర్రగొండపాలెంలో 1 కేంద్రాలను క్రమబద్ధీకరించినట్లు చెప్పారు. 80సంవత్సరాలు దాటిన వారు, దివ్యాంగులు ఇంటిదగ్గరే ఓటు వే సుకునే సౌలభ్యం కల్పించినట్లు చెప్పారు. అయితే వారు ఫారం నంబరు 12డీ దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో శ్రీలత, ఆర్డీవోలు విశ్వేశ్వరావు, జాన్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి 1,116 శివలింగాల వేదిక సిద్ధం

రేపు వేకువజాము నుంచే పూజలు, అభిషేకాలు

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

జమ్ములపాలెం(టంగుటూరు) : మండలంలోని జమ్ములపాలెంలో ఉన్న 1,116 శివలింగాల వేదిక శివరాత్రికి సిద్ధమైంది. శుక్రవారం వేకువజామున 4 గంటలకు సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయి. రాత్రి 12.25గంటలకు మహాలింగోద్భవ పూజ నిర్వహించనున్నారు. రాత్రి జాగారం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వేలాదిగా భక్తులు తరలిరానుండటంతో వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దేవస్థానం నిర్వాహకుడు బ్రహ్మయ్య నేతృత్వంలో ఏర్పాట్లు చేశారు. భక్తులనే వలంటీర్లుగా నియమించారు.

శివలింగాల వేదిక చరిత్ర

జమ్ములపాలెంకు చెందిన పాదర్తి వెంకటశేషమాంబ 1994లో తన శిష్యులతో కలిసి తీర్థయాత్రలకు బయల్దేరారు. అందులో భాగంగా ఆమె కాశీ వెళ్లారు. అక్కడ నుంచి నేపాల్‌లోని ఖాట్మండ్ చేరుకొన్నారు. అక్కడి పశుపతినాదాలయంలో 524 శివలింగాల వేదికను దర్శించుకున్నారు. శివలింగాలన్నింటినీ స్పృశించి శివనామ స్మరణ చేశారు. అది వెంకటశేషమాంబకు ఎంతగానో తృప్తినిచ్చింది. అప్పుడే ఆమె మదిలో ఒక ఆలోచన వచ్చింది. తన ప్రాంతంలోని భక్తుల కోసం 1,116 శివలింగాల వేదిక నిర్మించాలని నిర్ణయించుకున్నారు. తిరిగి జమ్ములపాలెం చేరుకున్న ఆమె శివలింగాల వేదిక నిర్మాణం కోసం కొందరు భక్తులతో శ్రీపాదర్తి వెంకటశేషమాంబ పూరిశెట్టి రెలిజియస్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. దాని ద్వారా విరాళాలు సేకరించి జమ్ములపాలెంలోనే రెండు ఎకరాల విస్తీర్ణంలో 1995లో 1,116 శివలింగాల వేదికకు శంకుస్థాపన చేశారు. పనులు చకచకా సాగిపోయాయి. 1999లో అత్యంత అద్భుతంగా శివలింగాలను ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి శివలింగాల వేదిక నిత్యం శివనామస్మరణతో మార్మోగుతూనే ఉంది. 2007లో వెంకట శేషమాంబ దేవాలయ ప్రాంగణంలోనే సమాధి అయ్యారు. ఆమె మరణానంతరం తనయుడు బ్రహ్మయ్య శివలింగాల వేదిక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

దేవాలయంలో విశేషాలు

జమ్ములపాలెంలోని 108 శక్తిపీఠ సమేత 1,116 మహాలింగ సహిత శ్రీపంచముఖేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో నిత్యం నైమిత్తికాది అభిషేకం జరుగుతోంది. ప్రతినెలా మాస శివరాత్రి రోజు సాయంత్రం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వైభవంగా నిర్వహిస్తున్నారు. అనంతరం స్వామి వారిని 16 గజాల చీరతో అలంకరిస్తారు. మహాశివరాత్రి రోజు రుద్రాభిషేకాలు, అర్చనలు ఘనంగా జరుగుతాయి. ఇదేరోజున మహాలింగోద్భవ పూజ (మహాదేవుడు లింగమైన సమయం) జరగడం ఇక్కడి ప్రత్యేకత. మహాశివరాత్రికి వేలాదిగా భక్తులు తరలివస్తారు. పెళ్లి కాని వారికి ఇక్కడ అంగారక పూజలు జరుగుతాయి. చలికాలంలోనూ దేవాలయ ప్రాంగణంలో చలి రాదన్నది భక్తుల నమ్మకం.



శివలింగాల వేదిక

అన్ని వర్గాల సంక్షేమం తెలుగుదేశంతోనే సాధ్యం

- **టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల**
- **పార్టీలోకి వరుసగా చేరికలు**
- **సాదరంగా ఆహ్వానించిన జనార్దన్**

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 6: రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని బుధవారం నగరంలోని కబాడీపాలెంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల ప్రతి ఇంటింటికీ వెళ్ళి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. ఆరు సూత్రాల కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యపడుతుందన్నారు. తాను ఎమ్మెల్యేగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని, మరో అవకాశం కల్పించి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమలో నగర అధ్యక్షులు కొఠారి నాగేశ్వరరావు, మాజీ మునిసిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పాలూరి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా అధికారప్రతినిధి బండారు మదన్, క్లస్టర్ ఇన్‌చార్జి కపిల్‌బాషా, పలువురు నాయకులు శ్రేణులు పాల్గొన్నారు. కాగా స్థానికులు దామచర్లకు ఘనంగా స్వాగతం పలికారు.





ఒంగోలులో దామచర్ల జనార్దన్ సమక్షంలో పార్టీలో చేరిన ఆర్యవైశ్యులు, తూర్పునాయుడుపాలెంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే స్వామి

టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులు

తెలుగుదేశంలోకి వైసీపీ నుంచి పలువురు నాయకులు చేరారు. ఈ సందర్భంగా పార్టీలోకి ఆర్యవైశ్యులు మిరియాల కృష్ణ, తాతా రాజా, రేవూరి బాలాజీ, మట్టా సుధాకర్, గుర్రం శివప్రసాద్, తదితరులు చేరగా వారికి దామచర్ల టీడీపీ కండువాలు కప్పిసాదరంగా ఆహ్వానించారు. 24వ డివిజన్‌లోని బ్రాస్ మార్చంట్స్ అసోసియేషన్ హాలులో జరిగిన కార్యక్రమంలో వైసీపీ నాయకులు మలిశెట్టి శ్రీనివాసులు, ఆయన సతీమణి నాగమణి ఆధ్వర్యంలో 150 మంది టీడీపీలో చేరారు. 9వ డివిజన్‌లో వైసీపీకి చందిన ఈర్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మరో 25మంది టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా దామచర్ల వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో 9వడిజన్ అధ్యక్షుడు వడ్లమూడి మునీంద్ర, నడిపినేని భాస్కర్, మందా డేవిడ్, ఎస్కే.మస్తాన్‌వలి, కునుమూరి సుబ్బారావు, పర్వతాల వెంకటేశ్వర్లు, షేక్ మాబు, కనుమూరి వెంకటేశ్వర్లు, బొడపాటి హరిబాబు, గోసుక్రిష్ణ, మన్నెపల్లి గోవిందాచారి, గోనుగుంట సుబ్బారావు, కాట్రగడ్డ నాగేశ్వరరావు, దొడ్డా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన తొమ్మిదో డివిజన్ నాయకులు

ఎమ్మెల్యే స్వామి సమక్షంలో ఉపసర్పంచ్‌తో సహా..

జరుగుమల్లి (కొండపి): జరుగుమల్లి మండలంలోని వావిలేటిపాడు ఉపసర్పంచ్ రమాదేవితోపాటు మరికొన్ని కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని తన స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో వీరికి ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి పసుపు కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా స్వామి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం వైసీపీని వీడి టీడీపీలోకి రావడం ఆనందంగా ఉందన్నారు. అందరికీ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో గాలి కమలాకర్‌రావు, సుదర్శి వెంకట్రావు, గాలి నరేంద్ర, పచ్చబొల్ల రమణయ్యలతోపాటు పలుకుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో వావిలేటిపాడు టీడీపీ నాయకులు నరాల సోమయ్య, కొండలరావు, గిరిబాబు, శ్రీనివాసరావు, పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

టీడీపీ సమావేశం విజయవంతంపై కృతజ్ఞతలు

సింగరాయకొండ, మార్చి 6 : టీడీపీ కొండపి నియోజకవర్గ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేసినందుకు ఆపార్టీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ దేవి సీఫుడ్స్ ఎదురుగా మంగళవారం నిర్వహించిన సమావేశానికి, దామచర్ల సత్య పుట్టినరోజు వేడుకలకు ఆరు మండలాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో రావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో నాయకుల సమష్టి కృషితోనే కేవలం రెండు రోజుల్లోనే భారీ కార్యక్రమం నిర్వహించడం సాధ్యపడిందని తెలిపారు. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు షరీఫ్, వర్ల రామయ్య, ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య ఎన్నికలపై చేసిన దిశానిర్దేశంతో కార్యకర్తలు నూతనోత్సాహంతో ముందుకు సాగుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ మండల పరిశీలకుడు మాధవ, సుబ్బారావు, కూనపరెడ్డి సుబ్బారావు, మించల బ్రహ్మయ్య, నర్రా రాంబాబు, నక్కా బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలి

వ్యాపారులకు బోర్డు ప్రొడక్షన్ మేనేజర్ కృష్ణశ్రీ సూచన

టంగుటూరులో వేలం ప్రారంభం

టంగుటూరు, మార్చి 6 : ఈ సీజన్‌లో పొగాకు పంట ఉత్పత్తి వ్యయం పెరిగినందున రైతులకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని బోర్డు ప్రొడక్షన్ మేనేజర్ కృష్ణశ్రీ వ్యాపారులకు సూచించారు. స్థానిక వేలం కేంద్రంలో బుధవారం నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణశ్రీ మాట్లాడుతూ సాగుదారులంతా పొగాకు బేళ్లలో అన్యపదార్థాలు లేకుండా వేలానికి తీసుకురావాలన్నారు. తొలిరోజు చింతలపాలెం క్లస్టర్ పరిధిలోని చింతలపాలెం, దావగూడూరు రైతులకు చెందిన 18 బేళ్లను వేలానికి అనుమతించారు. అన్నింటినీ వ్యాపారులు కొనుగోలు చేశారు. గరిష్ఠ ధర కిలోకు రూ. 230 చెల్లించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఆక్షన్ మేనేజర్ కె.వి.రామాంజనేయులు, వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు, సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ జి.సిద్ధరాజు, ఎఫ్‌సీవీ పొగాకు ఉత్పత్తి దా రుల సంఘం అధ్యక్షుడు పోతుల నరసింహారావు, రైతు నేత కొత్తపల్లి వెంకటే శ్వర్లు(గుణ) తదితరులు పాల్గొన్నారు.



వేలంను ప్రారంభించిన ప్రొడక్షన్ మేనేజర్ కృష్ణశ్రీ

రేషన్ బియ్యం పట్టివేత

బల్లికురవ. మార్చి 6 : పేదల నుంచి కొనుగోలు చేసిన 45 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమ మార్గంలో తరలిస్తుండగా బుధవారం తెల్లవారుజామున కొప్పెరపాడు సమీపంలో అద్దంకి ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ వాసుదేవరావు పట్టుకొన్నారు. గొర్రెపాడు రోడ్డు నుంచి అద్దంకి నార్కెట్‌పల్లి రోడ్డుకు ఏపీ 39 టీటీ 2125 గల నాలుగు చక్రాల వాహనంలో రేషన్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్నట్లు ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులకు సమాచారం అందింది. ఆమేరకు తనిఖీలు నిర్వహించగా వాహనం లో 90 బస్తాల బియ్యం ఉండటంతో వెంటనే డ్రైవర్ కె.రమేష్‌నును అదుపులోకి తీసుకొని బల్లికురవ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని గుంటుపల్లి డీలర్‌కు అప్పగించిన్నట్లు డీటీ తెలిపారు. ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్‌ఐ నాగ శివారెడ్డి తెలిపారు.

దారి కోసం ధర్నా

మేదరమెట్ల, మార్చి 6: ఇంటి దారి విషయంలో తమకు న్యాయం చేయాలని హైదరాబాద్‌లోని నేషనల్ ఎస్సీ కమిషన్ కార్యాలయం ఎదుట బుధవారం సుధారాణి ధర్నా చేసింది. మండలంలోని బొడ్డువానిపాలెంకు చెందిన గొట్టిపాటి సుధారాణి తమ ఇంటి దారి విషయమై న్యాయం చేయాలని కలెక్టర్, రాష్ట్ర ఎస్సీ కమిషన్‌కు గతంలో వివిధ స్థాయిలలోని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా స్థాయి అధికారులు బొడ్డువానిపాలె వచ్చి ఇరువర్గాలకు చెందిన వారి పత్రాలను పరిశీలించారు. ఈ విషయంపై ఇప్పటికే ఇరువురూ కోర్టును ఆశ్రయించారు. తాజాగా ఆమె హైదరాబాద్‌లో ధర్నా చేపట్టింది.

నీటి విడుదలపై ఆగ్రహం

పామూరు, మార్చి 6 : మోపాడు రిజర్వాయర్ నీటిని ఇరిగేషన్ శాఖ అధికారులు రాత్రి సమయంలో అక్రమంగా విడుదల చేయడంపై రైతులు ఆగ్రహించారు. 20 అడుగుల మేర నీటి మట్టం ఉన్నప్పుడే నెల్లూరు జిల్లా కొండాపురం ఆయకట్టుకు నీరు ఇవ్వాలి. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 10 అడుగు నీటిమట్టమే ఉంది. అలాంటప్పుడు నీటిని ఎలా వదులుతారని రైతులు ప్రశ్నించారు. దీనిపై డీఈ రవి మా ట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటిని విడుదల చేశామన్నారు.

అంతా మా ఇష్టం!

వైసీపీ పాలనలో ప్రొటోకాల్‌కూ తిలోదకాలు

సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు లేకుండానే పొందూరులో సచివాలయ కాంప్లెక్స్ ప్రారంభం

వారిద్దరూ టీడీపీకి చెందిన వారు కావడమే కారణం

పొందూరు (టంగుటూరు), మార్చి 6 : వైసీపీ పాలన అంతా మాఇష్టం అన్నట్లు సాగుతోంది. ప్రొటోకాల్‌కు సైతం తిలోదకాలిస్తున్నారు. పొందూరులో నిర్మించిన సచివాలయ కాంప్లెక్స్‌ను స్థానిక సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు లేకుండానే మంత్రి ఆదిమూలపు సురేష్ బుధవారం ప్రారంభించారు. దీనిపై టీడీపీకి చెందిన సర్పంచ్ పిల్లి కోట్లింగం, ఎంపీటీసీ సభ్యుడు పమిడి నాగేశ్వరరావు తీవ్ర నిరసన తెలిపారు. ఇదంతా వైసీపీ కార్యక్రమంలా ఉందని విమర్శించారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన సచివాలయ కాంప్లెక్స్‌ను స్థానిక వైసీపీ నాయకులు వాళ్లిష్ట ప్రకారం చేసుకుంటున్నారని, ఇవేమీ వారి పార్టీ నిధులు కాదని గుర్తిస్తే మంచిదన్నారు. ప్రభుత్వమంటే ప్రజల భాగస్వామ్యం ఉండాలని, ప్రధానంగా గ్రామంలోని సర్పంచ్, ఎంపీటీసీకి సంబంధం లేకుండా ప్రారంభించడం దుర్మార్గమన్నారు. తాము టీడీపీ మద్దతుదారులమైనందున దూరంగా పెడతారా అని వారు ప్రశ్నించారు. రాజకీయాలు శాశ్వతం కాదని, మనం చేసే పనులే శాశ్వతమని గుర్తిస్తేచాలని స్థానిక వైసీపీ నాయకులనుద్దేశించి సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు అన్నారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న రామకృష్ణ

ఒంగోలు(రూరల్), మార్చి6: పొగాకు రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలని ఒంగోలు పొగాకువేలంకేంద్రం-2 నిర్వహణాధికారి కె.రామకృష్ణ పేర్కొన్నారు. వెంకట్రాజుపాలెం గ్రామంలో బుధవారం పొగాకు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుగు మందులు వాడకుండా పొగాకును సాగు చేయాలన్నారు. పురుగు మందు అవశేషాలు ఉండకూడదని పేర్కొన్నారు. గ్రేడింగ్‌లో అన్యపదార్థాలు లేకుండా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, ఐటీసీ మేనేజర్ వెంకటేశ్, పీఎస్ఎస్‌హెచ్ ప్రతినిధి రామాంజనేయులు, పాల్గొన్నారు.

సోలార్ యూనిట్లతో

గృహాలకు ఉచిత విద్యుత్

- ఈఈ మస్తాన్‌రావు

అద్దంకి, మార్చి 6: ఇళ్ల పైకప్పుపై సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గృహవినియోగానికి ఉచిత విద్యుత్ పొందవచ్చు అని విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. బుధవారం అద్దంకి విద్యుత్ కార్యాలయంలో వివరాలతో కూడిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. దేశవ్యాప్తంగా ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా సుమారు కోటి ఇళ్లపై సోలార్ యూనిట్‌లు సబ్సిడీపై ఏర్పాటు చేసుకోవచ్చునని అన్నారు. 1 కేవీ యూనిట్‌కు మొత్తం రూ. 55 వేలు ఖర్చు కాగా రూ. 30 వేలు సబ్సిడీ ఉంటుందన్నారు. 2కేవి యూనిట్‌కు మొత్తం ఖర్చు లక్ష రూపాయలు కాగా రూ. 60 వేలు, 3కేవి మొత్తం రూ. 1.40లక్షలు ఖర్చు కాగా 78 వేల రూపాయలు సబ్సిడీ పొందవచ్చన్నారు. 3 కేవీ యూనిట్ ఏర్పాటు చేసుకున్న ఇళ్లకు నెలకు 300 యూనిట్‌ల వరకు ఉచిత విద్యుత్ పొందవచ్చు అన్నారు. ఇంటి వాడకానికి మించి విద్యుత్ ఉత్పత్తి చేస్తే యూనిట్‌కు రూ.4.17 పైసలు చొప్పున జమచేస్తామన్నారు. ఇందుకోసం నేరుగా వెబ్ సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. యూనిట్ నిర్మాణం పూర్తి అయిన తరువాత సబ్సిడీ మొత్తాన్ని వారి బ్యాంక్ ఖాతాలలో జమ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ సత్యనారాయణ, ఈఆర్‌వో కార్యాలయం జేఏవో రమేష్, టెక్నికల్ ఏఈ బాలకోటేశ్వరరావు పాల్గొన్నారు.

దామచర్ల హయాంలోనే నగర అభివృద్ధి : నాగసత్యలత

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 6 : ఒంగోలు నగరం దామచర్ల జనార్దన్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే అభివృద్ధి చెందిందని, అందువల్ల రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి ఓటు వేసి గెలిపించాలని జనార్దన్ సతీమణి నాగసత్యలత కోరారు. బుధవారం దామచర్ల జనార్దన్ నగర్‌లోని 4వ లైన్‌లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగసత్యలత మాట్లాడుతూ టీడీపీ హయాంలో దామచర్ల జనార్దన్ చేసిన అభివృద్ధిని చూసి సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మహిళలతో మాట్లాడి టీడీపీ గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో 37వ డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జి ఆలా నరసింహారావు, పువ్వాడ రాణి, పోటు పద్మ పాల్గొన్నారు.

తోపుడుబండ్లు పంపిణీ

ఒంగోలు(కార్పొరేషన్): దామచర్ల జనార్దన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు తోడ్పాటు అందించారు. ఈ మేరకు బుధవారం టీడీపీ కార్యాలయంలో సుమారు 50 మంది వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు అందజేశారు. కార్యక్రమంలో దామచర్ల జనార్దన్‌తోపాటు ఆయన సతీమణి నాగసత్యలత, కుమార్తెలు అనీషా, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.





పేద వ్యాపారులకు తోపుడుబండిని అందజేస్తున్న దామచర్ల జనార్దన్, నాగసత్యలత దంపతులు, బండ్లను తీసుకెళుతున్న లబ్ధిదారులు (పక్కన)

తవ్వారు..వదిలేశారు..!

పైపులైను పనులతో ప్రమాదాలు ● రెండు టిప్పర్లు బోల్తా

ఒంగోలు నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో పైపులైను నిర్మాణ పనుల్లో ప్రమాదం చోటు చేసుకుంది. గత పదిహేను రోజులుగా భాగ్యనగర్ 4వ లైను, హౌసింగ్ బోర్డు కాలనీమెయిన్ రోడ్‌లో తాగునీటి పైపులైను పనులు జరుగుతుండగా, రోడ్డును తవ్వి పూడ్చారు. అయితే సరైన పద్ధతిలో రోడ్డును పూడ్చకపోగా, మట్టి కప్పి వదిలేయడంతో ఇటీవల కాలంలో తరచూ వాహన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో తాజాగా బుధవారం క్వారీ రబ్బిష్ అన్‌లోడ్ చేసేందుకు అక్కడకు వచ్చిన టిప్పర్ బోల్తా కొట్టింది. దాంతోపాటు, ఆ సమయంలోనే వచ్చినమరో టిప్పర్ కూడా గుంటలో పడిపోయింది. అయితే ప్రాణాపాయం తప్పి పోగా, పడిపోయిన టిప్పర్‌లను లేవనెత్తడం కోసం ఎక్స్‌వేటర్‌ను తెప్పించి.. నాలుగు గంటలు శ్రమించారు. ఇప్పటికైనా అధికారులు పర్యవేక్షించి, పనుల వలన ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- ఒంగోలు (కార్పొరేషన్)





పైపులైను గోతుల్లో పడిపోయిన లారీలు

హోరాహోరీగా పోలురాధా ఎడ్ల పందాలు

చినగంజాం, మార్చి 6 : మండలంలోని సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో మహాశివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి నాటుబండి పోలు రాదా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు బుధవారం రాత్రి హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలకు కృష్ణ , నెల్లూరు జిల్లాలతో పాటు, బాపట్ల, చీరాల, వేటపాలెం, కడవకుదురు, సోపిరాల తదితర గ్రామాలకు చెందిన 17 ఎడ్ల జతలు వచ్చినట్లు నిర్వహకులు తెలిపారు. సోపిరాల టైర్ల బండ్ల అసోసియేషన్, గ్రామస్థుల సహకారంతో నిర్వహిస్తున్న ఈ నాటుబండి పోలు రాదా ఎడ్ల పందాలను మున్సిపల్‌మాజీ కమిషనర్ టీఎస్ఆర్ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం వలన ప్రజల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందుతాయని అన్నారు. ప్రేక్షకులు ఈలలు, కేరింతలతో దేవస్థానం ప్రాంగణం తిరునాళ్ల వాతావరణం నెలకొంది. పోటీలను తిలకించేందుకు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పోటీలలో విజేతలైన ఎడ్ల జతల యజమానులకు గురువారం బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యూబీ.వరప్రసాద్, ఈవోపీఆర్డీ ఎస్‌వీజీ.మూర్తి, కడవకుదురు ఎంపీటీసీ ఆమంచి వెంకటసుబ్బారావు, చెరుకూరి పుల్లయ్య, ఎ.రామకృష్ణ, నిర్వహణ కమిటీ సభ్యులు టి.జయరావు, చెరుకూరి భాస్కరరావు, గ్రామ కార్యదర్శి ఎ.మస్తాన్‌రావు పాల్గొన్నారు.



పోటీలో పాల్గొన్న కడవకుదురు ఎడ్లు

వెలిగొండ ప్రారంభం సిగ్గుసిగ్గు..!

నల్ల బెలూన్లతో నిరసన ● పనులు పూర్తి చేయకుండా, నీళ్లు లేకుండా శిలాఫలకమా ● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, మార్చి 6: వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయకుండా నీళ్ల లేకుండా ఎన్నికల్లో లబ్ధి కోసం సీఎం జగన్‌రెడ్డి ప్రారంభించడం సిగ్గుచేటని ఎర్రగొండపాలెం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. పనులు పూర్తి కాకుండా వెలిగొండను ప్రారంభించడంపై టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం టీడీపీ కార్యాలయం ఎదుట నల్లబెలూన్లను గాలిలోకి వదిలి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ రెండు సొరంగాలు పూర్తయ్యాయని శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి జాతికి అంకితం అంటూ జగన్‌రెడ్డి ప్రజలను మోసం చేశారన్నారు. ప్రాజెక్టు పరిధిలో 7 వేల మంది భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాల్సి ఉందన్నారు. పెద్దారవీడు, మార్కాపురం, అర్ధవీడు మండలాల్లో 11 ముంపు గ్రామాలను తరలించాల్సి ఉందని తెలిపారు. ఒక్కో నిర్వాసితునికి రూ.12.50 లక్షల వంతున రూ.1500 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం రూ. 1450 కోట్లు ఖర్చుచేస్తే, వైసీపీ ఈ ఐదేళ్లలో కేవలం రూ.958 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ప్రాజెక్టుపై నిర్లక్ష్యం చూపిందన్నారు. దీంతో ప్రాజెక్టు వ్యయం రూ.10వేల కోట్లకు చేరిందన్నారు. మరో రూ.4వేల కోట్లు ఖర్చు చేస్తేగాని ప్రాజెక్టు పూర్తి కాదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రాజెక్టును పూర్తి చేస్తామని తెలిపారు. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకపోగా పోలీసులతో నోటీసులు ఇప్పించడం అన్యాయమని ఎరిక్షన్‌బాబు అన్నారు. కొల్లంవాగు వద్ద రెగ్యులేటరీ పనులు, డిస్ట్రిబ్యూటరీ కాలువ పనులు పూర్తి కాకుండానే ప్రారంభ కార్యక్రమం నిర్వహించడం ఓట్లు దండుకోవడానికి చేస్తున్న మరో మోసమని పేర్కొన్నారు. జగన్‌రెడ్డి మాయలు, అబద్ధపు మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ఎన్నికల్లో గద్దె దింపుతారని ఎరిక్షన్‌బాబు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగస్టు నాటికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో సీఎం జగన్

పెద్ద దోర్నాల, మార్చి 6 : వచ్చే ఖరీఫ్ నాటికి ముంపు బాధితులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ పరిహారం డబ్బులు ఇస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూరు వద్ద నిర్మిస్తున్న పశ్చిమ ప్రకాశం ఆశల సౌధం పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు పైలాన్‌ను ముఖ్యమంత్రి బుధవారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లోని 30 మండలాలకు చెందిన 15.25 లక్షల ప్రజలకు రక్షిత మంచి నీటిని, 4.47 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించే లక్ష్యంతో వైఎస్సార్ ఈ ప్రాజెక్టును ప్రారంభించారన్నారు. కాంగ్రెస్ పాలనలో నిర్మాణ పనులు వేగంగా జరిగాయని, టీడీపీ హయాంలో పనులు నెమ్మదించాయన్నారు. ప్రాజెక్టులో ప్రధానమైన మొదటి సొరంగం 2021లో, రెండో సొరంగం ఇప్పుడు దేవుడి దయతో మీ ఆశీర్వాదంతో వచ్చిన బిడ్డ రెండు టన్నెళ్లను పూర్తి చేసి జాతికి అంకితం చేస్తున్నట్లు చెప్పారు. జూలై, ఆగస్టులో డ్యాంకు నీరొస్తే 840 అడుగుల దాటిన వెంటనే రోజుకో టీఎంసీ నీటిని ప్రాజెక్టు ద్వారా నల్లమల సాగర్ రిజర్వాయర్‌కు తరలిస్తామన్నారు. ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చి నిర్వాసితులకు రూ. 1200కోట్లు ఎల్‌ఏ ఆర్ అండ్ ఆర్ పూర్తి చేసి జలాశయాలకు నీటిని తరలిస్తామన్నారు. అనంతరం ఎర్రగొండపాలెం అభ్యర్థిగా చంద్రశేఖర్, ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని మీకు పంపానన్నారు. గిద్దలూరు, మార్కాపురం నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, ఒంగోలు బాలినేనిని, సురేష్‌ను పరిచయం చేశారు. కార్యక్రమంలో అంబటి రాంబాబు, మేరుగ నాగార్జున, జంకె వెంకట రెడ్డి, బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి, సుధాకర్‌బాబు, బుర్రా మధుసూదన్‌రావు, వైవీ సుబ్బారెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, పోతుల సునీత, కొమ్మూరి కనకారావు పాల్గొన్నారు.


సభకు రాకుండా కార్యకర్తలను అడ్డుకుంటున్న పోలీసులు

మీ పల్లకి మోయాలి.. మా సమస్యలు పట్టవా?
సీఎం సభకు అనుమతించకపోవడంపై కార్యకర్తల ఆగ్రహం

మా ఓట్లు కావాలి, మీ పల్లకి మోయాలి కానీ మాకు అనుమతించరు.. సమస్యలు వినరా అంటూ వైసీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బుధవారం హాజరవుతున్న నేపథ్యంలో అభిమానులు కార్యకర్తలు తమ నాయకుడిని చూసేందుకు, సమస్యలు చెప్పుకునేందుకు ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. కాగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. వీఐపీ పాసులు చూపించినా అనుమతించలేదు. దీంతో కార్యకర్తలు గొడవకు దిగారు. నియోజకవర్గం, మండల స్థాయి నాయకులు జోక్యం చేసుకుని పోలీసులను బతిమిలాడినా అనుమతించలేదు. పైగా ఎండలు మండిపోతున్నాయి. అంతెందుకు ప్రభుత్వ అనుమతి మేరకు ముఖ్యమంత్రి పర్యటనను కవర్ చేసేందుకు కలెక్టర్ మంజూరు చేసిన పాసులతో వెళ్లిన విలేకరులను కూడా పోలీసులు చాలా సేపు గ్యాలరీలోకి అనుమతించలేదు. డీపీఆర్‌వో విజ్ఞప్తి మేరకు 15 నిమిషాల అనంతరం అనుమతించారు. సామాన్య కార్యకర్తలకు అవకాశం లేక, ఎండకు బయట ఉండలేక ఆ పార్టీ నాయకులను నిందిస్తూ ఉసూరుమంటూ వెనుదిరిగారు.

సీఎం వస్తున్నారని ముందస్తు అరెస్టులు
ఇళ్ల వద్ద రాజకీయ నేతల నిర్బంధాలు


సీపీఐ నాయకుడు నాసరయ్యను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

మార్కాపురం వన్ టౌన్, మార్చి 6: సీఎం జగన్ వస్తున్నారని పలువురు సీపీఐ, సీపీఎం నాయకులను పోలీసులు నిర్బంధం విధించారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు జగన్‌రెడ్డి కొత్తూరుకు వచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు పట్టణంలోని సీపీఐ నాయకుడు నాసరయ్య సీపీఎం నాయకుడు సోమయ్య, రఫి, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, జీవీ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా అందె నాసరయ్య మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత ప్రజల ఆశాజ్యోతి అయిన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేయకుండానే కేవలం ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రాజకీయ లబ్ది పొందేందుకు మాత్రమే పైలాన్ ఆవిష్కరించడం ప్రజలను వంచించడమేనన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా ప్రారంభోత్సవం చేయడం మరోసారి మోసం చేయడమేనని విమర్శించారు.


రోడ్డుపై ధర్నా చేస్తున్న బాధిత బంధువులు, గ్రామస్థులు

బాధిత కుటుంబం ధర్నా

- మంత్రి సురేష్‌కు వ్యతిరేకంగా నినాదాలు
- రూ.50లక్షల పరిహారం, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్

త్రిపురాంతకం, మార్చి 6 : కేశినేనిపల్లి వద్ద మంత్రి ఆదిమూలపు సురేష్ కాన్వాయ్‌లోని ఎస్కార్ట్ వాహనం ఆటోను ఢీకొని మృతి చెందిన నార్నెపాటి ఇజ్రాయేల్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ రాజుపాలెంలో అతని బంధువులు రోడ్డుపై ధర్నాకు దిగారు. పోలీసులు, మండల వైసీపీ నాయకులు చేసిన చర్యలు ఫలించక పోవడంతో బంధువులతో కలిసి ఎస్సీ కాలనీకి చెందిన యువకులు, మహిళలు రోడ్డుపై బైఠాయించి మంత్రి సురేష్‌కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మంత్రి సురేష్ డౌన్ డౌన్, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి సురేష్ రావాలని, రూ.50 లక్షల పరిహారం ప్రకటించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు మానికొండ శ్రీనివాసరెడ్డి, కందుల శ్రీనివాసరెడ్డితోపాటు వైసీపీ నాయకులు అలవాల శంకరరెడ్డి కూడా బాధితులకు అండగా రోడ్డుపై బైఠాయించారు. దీంతో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. సీఐ ఎస్.సుబ్బారావు, త్రిపురాంతకం, కురిచేడు ఎస్సైలు సాంబశివయ్య, సుమన్ సిబ్బంది తో కలిసి పరిస్థితిని అదుపుచేసే ప్రయత్నం చేశారు. సుమారు రెండు గంటల తర్వాత అక్కడకు చేరుకున్న నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ మృతదేహానికి నివాళులర్పించి ధర్నా చేస్తున్న వారితో మాట్లాడే ప్ర యత్నం చేశారు. దీంతో మీరు ధర్నాలో కూర్చోవాలని పట్టుబట్టడంతో చేసేది లేక చంద్రశేఖర్ రోడ్డుపై బైఠాయించారు. అనంతరం మంత్రి సురేష్ తరఫున రూ.50 వేలు అందించారు. తన సొంత నిధుల నుంచి రూ.5 లక్షలను బాధిత కుటుంబానికి ఇస్తానని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. ధర్నా విరమించడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

ఇజ్రాయేల్ కుటుంబాన్ని ఆదుకోవాలి
టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు డిమాండ్

ఎర్రగొండపాలెం, మార్చి 6 : మంత్రి సురేష్ కాన్వాయ్ ఎస్కార్ట్ వాహనం ఢీకొని మృతి చెందిన నార్నెపాటి ఇజ్రాయేల్ కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఎర్రగొండపాలెం వైద్యశాలలో ఇజ్రాయేల్ మృతదేహాన్ని ఎరిక్షన్‌బాబు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వాళ్ల నాన్నమ్మ, సోదరిని పరామర్శించారు. మం త్రి కాన్వాయ్ వాహనం ఢీకొట్టి మృతిచెందినా సురేష్ పరామర్శించకపోవడం చూ స్తుంటే దళితులపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. ఈ ఘటనపై వెం టనే కేసు నమోదు చేయాలని త్రిపురాంతకం ఎస్ఐని కోరారు.

ఘనంగా వార్షికోత్సవం

గిద్దలూరు, మార్చి 6 : పట్టణంలోని అరుణోదయ ఐఐటీ ఫౌండేషన్ స్కూలు, శర్వాణి విద్యానికేతన్ 28వ వార్షికోత్సవం స్థానిక సీతారామ కల్యాణ మండపం ఆవరణలో ఘనంగా జరిగాయి. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ప్రొఫెసర్ చంద్రశేఖర్, మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు, కరస్పాండెంట్ జడ్.చంద్రశేఖర్, హెచ్ఎం గురుప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

తర్లుపాడు, మార్చి 6 : పదో తరగతి పరీక్షల్లో కస్తూర్బా విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులయ్యేలా చదువుకోవాలని గర్ల్స్ చైల్డ్ డవలప్‌మెంట్ అధికారి ప్రమోద అన్నారు. మండలంలోని కలుజువ్వలపాడు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బుధవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను విద్యాభివృద్ధిపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. రానున్న పదో త రగతి పరీక్షలకు విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉత్తీర్ణులు కావాలని కోరారు. ఇంటర్ విద్యార్థులను పరీక్షలు ఎలా రాస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. 8, 9 తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్స్ ఎలా ఉపయోగపడుతున్నాయని ఐఎఫ్‌పీ ప్యానల్‌ను ఎలా ఉపయోగించాలని విద్యార్థులను ప్ర శ్నించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధి సంతృప్తిగా ఉన్నట్లు జీసీడీవో తెలిపారు. ఈమె వెంట ప్రిన్సిపాల్ ఎస్.మారుతీదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉచిత వాటర్ ట్యాంకర్ ప్రారంభం

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 6: రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీశైలం వెళ్లే భక్తులకు అవసరమైన ఉచిత మినరల్ కూలింగ్ వాటర్ ట్యాంకర్‌ను బుధవారం ప్రారంభించారు. నియోజకవర్గ కన్వీనర్ గుంటక సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లుగా వడివేలు రెడ్డి, రమణారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్ష్మీరెడ్డి, వెంకటరామిరెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం


పొదిలి, మార్చి 6 : పొదిలి బోర్డు పరిధిలో పొగాకు కొనుగోళ్లు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. బుధవారం వేలం నిర్వహనాధికారి గిరిరాజకుమార్‌తోపాటు సంబంధిత అధికారులు, రైతు సంఘ నాయకులు, రైతులతో ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించి వేలాన్ని ప్రారంభించారు. ఆముదాలపల్లి, అగ్రహారం, కెల్లంపల్లి గ్రామాల నుంచి వచ్చిన 27 పొగాకు బేళ్లను వేలంలో ఉంచారు. కనిష్ఠ, గరిష్ఠంగా అన్ని బేళ్లు కిలో రూ.230 ధర పలికాయి. వేలం ప్రారంభానికి ముందు వేలంలో పాల్గొన్న కంపెనీ ప్రతినిధులతో వేలం నిర్వహనాధికారి మాట్లాడుతూ ఈ ఏడాది ఎన్నో ఒడిదొడుకులకు ఎదుర్కొని పొగాకు సాగు చేశారనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. కనుక ధరల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేలం కొనసాగించాలని కంపెనీ ప్రతినిధులను కోరారు. ప్రతి ఏడాది అ న్నదాతలకు దిగుబడిలోగాని, ధరల్లో గాని ఇబ్బందులు వస్తున్నాయని విషయం గుర్తుంచుకొని ధరలు నిర్ణయించాలని ఆయన సూచించారు. రైతు సంఘ నాయకులు మాట్లాడుతూ కంపెనీ ప్రతినిధులు రైతు కష్టాన్ని పరిగణలోకి తీసుకొని ధరల్లో వ్యత్యాసం లేకుండా చూడాలని కోరారు. ఈ ఏడాది పెరిగిన వ్యవసాయ ఖర్చులను మించలంటే సుమారుగా రూ.250పైగా ధరలు ఉండేలా చూడాలని రైతులు కోరుతున్నారు. ఈఏడాదైనా ఈ ధర చివరి వరకూ ఉంటుందా లేదా అన్న సందేహం కలుగుతోందని రైతులు అంటున్నారు. గత ఏడాది మొదటిలో రూ.200 పలికిన ధర చివరలో బాగా పెరగడాన్ని దృష్టిలో పెట్టుకొని రైతులు బేళ్లను అమ్మకానికి తీసుకురావడానికి ఆసక్తి చూపడంలేదని కొందరు చర్చించుకుంటున్నారు.

హంసవాహనంపై నిర్మ మహేశ్వరుడు



పొదిలి, మార్చి 6 : పార్వతీ సమేత నిర్మామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు హంసవాహనంపై చతుర్ముఖ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాలను దేవాలయ సంప్రదాయం గా మేళతాలాలతో దేవాలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూ జలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పట్టణంలో ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



బహుమతులను ఇస్తున్న హనుమారెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 6: నేటి పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వీహెచ్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి అన్నారు. ఇందిర ఇంజనీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. హనుమారెడ్డి మాట్లాడుతూ ప్రగతిశీల సమాజ నిర్మాణంలో స్త్రీ విద్యకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకుని అన్ని రంగాలలో అగ్రగాములుగానిలవాలన్నారు. వివిధ పోటీలలో గెలుపొందిన వి ద్యార్థినిలకు ఆయన బహుమతులను అందించారు. కార్యక్రమంలో కనిగిరి నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి డి.నారాయణ, ప్రిన్సిపాల్ డా. ఉషా ఈశ్వరన్, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలానికి 25 ప్రత్యేక బస్సులు

పొదిలి, మార్చి 6 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీశైలానికి పొదిలి ఆర్టీసీ డిపో నుంచి 25 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ జే సుందరరావు బుధవారం తెలిపారు. శ్రీశైలానికి 25, రామతీర్థానికి 10 బస్సులు శుక్రవారం నుంచి నడపనున్నట్లు చెప్పారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

బీసీలకు టీడీపీ పెద్దపీట
డిక్లరేషన్‌పై బీసీ నాయకుల హర్షం

మార్కాపురం రూరల్, మార్చి 6: టీడీపీ, జనసేన పార్టీలు సంయుక్తంగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో రాష్ట్రంలోని బీసీలందరికీ పెద్దపీట వేశాయని టీడీపీ బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం బీసీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి కనిగిరి బాల వెంకటరమణ మాట్లాడుతూ.. తెలుగుదేశం, జనసేన పార్టీ సంయుక్తంగా ప్రకటించిన జయహో బీసీ డిక్లరేషన్‌తో ప్రతి బీసీ కుటుంబంలో పండుగ వచ్చిందన్నారు. బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ ప్రకటించడం ఆర్థిక ధైర్యాన్ని నింపిందన్నారు. దాదాపు 300 బీసీ సోదరులను వైసీపీ నాయకులు పొట్టన పెట్టుకున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై బీసీలపై దాడులు జరుగకుండా ఉండేందుకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకొచ్చారన్నారు. రాబోయే ఐదేళ్లలో బీసీ సబ్ ప్లాన్ ద్వారా లక్షన్నర కోట్లు ఖర్చు చేయనున్నట్లు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ప్రకటించడం సంతోషకరమని అన్నారు. ఇలా ఒకటేమిటి ఎన్నో పథకాలను బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన టీడీపీ, జనసేన పార్టీలకు బీసీ కులాలు రుణపడి ఉంటాయన్నారు. సమావేశంలో తెలుగుదేశం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దూదేకుల మస్తాన్, మార్కాపురం ఏఎంసీ మాజీ చైర్మన్ కాకర్ల శ్రీనివాసులు, 33వ వార్డు కౌన్సిలర్ నాలి కొండయ్య, రాష్ట్ర నగర ఉప్పర సాధికారిక కమిటీ సభ్యులు మట్టం వెంకటేశ్వర్లు, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు పిన్నిక శివ, దొండపాటి వెంకటేశ్వర్లు, పొత్తం ప్రసాద్, ఉప్పులదిన్నె శ్రీనివాసులు, గుంజే వెంకట రాముడు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలో చేరిన 20 కుటుంబాలు
పార్టీలోకి ఆహ్వానించిన ఎరిక్షన్‌బాబు


20 మంది అనుచరులతో టీడీపీలో చేరిన వార్డు సభ్యుడు వెంకటేశ్వర్లు

ఎర్రగొండపాలెం, మార్చి 6 : ఎర్రగొండపాలెం గ్రామ పంచాయతీ 7 వార్డు సభ్యుడు ఓర్సు వెంకటేశ్వర్లు తమ అనుచరులు 20 కుటుంబాలవారు వైసీపీ వీడి టీడీపీలో బుధవారం చేరారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్ బాబు సమక్షంలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీ అధికారంలోకి వస్తుందని, అందరికీ అందుబాటులో ఉండి మీ సమస్యలను పరిష్కరిస్తానని ఎరిక్షన్ హామీ ఇచ్చారు. తన విజయానికి కలిసి పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. కా ర్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు చేకూరి సుబ్బారావు, నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 6 : పట్టణంలోని పలు వార్డులలో పారిశుధ్య పనులలో నిర్లక్ష్యం వద్దని మున్సిపల్ కమిషనర్ ఈ.కిరణ్ అన్నారు. బుధవారం పలు వార్డులలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలోని మెయిన్ రోడ్డుతో పాటు అన్ని రోడ్లు శుభ్రంగా ఉంచాలన్నారు. ఎప్పటికప్పుడు ట్రాక్టర్ ద్వారా చెత్తను తొలగించాలన్నారు. ప్రజలు, వ్యాపారులు బహిరంగ ప్రదేశాలలో, సైడు కాలువలలో వాడుక లేని ప్రదేశాలలో చెత్త, వ్యర్థాలు వేయకుండా చూడాలన్నారు. చెత్తను ట్రాక్టర్‌లలో, ఆటోలలో పారిశుధ్య కార్మికుల రిక్షాలలో వేయాలన్నారు. 120 మైక్రాన్ మందం తక్కువ గల ప్లాస్టిక్ కవర్‌లను వాడరాదన్నారు. క్యాక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

మంత్రిని పిలిచారు.. ఎంపీపీ ప్రారంభించారు

పెద్ద దోర్నాల, మార్చి 6 : నూతనంగా నిర్మించిన మండల పరిషత్ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు మున్సిపల్ శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను ఆహ్వానించారు. శిలా ఫలకం కూడా వేయించారు. కానీ బుధవారం ఎంపీపీ గుమ్మా పద్మజ ప్రారంభించారు. సుమారు కోటి రూపాయలకు పైగా నిధులతో నిర్మించిన ఎంపీడీవో కార్యాలయ భవనాన్ని మంత్రి సురేష్ ప్రారంభించాల్సి ఉంది. అయితే నియోజకవర్గ సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్‌కు మంత్రి సురేష్‌కు మధ్య సమన్వయం కొరవడింది. దీంతో అధికారికంగా చంద్రశేఖర్ హాజరుకాలేని పరిస్థితులు నెలకొనడం, మంత్రి సురేష్‌కు ఉదయం జరిగిన ఘటన తీవ్రంగా కలిచివేయడంతో పాటు ఇద్దరి మధ్యా సమన్వయం లేకనే ఎవరూ హాజరు కాకపోవడంతో మండల నాయకులే ప్రారంభించినట్లుగా ఆపార్టీ నాయకులు చెప్పుకోవడం గమనార్హం. ఏది ఏమైనా వైసీపీలో సురేష్ వర్గం, తాటిపర్తి వర్గంగా ఏర్పడ్డారని గుసగుస లాడుకుంటున్నారు.

పరీక్షలంటే భయం వీడాలి

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 6: విద్యార్థులు పరీక్షలంటే భయం వీ డాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రయ్య అన్నారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు అవసరమైన నియమ నిబంధనలు సూచనలతో కూడిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేసీ గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, ఎస్టీయూ నాయకులు విరల్, ఫ్రాంచీస్, హనుమంతరావు, రవికుమార్, హనుమంతాచారి, సత్య రమేష్ తదితరుల పాల్గొన్నారు.

రైతులకు తుఫాన్ నష్టపరిహారం అందజేత


చెక్కును అందజేస్తున్న జేసీ గోపాలకృష్ణ

మార్కాపురం రూరల్, మార్చి 6 : మిచౌంగ్ తుఫాన్ వలనజిల్లాలో నష్టపోయిన 3775 మంది రైతులకు రూ.2.82కోట్లు బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో జేసీ గోపాలకృష్ణ అధికారులతో కలిసి నిధులు విడుదల కార్యక్రమం నిర్వహించారు. మార్కాపురం నియోజకవర్గంలో 631 మంది రైతులకు రూ.27.38 లక్షల నష్టపరిహారం అందించినట్లు తెలిపారు. వైపాలెం 1418 మందికి రూ.1.10 కోట్లు విడుదలైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, మార్కాపురం ఏడీఏ రమాదేవి, ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, హెచ్‌ఓ రమేష్ బాబు, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వెలిగొండ ప్రారంభం సిగ్గుసిగ్గు..!

- నల్ల బెలూన్లతో నిరసన
- పనులు పూర్తి చేయకుండా, నీళ్లు లేకుండా శిలాఫలకమా
- నిర్వాసితులకు పరిహారానికి బదులు నోటీసులివ్వడం అన్యాయం
- ఎన్నికల లబ్ధి కోసం మోసానికి తెరలేపిన జగన్‌రెడ్డి
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎరిక్షన్‌బాబు
- అధికారంలోకి రాగానే వెలిగొండను పూర్తి చేస్తాం


నల్లబెలూన్లతో నిరసన తెలుపుతున్న ఎరిక్షన్‌బాబు, టీడీపీ నాయకులు

ఎర్రగొండపాలెం, మార్చి 6 : వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తి చేయకుండా నీళ్లు లేకుండా ఎన్నికల్లో లబ్ది కోసం సీఎం జగన్‌రెడ్డి ప్రారంభించడం సిగ్గుచేటని ఎర్రగొండపాలెం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. పనులు పూర్తి కాకుండా వెలిగొండను ప్రారంభిండంపై టీడీపీ ఆధ్వర్యంలో బుధవారం టీడీపీ కార్యాలయం ఎదుట నల్లబెలూన్లను గాలిలోకి వదిలి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ రెండు సొరంగాలు పూర్తయ్యాయని శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి జాతికి అంకితం అంటూ జగన్‌రెడ్డి ప్రజలను మోసం చేశారన్నారు. ప్రాజెక్టు పరిధిలో 7వేల మంది భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాల్సి ఉందన్నారు. పెద్దారవీడు, మార్కాపురం, అర్ధవీడు మండలాల్లో 11 ముంపు గ్రామాలను తరలించాల్సి ఉందని తెలిపారు. ఒక్కో నిర్వాసితునికి రూ.12.50 లక్షల వంతున రూ.1500 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. టీడీపీ ప్రభుత్వం రూ.1450 కోట్లు ఖర్చుచేస్తే, వైసీపీ ఈ ఐదేళ్లలో కేవలం రూ.958 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ప్రాజెక్టుపై నిర్లక్ష్యం చూపిందన్నారు. దీంతో ప్రాజెక్టు వ్యయం రూ.10వేల కోట్లకు చేరిందన్నారు. మరో రూ.4వేల కోట్లు ఖర్చు చేస్తేగాని ప్రాజెక్టు పూర్తి కాదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ప్రాజెక్టును పూర్తి చేస్తామని తెలిపారు. నిర్వాసితులకు పరిహారం ఇవ్వకపోగా పోలీసులతో నోటీసులు ఇప్పించడం అన్యాయమని ఎరిక్షన్‌బాబు అన్నారు. కొల్లంవాగు వద్ద రెగ్యులేటరీ పనులు, డిస్ట్రిబ్యూటరీ కాలువ పనులు పూర్తి కాకుండానే ప్రారంభ కార్యక్రమం నిర్వహించడం ఓట్లు దండుకోవడానికి చేస్తున్న మరో మోసమని పేర్కొన్నారు. జగన్‌రెడ్డి మాయలు, అబద్ధపు మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, ఎన్నికల్లో గద్దె దింపుతారని ఎరిక్షన్‌బాబు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మార్కాపురంలో బాబు ష్యూరిటీ కార్యక్రమం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కందుల, పొదిలిలో విఘ్నేష్‌రెడ్డి, గిద్దలూరులో కౌన్సిలర్ జయలక్ష్మి

ప్రత్యేక జిల్లాకా.. లేక విధ్వంస వైసీపీ పాలకులకా..?

ఓటు ఎవరికి వేస్తారో ఆలోచించండి
మాజీ ఎమ్మెల్యే కందుల

మార్కాపురం రూరల్, మార్చి 6: వచ్చే ఎన్నికల్లో మార్కాపురం ప్రజలు ప్రత్యేక జిల్లాకు ఓటు వేస్తారా.. లేక విధ్వంస వైసీపీ పాలకులకు ఓటు వేస్తారో ఆలోచించాలని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పట్టణంలోని 16వ వార్డులో మన కోసం - మన కందుల, భవిష్యత్‌కు గ్యా రెంటీ కార్యక్రమం బుధవారం రాత్రి నాయకు లు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పూర్తి కాని వెలిగొండ ప్రాజెక్టును జగన్‌రెడ్డి ప్రారం భించడం ప్రజలను మోసగించడమేనన్నారు. ముంపు గ్రామాల ప్రజల నోట్లో మట్టి కొట్టార ని వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం అంతా ఎన్నికల స్టంట్ అని అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే వెలిగొండ పూర్తవు తుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పోల్ మేనేజిమెంట్ క్లస్టర్ ఇన్‌చార్జి కం దుల రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతమ్మ, జిల్లా జనసే న పార్టీ ప్రధాన కార్యదర్శి సాధిక్, పట్టణ తె లుగు మహిళలు, పట్టణ టీడీపీ, జనసేన నాయకులు, 16వ వార్డు తెలుగుదేశం-జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే పేదలకు భరోసా

గిద్దలూరు టౌన్ : తెలుగుదేశం పార్టీతోనే పేదలకు భరోసా కలుగుతుందని 7వ వార్డు కౌన్సిలర్ బిల్లా జయలక్ష్మి అన్నారు. టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల సూపర్‌సిక్స్‌లో భాగంగా బుధవారం పట్టణంలోని 7వ వార్డులో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌన్సిలర్ బిల్లా జయలక్ష్మి, టీడీపీ నాయకులు బిల్లా రమేష్ ఆధ్వర్యంలో నాయకులు ప్రతి ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అమలు చేయనున్న సూపర్‌సిక్స్ పథకాలతో చేకూరే లబ్ధిని మహిళలకు వివరించారు. గతంలో అశోక్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న కాలంలో, ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని బేరీ జు వేసుకోవాలన్నారు. రాష్ట్ర భవిష్యత్‌ను, నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని టీడీపీని గెలిపించుకోవాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దుత్తా బాలీశ్వరయ్య, బాలచెన్నయ్య, పందీటి ర జని పాల్గొన్నారు. అలాగే నగర పంచాయతీ పరిధిలోని చట్రెడ్డిపల్లెలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విజయమే అజెండాగా పని చేయాలి

పొదిలి : ఎన్నికల్లో టీడీపీ విజయమే అజెండాగా కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు విఘ్నేష్‌రెడ్డి టీడీపీ శ్రేణులను కోరారు. బుధవారం పట్టణంలోని టైలర్స్ కాలనీలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడారు. చిన్నాభిన్నమైన రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు పాలన రావాలన్నారు. ఐదేళ్లలో పాలనలో నవరత్నాల పేరుతో జగన్‌రెడ్డి ప్రజలను చేశారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే పశ్చిమ ప్రకాశం అభివృద్ధి చెందుతుందని, వెలిగొండను పూర్తి చేసి సాగు తాగునీటిని అందించే సత్తా చంద్రబాబుకే ఉందన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి టీడీపీకి పట్టంగట్టాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం

బేస్తవారపేట : టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు సోరెడ్డి మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పూనూరు భూపాల్‌రెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఎంపీ చెరువు పంచాయతీలోని కొత్తపేట గ్రామంలో ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను మహిళలకు, ప్రజలకు వివరించారు. టీడీపీ హయంలో జరిగిన అభివృద్ధిని గుర్తు చేశారు. జగన్‌రెడ్డి పాలనలో రౌడీపాలన, అవినీతి పెరిగిపోయిందని, రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తాళ్ల శ్రీనివాసరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతల అగ్రహారంలో బాబు ష్యూరిటీ

పెద్ద దోర్నాల : మండలంలోని చింతల అగ్రహారం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ ఒంగోలు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరిస్తూ ఈ ప్రభుత్వంలో కోల్పోయిన నష్టాన్ని తెలియజేశారు. అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఇక మంచి రోజులు రాబోతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ జనసేన ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 3 గ్యాస్ సిలెండర్లు అందజేత, కుటుంబంలో ఎంత మంది ఆడ పిల్లలున్నా నెలకు రూ.1500, ఏటా రూ.15,000లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రైతులకు రూ.20వేల పెట్టుబడి సాయమందించనున్నట్లు, నిరుద్యోగులకు రూ.3వేలు మంజూరు, ఏటా లక్షల్లో ఉపాధి కల్పించనున్నట్లు చెప్పారు. ఎర్రగొండపా లెం టీడీపీ అభ్యర్థి ఎరిక్షన్‌బాబుకు సైకిల్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవడం ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్‌ను రూపొందించుకుందామని అభ్యర్థించారు.


బీపేట, పెద్ద దోర్నాలలో సూపర్‌సిక్స్ కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

హాస్టల్ మరమ్మతులపై నివేదిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మార్కాపురం రూరల్, మార్చి 6 : వసతి గృహంలో సమస్యల తిష్ఠ శీర్షికన ఈనెల 4వ తేదీన ఆంధ్రజ్యోతి పత్రికలో ప్రచురితమైన కథనానికి ఏఎస్‌డబ్ల్యూవో అరుణ స్పందించారు. ఈ సందర్భంగా ఆమె ప్రకటన ద్వారా వివరణ ఇచ్చారు. మండలంలోని గజ్జలకొండ ఎస్సీ హాస్టల్ మరమ్మతుల కోసం రూ.35 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు తెలిపారు. కాంపౌండ్ వాల్ వెనుక ఉన్న మద్యం సీసాలను తొలగించాలని ఆదేశించామని తెలిపారు. హాస్టల్లోని విషసర్పాలు, జంతువులు రా కుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆ ప్రకటనలో తెలిపారు.

టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం

బీసీ డిక్లరేషన్‌తో హర్షం వ్యక్తం చేసిన నేతలు

చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకాలు

తెలుగుదేశంలో చేరిన 37 యాదవ సామాజిక వర్గ కుటుంబాలు

కనిగిరి, మార్చి 6 : టీడీపీలోనే బీసీలకు సముచిత స్థానం ఉంటుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో బుధవారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ పాలనలో 75వేల కోట్ల బీసీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి మళ్లించారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ సబ్‌ప్లాన్ నిధులను వారికే ఉపయోగించేలా ప్రత్యేక చట్టం చేస్తామని చెప్పారు. స్థానిక సంస్థల్లో, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు వైఎస్ జగన్ 34 నుంచి 24 శాతానికి తగ్గించారని తెలిపారు. ఎన్నికలకు ముందు మద్యపాన నిషేధాన్ని విడతల వారీగా చేస్తానని జగన్ హామీ ఇవ్వగా.. అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలో తొక్కి నేరుగా వైసీపీ నేతలే నాసిరకం మద్యం అమ్మకాలు చేస్తున్నారని విమర్శించారు. బీసీలకు డిక్లరేషన్ ప్రకటించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ చంద్రబాబు, పవన్ చిత్రపటాలకు వివిధ బీసీ సంఘాల నేతలు పాలభిషేకం చేశారు. చంద్రబాబు ఫేస్ మాస్కులు ధరించి హర్షం వ్యక్తం చేస్తూ జయజయ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొందరు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. సీఎస్‌పురం మండలంలోని చెన్నపునాయునిపల్లికి చెందిన యాదవ సామాజికవర్గానికి చెందిన 37 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. అదేవిధంగా హనుమంతునిపాడు మండలంలోని వేములపాడు గ్రామానికి చెందిన 13 దళిత కుటుంబాలు డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీఎస్‌పురం, హనుమంతునిపాడు మండల పార్టీ అధ్యక్షులు బొమ్మనబోయిన వెంగయ్య, మాజీ ఎంపీపీ తోడేటి అల్లూరయ్య, సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్‌టీఆర్), గాయం తిరుపతిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



డాక్టర్ ఉగ్ర సమక్షంలో టీడీపీలో చేరిన యాదవ సామాజికవర్గం కుటుంబాలు

సంధానిని ఆదర్శంగా తీసుకోవాలి

మన టీడీపీ యాప్ ద్వారా పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేసి గుర్తింపు తెచ్చుకున్న రోషన్ సంధానిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి చెప్పారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో మైనారిటీ నాయకులు రోషన్ సంధానికి రాష్ట్రపార్టీ కార్యాలయం నుంచి వచ్చిన సైకిల్ మెమొంటోను అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంషరీ పాల్గొన్నారు.



పీసీపల్లిలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎబినేజరు

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీదే విజయం

పీసీపల్లి, మార్చి 6 : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలు అత్యధిక స్థానాలు గెలుస్తాయని నియోజకవర్గ తెలుగురైతు ప్రధాన కార్యదర్శి బద్ధిపూడి ఎబినేజరు చెప్పారు. పీసీపల్లిలో బుధవారం పార్టీశ్రేణులతో కలిసి బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీపీ పాలూరి మహేంద్ర, నాయకులు వేమూరి చినమాలకొండయ్య, చొప్పరపు ధనమ్మ, సుబ్బులు, పద్మ, కె.ధనమ్మ, శివ బ్రదర్స్ పాల్గొన్నారు.

వ్యవసాయానికి తొమ్మిది గంటల పాటు కరెంటు

ట్రాన్స్‌కో డీఈఈ కరీం



రికార్డులను పరిశీలిస్తున్న డీఈఈ కరీం

ముండ్లమూరు, మార్చి 6 : వ్యవసాయానికి తొమ్మిది గంటల పాటు విద్యుత్ సౌకర్యం అందిస్తున్నట్లు దర్శి డివిజన్ ట్రాన్స్‌కో డీఈఈ ఎస్ఏ కరీం చెప్పారు. ఆయన బుధవారం మండలంలోని శంకరాపురం సబ్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. శంకరాపురం సబ్‌స్టేషన్ నుంచి రైతులకు త్రీఫేజ్ సౌకర్యంలో అంతరాయం ఏర్పడటానికి ప్రధానంగా అద్దంకిలో 133 సబ్‌స్టేషన్‌లో ఈసీబీలో ఏర్పడిన సాంకేతిక లోపం వల్ల మూడు రోజుల పాటు త్రీఫేజ్ ఇవ్వలేకపోయామన్నారు. ఇక నుంచి తొమ్మిది గంటలపాటు నిరంతరంగా సౌకర్యం కల్పిస్తామని డీఈఈ చెప్పారు. రైతులకు ఏమైనా సమస్య తమకు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో దర్శి ఏడీఈ కే పిచ్చయ్య, ఇన్‌చార్జ్ ఏఈ ఏవీ బ్రహ్మం, లైన్ ఇన్‌స్పెక్టర్ సాంబయ్య, లైన్‌మెన్ అంజనేయులు పాల్గొన్నారు.

వేసవి కాలంలో ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

ముండ్లమూరు, మార్చి 6 : రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ వంద రోజుల పాటు పని కల్పించాలని ఉపాధి హామీ పథకం ఏపీవో నాగరాజు ఆదేశించారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్, మే, జూన్‌లలో మూడు నెలల పాటు పనికల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఉందన్నారు. బోగస్ మస్టర్లు వేసిన ఫీల్డ్ అసిస్టెంట్‌ల పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనోత్పత్తి పొగాకు పొలాన్ని పరిశీలించిన అధికారులు



పొగాకుతోటను పరిశీలిస్తున్న డైరెక్టర్ మాగంటి వేణుమాధవ్

తాళ్లూరు, మార్చి 6 : సీటీఆర్ఐ వారి ఆధ్వర్యంలో విఠలాపురం గ్రామంలో ఆదర్శ రైతు నవులూరి సురేంద్రమోహన్‌రావు సాగు చేసిన మేలైన పొగాకు పంటను సీటీఆర్ఐ డైరెక్టర్ మాగంటి వేణుమాధవ్ బుధవారం పరిశీలించారు. సీటీఆర్ఐవారు గ్రామంలో ఎఫ్‌సీఆర్-15 రకం పొగాకు విత్తనోత్పత్తిని చేపట్టారు. మొక్కలు ఏపుగా పెరిగి ఉండటం, ఆకు పెరుగుదల బాగా ఉండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ రకం పంట దిగుబడి అధికంగా వస్తుందని తెలిపారు. సురేంద్రమోహన్ పంటలోని మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ యాజమాన్య పద్ధతుల్లో సాగు చేయటం వల్ల మంచి దిగుబడి రానున్నదని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సీటీఆర్ఐ హెడ్ డాక్టర్ ఎం అనూరాధ, సైంటిస్ట్ డాక్టర్ కె.గంగాధర్ పాల్గొన్నారు.

పొగాకు వేలం ప్రారంభం

తొలిరోజు రూ.230 పలికిన ధర

కనిగిరి, మార్చి 6 : కనిగిరి టుబాకో యార్డులో బుధవారం పొగాకు వేలం ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజు బిడ్ ధర రూ.230 పలుకగా, 18 బేళ్లు అమ్ముడైనట్లు వేలం నిర్వహణాధికారి కోటేశ్వరరావు తెలిపారు. వేలంలో 10 కంపెనీలు పాల్గొనగా, 2,326 కేజీలను 5లక్షల 35వేల 127 రూపాయలకు టుబాకో కంపెనీలు దక్కించుకున్నాయి. వేలంలో ఐటీసీ, జీపీఐ, ప్రీమియర్ టుబాకో ప్యాకర్స్ ప్రగతి, మారుతి, డెక్కన్, ప్రోగ్రెస్, నిఖిల్ కంపెనీలు పాల్గొన్నాయి.

పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

కనిగిరి, మార్చి 6 : పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం నాయకులు పిల్లి తిప్పారెడ్డి కోరారు. టుబాకో వేలం కేంద్రంలో బుధవారం పొగాకు రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి సహకరించని కారణంగా 50శాతం పైగా లోగ్రేడ్ పొగాకు దిగుబడి వచ్చిందని తెలిపారు. రైతులకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. గిట్టుబాటు ధరలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సగటున కేజీకి కనీసం రూ.250 ధర ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పొందూరు రవీంద్ర, ఆరికట్ల బ్రహ్మయ్య, బాలు కోటేశ్వరరావు, మాలకొండయ్య, ఎం వెంకటరెడ్డి, కుందురు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ విద్యుత్ ఈయూకి రాజీనామా

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 6 : వైఎస్ఆర్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్‌కు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపర్తి చంద్రశేఖర్‌రెడ్డి తన పదవీకి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ప్రకటనలో తెలిపారు. యూనియన్‌లో పనిచేస్తూ విద్యుత్ కార్మికులకు ఎటువంటి మేలు చేయలేకపోయానని, కార్మికుల సమస్యలు పరిష్కరించలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కాపురం విద్యుత్ శాఖ ఈఈ కార్మికుల సమస్యలపై దాటవేత వైఖరికి నిరసనగా యూనియన్ రాష్ట్ర నాయకత్వం గానీ, జిల్లా నాయకత్వం గానీ ఎటువంటి కార్యాచరణ చేయకపోగా నిర్లక్ష్యం వహిస్తున్నందున యూనియన్‌కు రాజీనామ చేసినట్లు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

వైసీపీకి ఓటమి తప్పదు



మాట్లాడుతున్న అరుణ

పీసీపల్లి, మార్చి 6 : త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఘోరమైన ఓటమి తప్పదని జనసేన అధికార ప్రతినిధి రాయపాటి అరుణ చెప్పారు. మండలంలోని పెదయిర్లపాడులో ఆ పార్టీ కార్యాలయాన్ని పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం ప్రారంభించారు. తొలుత జనసేన పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో పాదయాత్ర చేసిన జగన్మోహన్‌రెడ్డి ఒక్కసారి ఒక్కచాన్స్ అంటూ ప్రజలతో ఓట్లు వేయించుకున్న ఆయన అధికారంలోకి రాగానే అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. అనంతరం జనసేన నాయకులు రమేష్ ఏర్పాటు చేసిన వీధిలైట్లను పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్, కనిగిరి నియోజకవర్గ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ వరికూటి నాగరాజు, మండలపార్టీ అధ్యక్షుడు బండారు రాజు, మాదాసు రమేష్ ఉన్నారు.

మైకు పట్టుకుంటే మాపై నిందలు..!

ఒంగోలు(కార్పొరేషన్), మార్చి 6 : "ఆయన నోరు తెరిస్తే అబద్ధాలు. మైకు పట్టుకుంటే మాపై నిందలు. అబద్ధాలు చెబితే అన్ని నిజాలు అయిపోవు. సీనియర్ అంటావు.. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుంది. ఇప్పటికైనా నాటకాలు ఇకచాలించాలి. టీడీపీ అధికారంలోకి రాగానే అన్నీ లెక్కలు తేలుస్తాం." ఇదీ ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఘాటుగా ధ్వజమెత్తారు. బుధవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దామచర్ల మాట్లాడుతూ షాదీఖానా సాక్షిగా సిగ్గులేకుండా మాట్లాడటంమాని గతాన్ని ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. తన తాత దామచర్ల అంజనేయులు మార్కెటింగ్‌శాఖ మంత్రిగా ఎకరా స్థలాన్ని కేటాయించారని, ఆ సమయంలో ఎంపీలు లాల్‌జాన్ బాషా, బలరాంలు రూ.కోటి నిధులు కేటాయించారని తెలిపారు. ఆ తర్వాత మాగుంట ఎంపీ నిధుల కింద రూ.75లక్షలు ఇచ్చారన్నారు. ఆ తర్వాత టీడీపీ అధికారంలోకి వచ్చి రూ.1.5 కోట్లు కేటాయించి, మొదటి అంతస్తు పూర్తిచేసి, 2వ అంతస్తు పిల్లర్లు కూడా వేసినట్లు దామచర్ల వెల్లడించారు.

వైసీపీ నన్ను మోసం చేసింది


మొగళ్లూరు గ్రామ నేత వెంకటేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న వెంకటేశ్వర రెడ్డి

వెలిగండ్ల, మార్చి 6 : గత ఎన్నికలలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ గెలుపునకు, వైసీపీ అధికారంలోకి రావడానికి ఆస్తులు తాకట్టు పెట్టి మరీ పార్టీని గెలిపించామని, కాని తమకు తగిన గుర్తింపు లేకపోగా ఆర్థికంగా చితికిపోయామని మండలంలోని మెగుళ్లూరు పంచాయతీకి చెందిన మండల వైసీపీ నాయకులు కర్నాటి వెంకటేశ్వర రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వెలిగండ్లలో బుధవారం ఆయన నాయకులతో కలిసి మాట్లాడారు. తనను వైసీపీ మోసం చేసినందుకు పార్టీ మారుతున్నట్లు చెప్పారు. కనిగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యేగా ఉగ్ర నరసింహారెడ్డిని గెలిపించుకోవాలన్నారు. వైసీపీని వీడి ఈ నెల 14వ తేదిన ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో తన అనుచరులతో టీడీపీ పార్టీలో చెరుతున్నట్లు తెలిపారు.

ఓటర్లకు వీవీప్యాట్‌లపై అవగాహన కలిగించాలి



ఈవీఎంలను పరిశీలిస్తున్న తహసీల్దార్ హుస్సేన్

తాళ్లూరు, మార్చి 6 : ఎన్నికల్లో వినియోగిస్తున్న ఓటింగ్ యంత్రాలకు వాడే వీవీప్యాట్‌లపై ఓటర్లకు సెక్టోరియల్ అధికారులు అవగాహన కల్గించాలని తహసీల్దార్ ఎస్కే మహమ్మద్ హుస్సేన్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌వో, సెక్టార్ సూపర్‌వైజర్స్, సెక్టార్ అధికారులకు ఓటింగ్ యంత్రాల వీవీప్యాట్‌లపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బీఎల్‌వోలు, సెక్టోరియల్ అధికారులు వీవీఎంలను ఎలా వాడాలో క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ యంత్రాల్లో ఓటరు తాము ఎవరికి ఓటు వేశామో తెలుసుకునేందుకు ఎన్నికల కమిషన్ వీవీప్యాట్‌లను ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ అధికారులు ఎంఈవో సుబ్బయ్య, ఎంఈవో-2 సుధాకర్‌రావు, ముండ్లమూరు ఈవో ఆర్‌డీ హైమావతి, వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు పాల్గొన్నారు.

రైతుల ఉత్పత్తులకు విలువ పెంచటమే లక్ష్యం

తాళ్లూరు, మార్చి 6 : సాంకేతిక పరిజ్ఞానంతో పంట సాగులో మార్పులు చేపట్టి నాణ్యమైన ఉత్పత్తులు సాధించి గిట్టుబాటు ధరలు పెంచటమే ప్రభుత్వ లక్ష్యమని దర్శి వ్యవసాయశాఖ ఏడీఏ బాలాజీ నాయక్ చెప్పారు. శివరాంపురం గ్రామంలో జరిగిన పొలంబడి కార్యక్రమలో ఆయన రైతులతో బుధవారం మాట్లాడారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుణంగా పంటలు సాగు చేయాలన్నారు. దీనివల్ల నాణ్యమైన ఉత్పత్తులు సాధించి, పంట దిగుబడులు అధికంగా పొంది, గిట్టుబాటు ధరలు వస్తాయన్నారు. ఎంపిక చేయబడిన రైతులకు పురుగు మందు నివారణకు నీమాస్త్రం తయారీ విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. వీపీఏ రాజశేఖర్‌రెడ్డి, ఏఈవో నాగరాజు, వెంకట్రావు, ఎఫ్‌పీవో సీఈవో సురేష్, పాల్గొన్నారు.

నుచ్చుపొదలో వైసీపీని వీడిన 40 కుటుంబాలు

పామూరు, మార్చి 6 : మండలంలోని నుచ్చుపొద గ్రామంలో బుధవారం రాత్రి ఉప సర్పంచ్ గోళ్ల వెంకటేశ్వర్లు, ఐదుగురు వార్డు మెంబర్లతో పాటు సుమారు 40 కుటుంబాలవారు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారి మెడలలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉగ్రనరసింహారెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వార్డు మెంబర్లు కొలనీడి రామకృష్ణ, ప్రభావతి, బేబి, చిన్నఖాశిం, రసూల్‌పీరాంబి, 40 కుటుంబాలు వారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు పువ్వాడి వెంకటేశ్వర్లు, దశరథరాములు పాల్గొన్నారు.

నీటి విడుదలపై రైతుల ఆగ్రహం

పామూరు, మార్చి 6 : మండలంలోని మోపాడు రిజర్వాయర్ నీటిని ఇరిగేషన్ శాఖ అధికారులు రాత్రి సమయంలో అక్రమంగా విడుదల చేయడంపై ఆయకట్టు రైతులు ఆగ్రహించారు. 20 అడుగుల మేర నీటి మట్టం ఉన్నప్పుడే నెల్లూరు జిల్లా కొండాపురం ఆయకట్టుకు నీరు ఇవ్వాలి. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 10 అడుగు నీటిమట్టమే ఉంది. అలాంటప్పుడు వారికి నీటిని ఎలా వదులుతారని రైతులు ప్రశ్నించారు. దీనిపై ఇరిగేషన్ డీఈ రవి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటిని విడుదల చేశామన్నారు.



ఏఈని ప్రశ్నిస్తున్న రైతులు

ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు అడ్మిషన్లు

దొనకొండ, మార్చి 6 : మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో 25 శాతం అడ్మిషన్లు అర్హత గల పేద విద్యార్థులకు కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయించిందని ఎంఈవో సాంబశివరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఈ నెల 25వ తేదీ వరకు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. దొనకొండలోని విశ్వభారతి, సెయింట్ ఆంథోనీస్, సాయి విజ్ఞాన్, చందవరంలోని గౌతమబుద్ధ తదితర పాఠశాలల్లో చేర్చేందుకు ఆసక్తి గల తల్లితండ్రులు గ్రామ సచివాలయాలు, నెట్ సెంటర్ల ద్వారా మండల విద్యాశాఖ కార్యాలయానికి దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. స్టేట్ సిలబస్ పాఠశాలల్లో చేరదలచిన వారు 2024 జూన్ 1వ తేదీ నాటికి ఐదేళ్లు నిండిన వారై ఉండాలని, సీబీఎస్‌ఈ సిలబస్ పాఠశాలలో చేరదలచిన వారు 2024 ఏప్రిల్ 1వ తేదీ నాటికి ఐదేళ్లు నిండిన వారై ఉండాలని, వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంత వారికి రూ.1.20 లక్షల లోపు మించరాదని తెలిపారు.

50 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రి

పామూరు, మార్చి 6 : మండలంలోని లక్ష్మీనరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవాన్ని విద్యార్థులు బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. పామూరుకు చెందిన వ్యాపారవేత్త షేక్ ఖాజా రూ.10వేల సహాయంతో పదో తరగతి చదువుతున్న 50 మంది విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. ముందుగా పాఠశాలలోని సరస్వతీ తల్లి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం దాత ఖాజాను శాలువాతో సన్మానించారు. హెచ్ సయ్యద్ ఈసాక్, ఉపాధ్యాయులు షేక్ మచ్చా ఖాజాహుసేన్, పీవీ కృష్ణమోహన్, సయ్యద్ ఖాదర్‌వలి పాల్గొన్నారు.









కొండకు ప్రభను తీసుకొస్తున్న మహిళలు, చిన్నారులు



- ఘనంగా శ్రీ త్రికోటేశ్వర స్వామి తిరునాళ్ళ ఉత్సవాలు ప్రారంభం
- స్వామికి విశేష అభిషేకాలు
- కొండకు తరలివచ్చిన చిట్టి పొట్టి ప్రభలు
- గిరి ప్రదక్షిణ చేసిన భక్తులు

కొండంత సంబరం

కోటప్పకొండ(నరసరావుపేట), మార్చి 6: కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి సన్నిధిలో ఏకాదశి పండుగను పురస్కరించుకొని భక్తుల రద్దీ నెలకొంది. తెల్లవారు జాము నుంచే వేలాదిగా భక్తులు కోటప్పకొండకు తరలి వచ్చి స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహాశివరాత్రి రోజున త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో జరిగే తిరునాళ్ళ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొక్కుబడి ప్రభలతో భక్తులు కొండకు తరలి వచ్చారు. నరసరావుపేట నుంచి చిన్నారులు, మహిళలు కాలినడకన కోటయ్య సన్నిధికి చేరుకున్నారు. భక్తులు గిరి ప్రదక్షణ చేశారు. కొండ దిగువన సోపాన మార్గం వద్ద ఉన్న విఘ్నేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి వేలాది మంది భక్తులు మెట్ల పూజ చేశారు. సోపాన మార్గంలో ఉన్న ఆనందవల్లి ఆలయంలో కూడా పూజలు చేశారు. ధ్యాన శివుడు, నాగేంద్రస్వామి పుట్ట వద్ద పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు చేశారు. పొంగళ్ళు చేసి స్వామికి సమర్పించారు.





శ్రీ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో భక్తులు

ఉచిత దర్శనం క్యూలైన్‌లో భక్తుల రద్దీ నెలకొంది. నరసరావుపేట పురపాలక సంఘం ప్రభ కోటప్పకొండకు చేరుకుంది. స్వామి దర్శనం అనంతరం భక్తులు పర్యాటక కేంద్రాన్ని సందర్శించారు. కొండ దిగువన తల నీలాలు సమర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈవో జి.శ్రీనివాసరెడ్డి, ఆలయ ట్రస్టీ రామకృష్ణ కొండలరావు దేవస్థానం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. నరసరావుపేటకు చెందిన శ్రీ షిరిడీ సాయి అన్నపూర్ణ అన్నదాన కమిటీ, ఆర్యవైశ్య సంఘం సేవా సంస్థల ఆధ్వర్యంలో అల్పాహారం, పులిహోర, మజ్జిగ, మంచి నీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి.. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గిరి ప్రదక్షిణ సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

- పోటాపోటీగా విద్యుత్ ప్రభల నిర్మాణం
- ఒక్కో ప్రభ ఎత్తు 90 అడుగులకు పైగా..
- తిరునాళ్ళకు 20 భారీ విద్యుత్ ప్రభల నిర్మాణం

రేపే ప్రభల పండుగ

తిరునాళ్ళకు నెల రోజుల ముందు నుంచే గ్రామాల్లో భారీ విద్యుత్ ప్రభల సందడి మొదలవుతుంది. ఊరంతా కలసికట్టుగా ప్రభ పనుల్లో పాల్గొంటారు. తిరునాళ్ళకు 20 భారీ విద్యుత్ ప్రభలు తరలి వస్తున్నాయి. ఒక్కో ప్రభ నిర్మాణ వ్యయం రూ.25లక్షల నుంచి రూ.35 లక్షల వరకు ఉంటుంది. ప్రభల నిర్మాణంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటున్నారు. గతంలో ఎడ్లతో ప్రభను తరలించేవారు. నేడు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. రాతితో తయారు చేసిన చక్రాల రథాలపై ప్రభలను ఏర్పాటు చేసి కొండకు తరలిస్తారు. ప్రభ పగ్గాలు పట్టేందుకు వందలాది మంది పాల్గొంటారు. రథం ఇరుసు విరిగితే వెను వెంటనే తయారు చేసేందుకు సంబంధిత పనివారు వెంట నడుస్తారు. ప్రభకు ఏర్పాటు చేసే లైట్లు, తోరణాలు అమెరికలో కూడా ప్రత్యేకత సంతరించుకుంటుంది. రంగు రంగుల లైట్లు, వీటిని వెలిగించే విధానం చూపరులను కట్టి పడేస్తుంది. ప్రభల నిర్మాణంలో గ్రామాలకు గ్రామాలు పోటీ పడతాయి. ఈ ప్రభలలో పోస కూర్పు ప్రభలు, మండపాల ప్రభలు, టిక్కీల ప్రభలు, విద్యుత్ ప్రభలు, బాల ప్రభలు ఇలా వివిధ రకాలుగా ఉంటాయి. సాధారణ ప్రభలు అధిక సంఖ్యలో కొండకు తరలి వస్తాయి. ప్రభలపై తిరునాళ్ళలో సంగీత విభావరి, నృత్యాలు నిర్వహిస్తారు. మహాశివరాత్రికి భక్తులు కొండలో జాగరణ చేస్తారు. తిరునాళ్ళ వైభవాన్ని భక్తులు కనులారా వీక్షించి పులకించి పోతారు. నరసరావుపేట మండలంలోని గురవాయపాలెం, ఉప్పలపాడు, కాకాని నుంచి రెండు, ఉప్పలపాడు, గురవాయపాలెం నుంచి కాకాని ఒక్కో భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలి వస్తున్నాయి. చిలకలూరిపేట నియోజకవర్గం పురుషోత్తపట్నం గ్రామం నుంచి 6 ప్రభలు, యడవల్లి, కోమటినేనివారిపాలెం, అవిశాయపాలెం, కమ్మవారిపాలెం, అప్పాపురం, గోవిందాపురం, మద్దిరాల, కావూరు గ్రామాల నుంచి ఒక్కొక్కటి, బొప్పూడి గ్రామం నుంచి రెండు భారీ విద్యుత్ ప్రభలు కొండకు తరలిరానున్నాయి.



గురవాయపాలెం గ్రామంలో తిరునాళ్ళకు నిర్మించిన విద్యుత్ ప్రభ

8 నుంచి 4 గంటల వరకు విద్యుత్ నిలిపివేత

తిరునాళ్లకు వచ్చే ప్రభల కోసం చిలకలూరిపేట రోడ్డులో యూటీ వద్ద ఉన్న హెటీ లైన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ శాఖ ఈఈ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. తిరునాళ్ల రోజున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని చెప్పారు. అలాగే తిరునాళ్ల మరుసటి రోజు శనివారం ప్రభలు తిరిగి గ్రామాలకు తరలించేందుకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. గతంలో రెండుగంటల పాటు మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపివేయడం ఒకే సారి ప్రభలు రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్న నేపథ్యంలో సమయంను పెంచడం జరిగిందన్నారు.



కొండ దిగువున ఏర్పాటు చేసిన ఎమ్యూజ్‌మెంట్ పార్క్

ఘాట్ రోడ్డులో నడకకు అనుమతి లేదు

భక్తులు సోపాన మార్గంతో పాటు ఘాట్ రోడ్డులో కూడా నడకతో కొండపైకి చేరుకుంటున్నారు. దీని వలన వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యం ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈసారి తిరునాళ్ల రోజున ఘాట్ రోడ్డులో భక్తుల నడకను అనుమతి లేదని ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ప్రకటించారు. భక్తులు సోపాన మార్గం గుండా కొండపైకి రావాలని కోరారు.

తిరునాళ్లకు 528 బస్సులు

తిరునాళ్లకు ఆర్టీసీ 528 బస్సుల ను ఏర్పాటు చేస్తున్నట్లు నరసరా వుపేట డీఎం బత్తుల వీరాస్వామి బుధవారం తెలిపారు. నరసరావు పేట నుంచి 265, చిలకలూరి పేట నుంచి 100, అద్దంకి 30, ఒంగోలు 45, చీరాల 45, విను కొండ 43 బస్సులు ఏర్పాటు చేస్తు న్నట్లు వివరించారు. ఘాట్ రోడ్డులో కొండ దిగువ నుంచి ఎగువకు భక్తుల కోసం తిరుమల నుంచి వచ్చిన శేషాద్రి బస్సులు నిర్వహిస్తామన్నారు. వీఐపీల కోసం 20 సూపర లగ్జరీ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. నరసరావు పేట నుంచి కొండ దిగువ కు టిక్కెట్ రూ.30, కొండ దిగువ నుంచి కొండ పైకి టిక్కెట్ రూ.25, చిలకలూ రిపేట నుంచి రూ.30, వినుకొండ రూ.60, ఒంగోలు రూ. 120,చీరాల రూ.100, అద్దంకి టిక్కె ట్ ధర రూ.105 అని తెలిపారు.


క్వారీ తిరునాళ్లకు.. విస్తృత ఏర్పాట్లు

- ఆలయం వద్ద నిర్మించిన చలువ పందిళ్లు
- నిర్మాణంలో ఉన్న విద్యుత్ ప్రభలు

చేబ్రోలు, మార్చి6: గుంటూరు జిల్లాలోనే మహిమాన్విత శైవక్షేత్రంగా వెలుగొందుతున్న క్వారీ బాలకోటేశ్వర స్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జరిగే ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. గుంటూరు నారాకోడూరు ప్రధాన రహదారిని అనుకోని ఉన్న ఈ ఆలయానికి జిల్లా నలుమూలల నుంచి అశేష జనవాహిని శివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనేందుకు తరలిరానున్నారు. ఇప్పటికే భక్తుల కోసం అన్ని ప్రభుత్వ శాఖలు ఏర్పాట్లలో నిమ్మగ్నమయ్యాయి. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. అలాగే స్వామిని దర్శించుకునేందుకు క్యూలైన్లను సిద్ధం చేశారు. ఆలయం వద్ద విశాలమైన ప్రాంగణంలో ఉండటంతో ఓ వైపు వినోదం, ఆహ్లాదం అందించే జెయింట్ వీల్ వంటి వివిధ క్రీడా సముదాయాలను నిర్మించారు.ఈ ఏడాది నారాకోడూరు, చేబ్రోలు, వేజండ్ల, సుద్దపల్లి తదితర గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు తిరునాళ్లకు రానున్నాయి.



క్వారీ దేవాలయం ముందు విద్యుత్ అలంకరణలు



విద్యుత్ వెలుగుల్లో అమరావతి అమరేశ్వరస్వామి ఆలయ గోపురం

గోవాడ ముస్తాబు

అమృతలూరు: మహాశివరాత్రి ఉత్సవాలకు గోవాడ శ్రీ బాలకోటేశ్వరస్వామి ఆలయం ముస్తాబైంది. రంగులు వేయడంతో పాటు, చలువ పందిళ్లు, విద్యుత్ అలంకరణతో ఆలయం నూతన శోభ సంతరించుకుంది. స్వామి వారిని భక్తులు సులవుగా దర్శించుకునేలా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం లడ్డూ ప్రసాదం తయారు చేస్తున్నారు. తొలి రోజున జరిగే పశువుల ప్రదక్షిణకు కూడా ఏర్పాట్లు చేశారు. విద్యుత్ ఇబ్బందులు రాకుండా పెద్ద జనరేటర్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో తాత్కాలికంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను సిద్ధం చేశారు. పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చేతి పంపులు ఏర్పాటు చేస్తున్నారు. ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. లక్షల సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ఆ స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ఈవో అశోక్‌రెడ్డి తెలిపారు. మహాశివరాత్రి పర్వదినం రోజున స్వామి వారి దర్శనానికి ప్రత్యేక దర్శనం రూ.10, శీఘ్రదర్శనం రూ.20, లఘుదర్శనం రూ.50, వీఐపీ దర్శనం రూ.100లతో పాటు 24 గంటలు ఉచిత దర్శనం కొనసాగుతుందన్నారు. ప్రత్యేక అభిషేకాలు జరగనున్నట్లు చెప్పారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ విద్యుత్ ప్రభను గురువారం సాయంత్రం ప్రారంభించనున్నట్లు తెలిపారు. గృహోపకరణాలు, బొమ్మలు, చెరుకు విక్రయదారులు స్టాల్స్ ఏర్పాటు చేసుకున్నారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ ఆలపాటి రమాదేవి, సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.



ముస్తాబైన గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం



సిద్ధమైన క్యూలైన్లు

అంబటి రాంబాబుకూ.. స్థానభ్రంశం

- చిలకలూరిపేటకు మంత్రి బదిలీ
- మోదుగుల సత్తెనపల్లికి
- వైసీపీలో తీవ్రస్థాయిలో చర్చ
- త్వరలో విడుదలయ్యే జాబితాలో వీరి పేర్లు ఉండొచ్చు..?

అమరావతి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల అభ్యర్థుల జాబితా అంతా సిద్ధమైపోయిం దని ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి వారం క్రితం ప్రకటించారు. అయినా ఇంకా మార్పులు జరుగుతూనే ఉన్నాయి. కీలక నేతల స్థానాలనూ మారుస్తున్నారు. మంత్రి అంబటి రాంబాబుకూ స్థాన భ్రంశం జరిగినట్లుగా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. సత్తెనపల్లె సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి అంబటి రాంబాబును చిలకలూరిపేటకు బదిలీ చేసినట్లుగా పార్టీవర్గాలు చెబుతున్నాయి. సత్తెనపల్లి సమన్వయకర్తగా పార్టీ సీనియర్ నేత మోదుగుల వేణుగోపాలరెడ్డిని నియమించినట్లు చెబుతున్నారు. సిట్టింగ్ స్థానంలో మంత్రి రజిని కొన సాగితే ప్రతికూల ఫలితాలు వస్తాయని సర్వే ఫలి తాలు రావడంతో.. ఆమెను చిలకలూరిపేట నుంచి గుంటూరు పశ్చిమకు గతంలో మార్చేశారు. ఆ తర్వాత స్థానికుడైన మల్లెల రాజేష్‌నాయుడు సమన్వయ కర్తగా వైసీపీ అధిష్ఠానం ప్రకటించింది. అయితే తాజా గా ఈ స్థానంపై పలు సర్వేలు చేశాక మంత్రి అంబటి రాంబాబును బరిలోకి దింపాలన్న యోచనకు జగన్ వచ్చారని పార్టీవర్గాలు చెబుతున్నాయి. మోదుగుల వేణుగోపాలరెడ్డిని సత్తెనపల్లె నుంచి బరిలోకి దింపాలని జగన్ భావిం చారంటున్నారు. వీరిద్దరి పేర్లతో కూడిన జాబితా అధికారికంగా వెల్లడి కానప్పటికీ అంతర్గతంగా వైసీపీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. అధికారికంగా అంబటిని చిలకలూరిపేటకు పంపినట్లు గా ప్రకటిస్తే.. బదిలీ అయిన మంత్రులు ఆది మూలపు సురేశ్, విడదల రజిని, మేరుగ నాగార్జునల సర సన అంబటి కూడా చేరుతారు. సిట్టింగ్ స్థానంలో ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలను కొత్త స్థానానికి మారిస్తే ఆ వ్యతిరేకత తగ్గుతుందని జగన్ అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యం లోనే అటువారిని ఇటు.. ఇటు వారిని అటు మారుస్తూ కొత్త రాజకీయ క్రీడకు జగన్ తెర తీశారని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.



అక్రమార్కులకే విచారణ బాధ్యత

అద్దంకి, మార్చి 6: ఇతర జిల్లాలకు చెందిన వారికి అద్దంకి నియోజకవర్గంలో అక్రమంగా ఓటర్లుగా నమోదుపై విచారణను నీరుగార్చేయత్నం జరుగుతుందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎవరైతే అధికారులు ఓట్ల అక్రమాలకు పాల్పడినారో వారికే దీనిపై విచారణ బాధ్యతలు అప్పగించారని సమాచారం. అయితే దొంగ ఓట్ల నమోదుకు సహకరించిన అధికారులే విచారణ అధికారులుగా ఉండటంతో విచారణ జాప్యంతో పాటు నీరు గార్చే ప్రయత్నం జరుగుతుందని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా డిసెంబరులో పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన పాణెం చినహనిమిరెడ్డిని నియమించారు. ఈ నేపథ్యంలో ఆయన తన స్వగ్రామమైన దొడ్లేరుకు చెందిన 19 మందిని అద్దంకి నియోజకవర్గ ఓటర్లుగా నమోదు చేశారు. అప్పటికప్పుడు ఆధార్ కార్డుల్లో చిరునామాలు మార్చి ఓ అధికారి లాగిన్ నుంచి ఓటర్లుగా నమోదు చేశారు. ఇది బహిర్గతం కావడంతో దీనిపై విచారణ చేపట్టి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గత నెల 21న రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేసి మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ గత నెల 29న ఆదేశాలు జారీ చేసింది. అయితే ఇంతవరకు ఒక కొలిక్కి రాకపోవడంపై టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ, అదంకి పట్టణ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన రాజకీయపార్టీల సమావేశంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి సునీల్‌కు ఫిర్యాదు చేశారు. స్థానిక అధికారులకే విచారణ బాధ్యతలు కేటాయించడంపై వారు అనుమానం వ్యక్తం చేశారు. స్థానిక అధికారులు తమ తప్పులు బయట పడకుండా విషయాన్ని నీరు గార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వెంటనే విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని టీడీపీ నేతలు తెలిపారు.

- దొంగ ఓట్ల నమోదు ఫిర్యాదు నీరుగార్చే యత్నం
- విచారణ జాప్యంపై ఈఆర్వోకు టీడీపీ నాయకుల ఫిర్యాదు



ప్రారంభ ప్రార్థనలు చేస్తున్న హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్లు

నేటి నుంచి గుడారాల పండుగ

గుంటూరు(తూర్పు), మార్చి 6: గుంటూరు సమీపంలోని హోసన్నా మినిస్ట్రీస్ గోరంట్ల ఆధ్వర్యంలో 47వ అంతర్జాతీయ గుడారాల పండుగ గురువారం సాయంత్రం ఆరు గంటల నుంచి ప్రారంభం కానుంది. నాలుగు రోజులు జరిగే పండుగకు లక్షల మంది విశ్వాసులు హాజరవుతారు. పగలు, రాత్రి సమయాల్లో జరిగే ప్రార్థనలకు వేర్వేరు వేదికలను సిద్ధం చేశారు. ప్రార్థనలను తిలకించేందుకు ఆవరణలో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రే వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి పలువురు చేరుకున్నారు. హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్లు రాజు, ఫైడిపాల్, రమేష్‌తో పాటు దక్షిణాఫ్రికా నుంచి వచ్చిన జామువమోజేస్ ప్రారంభ ప్రార్థనలు, క్రీస్తు గీతాలు ఆలపించారు.

పండుగకు ప్రత్యేక రైళ్లు

గుడారాల పండుగకి తరలివచ్చే భక్తుల కోసం ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్ఎం రామకృష్ణ తెలిపారు. నెంబరు.07225 అనకాపల్లి - గుంటూరు రైలు బుధవారం రాత్రి 7.40కి బయలుదేరి గురువారం ఉదయం 7 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. నెంబరు. 07226 గుంటూరు - అనకాపల్లి రైలు ఈ నెల 10న రాత్రి 10.20కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.10కి అనకాపల్లి చేరుకుంటుంది.

కోటప్పకొండ తిరునాళ్లకు.. చేరుకోండిలా..

నరసరావుపేట, మార్చి 6: కోటప్పకొండ తిరునాళ్లలో ట్రాఫిక్ నిబంధనలను భక్తులు పాటించాలని ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి బుధవారం సూచించారు. నరసరావుపేట, చిలకలూరిపేట, సంతమాగులూరు వైపు నుంచి కోటప్పకొండకు వచ్చే రహదారులు, పార్కింగ్ స్థలాల వివరాలు వెల్లడించారు.

- సంతమాగులూరు వైపు నుంచి వచ్చే భక్తులు లక్ష్మీపురం కాలువ రోడ్డు, మిన్నెకల్లు, గురి జేపల్లి మీదుగా యూటీ జంక్షన్ చేరి శారద ఫార్మసీ వద్ద వాహ నాలు పార్కింగ్ చేసుకోవాలి. మి న్నెకల్లు నుంచి కోటప్పకొండ వైపు వాహనాలు అనుమతించబడవు. తిరుగు ప్రయాణంలో గురుజేపల్లి మీదుగా సంతమాగులూరు వెళ్లాలి.
- చిలకలూరిపేట వైపే నుంచి వచ్చే భక్తులు పురుషోత్త పట్నం, యడవల్లి, యూటీ జంక్షన్ చేరి శారద ఫార్మసీ వద్ద ఏర్పాటు చేయబడిన పార్కింగ్ ప్రదేశాలను ఉపయోగించుకోవాలి. ఈ మార్గంలో వచ్చే వీఐపీలు పురుషోత్తపట్నం, యడవల్లి మీదుగా యూటీ జంక్షన్ చేరి ఎడమవైపుకు క్రషర్ రోడ్ మీదుగా వీఐపీ పార్కింగ్‌లో వాహనాలు ఉంచాలి. తిరుగు ప్రయాణంలో క్రషర్ రోడ్డు మీదుగా యూటీ జంక్షన్‌ను చేరి యక్కలవారిపాలెం, కమ్మవారిపాలెం మీదుగా చెరువు రోడ్డు నుంచి చిలకలూరిపేట వెళ్లాలి.
- చిలకలూరిపేట నుంచి వెళ్లే ప్రభలు పురుషోత్తపట్నం, యడవల్లి మీదుగా యూటీ జంక్షన్ మీదుగా నిధి దారి గుండా ప్రభల నిలిచే స్థలానికి తరలించాలి. చిలకలూరిపేట నుంచి వచ్చే ట్రాక్టర్లు పురుషోత్తపట్నం, యడవల్లి, అట్టల ఫ్యాక్టరీ రోడ్ మీదుగా యక్కలవారిపాలెం మీదుగా ప్రభల స్టాండ్‌కు చేరాలి.
- నరసరావుపేట టౌన్ నుంచి కోటప్పకొండకి వచ్చే ప్రభలు యల్లమంద, గురవాయ పాలెం గ్రామాల మీదుగా సా యంత్రం 4 గంటలకి ప్రభల నిధి వద్దకి చేరుకోవాలి.

చంద్రబాబు జిల్లా పర్యటన ఖరారు

11న వైపాలెం, కొండపి సెగ్మెంట్లలో ప్రజాగళం సభలు

అదే రోజు పార్టీలోకి మాగుంట ?

ఒంగోలు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు జిల్లా పర్యటన ఖరారైంది. ఈనెల 11న ఆయన జిల్లాలో పర్యటించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పార్లమెంట్ స్థానాల పరిధిలో ఒక్కొక్క నియోజకవర్గ కేంద్రంలో బహిరంగ సభ నిర్వహించిన బాబు తాజాగా మరో విడత ప్రజాగళం పేరుతో పర్యటించాలని నిర్ణయించారు. అందులోభాగంగా ఈనెల 11న జిల్లాకు వస్తున్నారు. ఎర్రగొండపాలెం, కొండపి నియోజకవర్గాలలో ప్రజాగళం సభల్లో పాల్గొంటారు. ఆ రోజున ఉదయం వైపాలెంలో జరిగే సభలో పాల్గొనున్న చంద్రబాబు మధ్యాహ్నం తర్వాత కొండపి నియోజకవర్గంలోని టంగుటూరులో జరిగే సభలో పాల్గొంటారు. ఆ మేరకు కార్యక్రమాల ఏర్పాటుకు జిల్లా నేతలకు టీడీపీ అధిష్ఠానం నుంచి స్పష్టత ఇవ్వడంతో తదనుగుణ ఏర్పాట్లపై ఆ నియోజకవర్గాల నేతల దృష్టిసారించారు. కాగా వైసీపీకి రాజీనామా చేసిన ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి రాబోయో ఎన్నికల్లో ఎంపీగా పోటీకి సిద్ధమైన ఆయన కుమారుడు రాఘవరెడ్డి, వారి అనుచరులు అదే రోజున బాబు సమక్షంలో టీడీపీలో చేరనున్నట్లు సమాచారం.

రేపటి నుంచి బ్యాంకులకు మూడు రోజులు సెలవులు

ఒంగోలు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8 నుంచి 10వతేదీ వరకు బ్యాంకులు మూతపడనున్నాయి. వరుసగా మూడు రోజులు సెలవులు రావడమే అందుకు కారణం. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 8న సెలవుకాగా తర్వాత రెండవ శనివారం కావడంతో 9వతేదీన, ఆదివారంతో 10వతేదీన బ్యాంకులు పనిచేయవు. ఇలా వరుసగా మూడు రోజులు సెలవు దినాలు రావడం చాలా అరుదుకాగా ఖాతాదారులకు కొంతమేర ఇబ్బందులు కలిగే అవకాశం ఉంది. ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉంటాయి. అయినప్పటికీ ఏటీఎంలకు ప్రజలు బాగా అలవాటు పడిన నేపథ్యంలో ఒకటి, రెండు రోజులు సెలవులు అయితే వాటిలో నగదు అందుబాటులో ఉండక ఇబ్బందులు పడుతున్నారు. అలాంటిది వరుసగా మూడు రోజులు అందులోనూ నెల రెండవ వారంలోనే కావడం మరింత ఇబ్బందికరం కానుంది. బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి ఏటీఎంలలో నగదు కొరత లేకుండా చూడాలని ప్రజానీకం కోరుతున్నారు.

ఇంకా అందని జీతాలు

పండుగ సమయంలోనూ ఎదురుచూపులే

జిల్లాలో 15శాతం మంది ప్రభుత్వ ఉద్యోగులకు రాని వేతనం

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 6 : జిల్లాలో ఇంకా కొన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు అందలేదు. ప్రతినెల 1, 2 తేదీల్లో రావాల్సిన జీతాలు 6వ తేదీ వచ్చినా ఇంకా 15శాతం మంది ఉద్యోగులకు పడలేదు. జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సుమారు 45వేల మంది వరకు ఉండగా రిటైర్డ్ ఉద్యోగులు మరో 30వేల మందికిపైగా ఉన్నారు. అయితే ప్రభుత్వ ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు నెల ప్రారంభమైన వెంటనే జీతాలు, పెన్షన్లు వారి వారి ఆకౌంట్లలో వేయాల్సి ఉంది. సుమారు ఏడేమిదివేల మంది ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు వేతనాలు, పెన్షన్లకోసం ఎదురుచూస్తున్నారు. ఈనెల 8వతేదీ శివరాత్రి పండుగ. ఈ నేపథ్యంలో ఖర్చుల కోసం జీతాలు తప్పనిసరి. అయితే ఉద్యోగులకు బుధవారం సాయంత్రం వరకు కూడా వేతనాలు పడని పరిస్థితి ఏర్పడింది.

సీఎం వస్తున్నారని ముందస్తు అరెస్టులు

ఇళ్ల వద్ద రాజకీయ నేతల నిర్బంధాలు

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 6: సీఎం జగన్ వస్తున్నారని పలువురు సీపీఐ, సీపీఎం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అందె నాసరయ్య అన్నారు. వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు జగన్‌రెడ్డి కొత్తూరుకు వస్తున్న నేపథ్యంలో పోలీసులు పట్టణంలోని పలువురు రాజకీయ నాయకులను హౌస్ అరెస్టు చేశారు. సీపీఐ నాయకులు నాసరయ్య, సీపీఎం నాయకులు సోమయ్య, రఫి, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, జీవీ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా అందె నాసరయ్య మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత ప్రజల ఆశాజ్యోతి అయిన పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేయకుండానే కేవలం ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని రాజకీయ లబ్ధి పొందేందుకు మాత్రమే పైలాన్ ఆవిష్కరించడం ప్రజలను వంచించడమే అన్నారు. ముంపు గ్రామాల ప్రజలకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా ప్రారంభోత్సవం చేయడం ప్రజలను మరోసారి మోసం చేయడమేనని విమర్శించారు.

అన్నికేంద్రాల్లోనూ ప్రారంభమైన కొనుగోళ్లు

రెండవ దశలో కిలో రూ.232 పలికిన గరిష్ఠ ధర

వెల్లంపల్లి, ఒంగోలు-2లో పొగాకు వేలాన్ని ప్రారంభించిన బోర్డు చైర్మన్

ఒంగోలు, మార్చి 6 (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలోని అన్ని వేలంకేంద్రాల్లోనూ బుధవారం నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. రాష్ట్రంలో ప్రస్తుత సీజన్ కొనుగోళ్లను మూడు విడతలుగా చేపట్టాలని నిర్ణయించిన పొగాకు బోర్డు అధికారులు తొలివిడత ఫిబ్రవరి 29న కొండపి, ఒంగోలు-1లో చేపట్టారు. రెండవ విడత మార్చి 6 నుంచి, మూడవ విడత మార్చి 14 నుంచి చేపట్టాలని షెడ్యూల్ ఇచ్చారు. అయితే పలు కారణాలతో రెండవ విడతలోనే మిగిలిన అన్ని కేంద్రాల్లోనూ కొనుగోళ్లు ప్రారంభించారు. అందులో భాగంగా దక్షిణాదిలోని 11 కేంద్రాల్లో తొలివిడత చేపట్టిన రెండు కేంద్రాలు పోను మిగిలిన తొమ్మిది కేంద్రాల్లోనూ బుధవారం వేలం ప్రారంభమైంది. ఆయా కేంద్రాల్లో 16 బేళ్ల వంతున తొలిరోజు వేలానికి అనుమతించారు. వెల్లంపల్లి, ఒంగోలు-2 వేలంకేంద్రాల్లో పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ వేలం ప్రక్రియను ప్రారంభించగా, బోర్డు ప్రాంతీయ మేనేజర్ ఎం.లక్ష్మణరావు ఇతర అధికారులు, వ్యాపారులు, రైతుప్రతినిధులు పాల్గొన్నారు. ఇతర కేంద్రాల్లోనూ స్థానిక వేలం కేంద్ర అధికారులు ప్రక్రియను ప్రారంభించారు. ఆయా కేంద్రాల్లో ఇంచుమించు 15 కంపెనీలకు చెందిన బయ్యర్లు వేలంలో పాల్గొనగా గరిష్ఠ ధర కిలో రూ.232 పలికింది. వెల్లంపల్లి, పొదిలి కేంద్రాల్లో ఈ ధర లభించగా ఒంగోలు-2లో కిలో రూ.231 గరిష్ఠ ధర పలికింది. తొలి విడత కేంద్రాల్లో కిలో రూ.230 ప్రారంభ ధర ఇచ్చిన వ్యాపారులు బుధవారం రెండవ దశ కేంద్రాల్లో రూ.2 అదనంగా ఇచ్చారు. ఈ ధరలపై ఆయా ప్రాంతాల రైతులు ఒకింత సంతృప్తి వ్యక్తం చేసున్నారు.

స్ఫూర్తి ప్రదాత ఎన్టీఆర్

విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే గొట్టిపాటి



ఎన్.టి.ఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గొట్టిపాటి

పంగులూరు, మార్చి 6 : విశ్వవిఖ్యాత, నటసార్వభౌముడు, సామాజిక, రాజకీయ రంగాలలో తన ప్రత్యేకతను చాటిన స్ఫూర్తి ప్రదాత, టీడీపీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు యుగపురుషుడని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని కల్లంవారిపాలెంలో బుధవారం రాత్రి దివంగత ఎన్టీఆర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే రవికుమార్ పార్టీ నేతలతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కోట్లాదిమందికి ఆత్మీయుడిగా, ఆదర్శనీయుడిగా వెలుగొందిన మహనీయుడు ఎన్టీఆర్ చిరస్మరణీయుడిగా ప్రజల హృదయాలలో ఉంటారని కొనియాడారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి, 9 నెలల కాలంలోనే ప్రజాభిమానంతో అధికారం చేపట్టి ప్రజా సంక్షేమానికి మార్గం చూపారన్నారు. మండల వ్యవస్థ, మహిళలకు ఆస్తి హక్కు కల్పించిన ఆదర్శ పురుషుడుగా చరిత్రలో నిలిచారని గొట్టిపాటి కీర్తించారు. అలాంటి మహనీయుని విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కేవీ సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, మస్తాన్‌వలి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు భవనం లక్ష్మారెడ్డి, గుడిబండ్ల ఆదిరెడ్డి, గుడిపాటి సుబ్బారెడ్డి, కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, పిచ్చిరెడ్డి, వలపర్ల సుబ్బారావు, ఓబుల్‌రెడ్డి, గుర్రం ఆదిశేఖర్, వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, అల్లంనేని స్వామి, శ్రీనివాసరెడ్డి, చిన్నా పాల్గొన్నారు.

ఉత్తుత్తి ప్రారంభం.. అంతా రాజకీయమే



సొరంగాలను పరిశీలిస్తున్న సీఎం జగన్

పూర్తికాని పనులపై స్పష్టత లేదు

జూన్ నాటికి నీళ్లు రావచ్చు..

అప్పటికి డబ్బులు చూస్తానంటూ సీఎం వ్యాఖ్య

సొంతవారికి కుర్చీ... దళిత నేతలకు అగౌరవం

రైతులను పిలిచారు..

ఒక్క మాటకు అవకాశం ఇవ్వలేదు.

నిర్వాసితులను మాత్రం భయపెట్టి అడ్డుకున్నారు.

వెలిగండ్లలో సీఎం సభ తీరుతెన్ను

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే వెలిగొండను పూర్తిచేసి ప్రాజెక్టును ప్రారంభిస్తానని చెప్పిన జగన్ మాట మారుస్తూనే ఉన్నారు. పదేపదే ప్రారంభ కార్యక్రమం వాయిదా వేస్తూ కాలం గడిపి తీరా రేపేమాపో ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతున్న నేపథ్యంలో బుధవారం వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసే కార్యక్రమం నిర్వహించారు. అయితే ప్రాజెక్టుకు నీరు ఇచ్చే ముహూర్తం మాత్రం జూన్ తర్వాత అంటూ చెప్పడం విశేషం. ప్రారంభ కార్యక్రమం మొత్తం గంట వ్యవధిలోపే ముగించిన సీఎం జగన్.. ప్రజలనుద్దేశించి మాట్లాడింది మాత్రం ఎనిమిది నిమిషాలే. అందులోనూ అధిక సమయం రాజకీయ అంశాల ప్రస్తావనకే ప్రాధాన్యత ఇచ్చారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా చేపట్టిన రెండు టన్నెళ్ల నిర్మాణం పూర్తయిందనేది జగన్ చెప్పిన మాట. కానీ రెండు టన్నెళ్లలో ఇంకా కాంక్రీట్ పని కొంతభాగం పూర్తి కావాల్సి ఉంది. అంతేకాక టన్నెళ్ల నుంచి బయటకు వచ్చిన కృష్ణాజలాలు రిజర్వాయర్‌కు చేరాల్సి ఉంది. టన్నెల్‌కు, రిజర్వాయర్‌కు మధ్య 23 కిలోమీటర్లు పొడవునా కెనాల్ నిర్మాణం ఇంకా పూర్తిస్థాయిలో జరగలేదు. రెండోవైపు ముంపు గ్రామాల తరలింపు జరగలేదు. అయితే త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తిరిగి తాము అధికారంలోకి వస్తామన్న ధీమాతో వచ్చే జూన్ నాటికి ముంపుబాధితులకు డబ్బులు చెల్లిస్తామన్న మాట మాత్రం చెప్పారు. ప్రాజెక్టుకు నీళ్లు కూడా జూన్ తర్వాత వచ్చే అవకాశం ఉందని సెలవిచ్చారు. దీంతో ప్రస్తుతం ప్రాజెక్టును జాతికి అంకితం చేసే కార్యక్రమం అంతా ఉత్తుత్తిదేనని స్పష్టమవుతుంది.

పశ్చిమ ప్రాంతవాసుల చిరకాలవాంఛ అయిన వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభ వేడుక ఉత్తుత్తిగా మారింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కూడా అసలు విషయం కన్నా రాజకీయాలకే ప్రాధాన్యం ఇచ్చారు. తన అనుకున్న వారిని పిలిచి పక్కన కూర్చోబెట్టుకొని ఆ ప్రాంతవాసులైన దళిత, దళితేతరులను నిల్చోబెట్టి అగౌరవపర్చారు. నిర్వాసితులను ఆవైపు రాకుండా కట్టడి చేశారు. పిలిచిన రైతులకు ఒక్క మాట మాట్లాడే అవకాశం ఇవ్వకుండా కార్యక్రమం ముగించేశారు. వచ్చే జూన్ తర్వాత నీళ్లు రావచ్చు, అప్పటికి నిర్వాసితులకు డబ్బులు చెల్లించే అవకాశం ఉందనే మాట ఇచ్చి సభను ముగించారు. దీంతో ప్రారంభ కార్యక్రమంపై యావత్తు ప్రజానీకం పెదవి విరుస్తున్నారు. బుధవారం వెలిగొండ ప్రాజెక్టు తీరు తెన్ను అంతా ఇదే.

రాజకీయ ప్రసంగానికే ప్రాధాన్యం

అక్కడకు సమీకరించిన లబ్ధిదారులైన రైతులనుద్దేశించి ఆయన మాట్లాడింది కొన్ని నిమిషాలే అయినా అందులోను రాజకీయ అంశాలకే అధిక ప్రాదాన్యత ఇచ్చారు. కాబోయే మంత్రి బాలినేని అంటూ కితాబు ఇచ్చారు. అంతకు ముందు టన్నెల్‌లో వెళ్లేటప్పుడు కూడా బాలినేనిని, వైపాలెం ఇన్‌చార్జి చంద్రశేఖర్‌ను మాత్రమే పక్కన తీసుకెళ్లారు. రైతులతో జరిగిన చిన్న కార్యక్రమలో వేదిక కింద ఉన్న తన బాబాయి అయిన వైవీ సుబ్బారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను పైకి పిలిపించారు. వారి రాకతో అప్పటివరకు వేదికపై కూర్చున్న మంత్రి ఆదిమూలపు సురేష్ లేవాల్సి వచ్చింది. కనుసైగతో ఆయన లేచి వైవీకి సీటు ఇవ్వగా వైపాలెం అభ్యర్థి చంద్రశేఖర్ లేచి వెంకాయమ్మకు సీటిచ్చారు. వేదికపై ఇతర ముఖ్యులతో బాలినేని, వైవీ సుబ్బారెడ్డి, వెంకాయమ్మలే కూర్చున్నారు. సభ జరిగినంతసేపు సురేష్ ఎదురుగా నిలబడక తప్పలేదు. తను సహచర మంత్రి, దళితవర్గానికి చెందిన సురేష్ నిలబడి ఉన్నా చూసి వదిలేశారే తప్పా కూర్చోమన్న దాఖలాలు లేవు. సభలో జగన్ మాట్లాడుతూ వైపాలెం అభ్యర్థి చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. తాను పోటీలో ఉన్నాననే చందంగా మార్కాపురం అభ్యర్థి అన్నా రాంబాబు ముందుకు రాగా అప్పుడు ఆయన్ను గెలిపించాలని కోరారు. మంత్రి సురేష్ ఒక అడుగు ముందుకు వేయగా మీరు కొండపిలో కదా పోటీలో ఉందంటూనే ఆయనను గెలిపించాలని తెలిపారు అసలు విషయం కన్నా తన ప్రసంగంలో ఈ తతంగంకే ఎక్కువ సమయం పట్టిందంటే అతిశయోక్తి కాదు. దీంతో అక్కడ ఉన్న నాయకులు, వేదిక కింద ఉన్న రైతులు కూడా ఈ తతంగం చూస్తూ నివ్వెరపోయారు.

మాట్లాడే అవకాశమే ఇవ్వలేదు

ఈ కార్యక్రమానికి ప్రాజెక్టు ప్రయోజనం పొందే ఆయకట్టు రైతులను ఆహ్వానించారు. అదీ గ్రామానికి ఆరుగురిని ఎంపిక చేసి మరీ పిలిచారు. కానీ ఒక్కరికీ ఒక్కమాట కూడా మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. వారు మాట్లాడితే మిగిలిన పనులు ఎప్పుడు పూర్తవుతాయి, ఎప్పుడు నీళ్లు ఇస్తారు అని అడుగుతారని అనుకున్నారో ఏమో ఒక్కరికీ మాట్లాడే అవకాశం ఇవ్వలేదని సభ అనంతరం రైతులు వ్యాఖ్యానించారు.

నిర్వాసితులను కట్టడి చేశారు

కాగా ముంపునకు గురయ్యే గ్రామాలకు చెందిన ప్రజలను ఆ వైపునకు రాకుండా ముందుగానే కట్టడి చర్యలు తీసుకున్నారు. పోలీసులు ముందస్తు నోటీసులు ఇచ్చి మరీ అడ్డుకున్నారు. దీంతో మొత్తం ఈ కార్యక్రమం అంతా రాజకీయ కోణంలోనే సాగిందంటూ పశ్చిమ ప్రాంతంలోని ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఉత్తుత్తి ప్రారంభం అయినప్పటికీ సభలో దళిత మంత్రి, నాయకులను అగౌరపర్చటం దారుణమంటూ వైపాలెం టీడీపీ అభ్యర్థి గూడూరి ఎరీక్షన్‌బాబు బహిరంగంగానే విమర్శలు చేయగా వాటిని వైసీపీ నేతలు కూడా ఖండించిన దాఖలాలు లేవు.

చేయలేక చేతులెత్తేశారు..!

'పోతురాజు కాలువ' ఆధునికీకరణ పనులు రద్దు

వైసీపీ పాలనలో ముందుకు సాగని వైనం

ఆక్రమణల తొలగింపుల్లో రాజకీయ జోక్యం

కదలని కార్పొరేషన్, రెవెన్యూ యంత్రాంగం

చేసేదేమీ లేక విరమించుకున్న ఇరిగేషన్ శాఖ

టీడీపీ హయంలో పనుల్లో పురోగతి, బ్రిడ్జిల నిర్మాణం



చెత్తాచెదారంతో నిండిపోయిన పోతురాజు కాలువ

ఒంగోలు (కార్పొరేషన్), మార్చి 6: జిల్లాకేంద్రమైన ఒంగోలులో కీలకమైన పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులు అటకెక్కాయి. ఆయా పనుల్లో కీలకమైన ఆక్రమణల తొలగింపులో రాజకీయ ఒత్తిడిలు రావడంతో కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో పదమూడేళ్ల క్రితం చేపట్టిన పోతురాజు కాలువ బాగు కథ మళ్లీ మొదటికొచ్చింది. అయితే ఏళ్ల తరబడి పనుల్లో పురోగతి లేకపోవడంపై ఈఎన్‌సీ (ఇంజనీరింగ్ ఇన్ చీఫ్)కి కూడా విసుగెత్తింది. మురుగునీటి పారుదల వ్యవస్థ మెరుగుకోసం చేపట్టిన పనులు నాలుగున్నరేళ్లలో పూర్తి చేయలేకపోవడంతో ప్రతిపాదించిన పనులు రద్దుచేస్తూ క్లోజింగ్ లెటర్ ఇచ్చేశారు. దీంతో అధికారుల అలసత్వం, రాజకీయ జోక్యం, ఆక్రమణల తొలగింపుల్లో ఒత్తిళ్లతో ఇన్నాళ్లపాటు ఆగుతూ.. సాగుతూ వచ్చిన ఆధునికీకరణ పనులకు ఫుల్‌స్టాప్ పడినట్లే.

ప్రారంభమైన పదమూడేళ్లకు ఫుల్‌స్టాప్

2010 మే 19వ తేదీ అర్ధరాత్రి లైలా తుఫాన్ వరద దెబ్బకు శివారు కాలనీలు వణికిపోయాయి. ఇప్పటికీ ఆ దారుణం అందరి కళ్లల్లో మెదులుతూనే ఉంది. అయితే అందుకు ప్రధాన కారణం పోతురాజు కాలువే కారణమంటూ అధికారులు తేల్చారు. ఆధునికీకరణకు ప్రత్యేక నిధులు కేటాయిస్తే ఇకపై ముప్పు వాటిల్లే అవకాశం ఉండదని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. దీంతో స్పందించిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. కానీ తూతూమంత్రంగా చేసిన పనులు కొట్టుకుపోయాయే తప్ప కాలువ పరిస్థితి మెరుగుపడలేదనేది వాస్తవం. అయితే ఆ తర్వాత అత్యవసర సహాయక సేవల పేరుతో ప్రతి ఏడాది రెవెన్యూ అధికారులు రూ.50లక్షలు, మురుగునీరు తొలగింపునకు, కాలువల్లో పూడికతీతతకు, నిలిచిన నీరు మళ్లింపునకు రూ.50లక్షల వరకు ఖర్చుచేస్తూ వస్తున్నారు. దాంతోపాటు తుఫాన్లతో దెబ్బతిన్న రహదారులు మరమ్మతులు, నిర్మాణం పేరిట అదనంగా ఎస్టిమేషన్‌లు వేసి ఖర్చుపెట్టడమే కానీ ఆ తర్వాత కాలనీలవైపు కన్నెతి చూడటం లేదు. వాతావరణం అనుకూలించిన రోజుల్లో అవసరమైన శాశ్వత పరిష్కారం చూపలేదు.

ఒంగోలు నగర జనాభా	3,10,694,
అన్ని విధాలైన గృహాలు సంఖ్య	68,848,
శివారు కాలనీలు	53
శివారు కాలనీల జనాభా	22 వేలకు పైనే
ముంపు వాటిల్లే ప్రాంతాలు	37 కాలనీలు
పూర్తిగా నీటమునిగే గృహాలు	1,181
రిహ్యాబిటేషన్ సెంటర్లు	5-10 కేంద్రాలు
శిబిరాలు నిర్వహణ రోజులు	3-5 రోజులు

విపత్తు సమయంలో బాధితుల పేరుతో ఖర్చు రూ. 1 కోటి (షుమారుగా)

అందించే సేవలు భోజన సదుపాయం, వ్యాధులు నివారణకు వైద్య సహాయం, పారిశుధ్య పనులు, రహదారులపై నీరు తొలగింపు

2010 మే 19వ తేదీ గుర్తుకు వస్తేనే శివారు కాలనీ ప్రజలు ఉలిక్కిపడతారు. ఆ రోజు అర్ధరాత్రి అనుకోకుండా వచ్చిన లైలా తుఫాన్ నగరాన్ని అతలాకుతలం చేసింది. ఉప్పెనలా వచ్చిన వరద బీభత్సానికి వందలాది కుటుంబాలు కట్టుబట్టలతో బతుకు జీవుడా అంటూ పరుగులు పెట్టాయి. ఇళ్లలోకి చేరిన నీటి ప్రవాహంలో, పురుగులు, పాముల మధ్య గడిపిన దయనీయమైన ఘటన అది. అయితే పోతురాజు కాలువ ఇందుకు కారణం కావడంతో వెంటనే పాలకులు దాని ఆధునికీకరణకు సిద్ధమయ్యారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరై బ్రిడ్జిలు నిర్మించారు. ఆ ఎన్నికల కోడ్ రావడంతో ఆగిపోయాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిస్థాయిలో పనులు జరగకపోవడంతో సమన్వయం లేని శాఖలు, రాజకీయ జోక్యంతో ఇక చేయలేమంటూ ఈఎన్‌సీ చేతులెత్తేసింది. చేపట్టిన పనులు రద్దుచేస్తూ ఈటీవల కాలంలో క్లోజింగ్ లెటర్ ఇచ్చేసింది.

మొదట రూ. 12.5 కోట్లు.. ఆ తర్వాత రూ.80 కోట్లు

పోతురాజు కాలువ పేర్నమిట్ట సమీపంలో ఆరంభమై, క్విస్ పబ్లిక్ స్కూలు వెనుక గుండా గణేషనగర్, జయప్రకాష్ కాలనీ, నెహ్రూనగర్, పాపాకాలనీ, భగత్ సింగ్ కాలనీల మీదుగా దాదాపు 6 కిలోమీటర్ల వరకు విస్తరించింది. ఈ కాలువను ఆధునీకరించే పనులను ప్రారంభించేందుకు రూ. 12.5కోట్లు అవసరమని ప్రతిపాదించగా రూ.11.78 కోట్లను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించింది. పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో అవి కొట్టుకుపోయాయి. ఆ తర్వాత టీడీపీ అధికారంలోకి రాగా, పూర్తిస్థాయిలో పనులు చేపట్టడానికి రూ.40కోట్లు అవసరమని అధికారులు లెక్కలు కట్టారు. దాంతో ఎమ్మెల్యే దామచర్ల హయాంలో గుంటూరు రోడ్‌లో పోతురాజుకాలువపై నాలుగు వరసల బ్రిడ్జీని నిర్మించారు. అయితే కాలువ కరకట్టపై కొన్ని నివాసగృహాలు ఉండటంతో మిగిలిన పనులకు అడ్డంకిలు ఏర్పడ్డాయి. ఈలోపు ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. తదనంతరం చోటుచేసుకున్న పరిణామాల్లో వైసీపీ అధికారంలోకి రాగా, పోతురాజు కాలువ పూర్తిచేయడానికి అప్పటికీ రూ.80 కోట్లు అవసరంగా అధికారులు మళ్లీ లెక్కలు మార్చారు.

ప్రతిపాదించిన పనులు ఇవీ...

అక్కతోక వాగు నుంచి వచ్చే నీరు కాలువకు ఇరువైపులా ఉన్న కాలనీలపై ప్రభావం చూపకుండా, ముంపు సమస్య నుంచి తప్పించేందుకు మొదట కాలువ అడుగు భాగం పూడిక తీయాలి, అంతేకాకుండా కాలువ ద్వారా వచ్చే నీటి ప్రవాహాన్ని తట్టుకునేందుకు కట్టలను (ఫ్లడ్ వాల్స్) పటిష్టం చేయాల్సిందే. కాలువపై ఆక్రమణలు సైతం తొలగించి భవిష్యత్‌లో ప్రమాదాలు జరగకుండా ఏడు చిన్న వంతెనలను కూడా నిర్మించాలనేది ప్రతిపాదన.ఈ పనుల నిర్మాణ బాధ్యతలను ఇరిగేషన్ శాఖకు అప్పగించగా, నగరపాలక సంస్థ,రెవెన్యూ శాఖలు సహకరించాల్సి ఉంది.

ప్రస్తుత పరిస్థితి ఏమిటి ?

పోతురాజు కాలువ పనులు ప్రారంభం నుంచే నత్తనడకన సాగాయి. శాఖల మధ్య సమన్వయం లేదు. కార్పొరేషన్, రెవిన్యూ శాఖలు కలిసి రాలేదు. దీంతో ఒంటిచేత్తో పనులు ప్రారంభించిన ఇరిగేషన్ శాఖ తర్వాత అంతగా పట్టించుకున్నట్లు లేదు. కాలువ పూడికతీత, దశరాజుపల్లె వద్ద వంతెన, జయప్రకాష్ కాలనీల్లో వంతెన, అప్రోచ్ రోడ్లు, సీసీ గోడలు నిర్మాణం, క్రాస్‌వాల్స్ కోసం దాదాపు రూ.11.5 కోట్లు ఖర్చుచేసినా పనులు కొలిక్కి రాలేదు. కాలువపై ఆక్రమణ తొలగింపులో రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు కలిసి రాకపోవడంతోనే పనుల్లో జాప్యం జరిగింది. పోతురాజు కాలువ వ్యవహారం ప్రజాప్రతినిధుల పంచాయితీకి చేరింది. దీంతో ఆక్రమణ తొలగింపులో అలసత్వం నెలకొనడంతో అప్పటివరకు సాగిన పనులు ఉపయోగం లేకుండాపోయాయి. యథా ప్రకారం కాలువల్లో వ్యర్థాలు చేరి, మురుగుతో మూసుకుపోయింది. కాలువకట్టపై చెట్లు పెరిగి అడవిని తలపిస్తోంది. వాటితోపాటు ఇటీవల కాలంలో మరికొన్ని ఆక్రమణలు చోటుచేసుకోవడంతో కాలువ స్వరూపం కోల్పోయింది. పేర్నమిట్ట సమీపంలో కొంతమేర పనులు జరిగినట్లు చెబుతున్నా నగరంలో మాత్రం ఒక్క అడుగు కూడా పనులు ముందుకు సాగలేదు. దీంతో చేపట్టిన పనులు మరలా చేపట్టలేమంటూ ఇరిగేషన్ శాఖాధికారులు చేతులెత్తేశారు. ఖర్చుచేసిన కోట్లాది రూపాయలు కాలువలో కలిసిపోయాయి. దీంతో ఇప్పట్లో పోతురాజు కాలువ పూర్తయ్యే పరిస్థితి లేని కారణంగా ప్రభుత్వమే పనులు రద్దుచేస్తూ నిర్ణయం తీసుకుంది.

వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఓడించాలి

సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు రాజేంద్రప్రసాద్ పిలుపు



ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్‌లు, పాల్గొన్న రాజేంద్రప్రసాద్

ఒంగోలు(కలెక్టరేట్), మార్చి 6 : స్థానిక సంస్థల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో ఓడించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. పంచాయతీ నిధులను ప్రభుత్వం దారిమళ్లించడాన్ని నిరసిస్తూ బుధవారం సర్పంచ్‌ల సంఘం, పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీ వ్యవస్థకు సమాంతరంగా సచివాలయ వ్యవస్థను తెచ్చిందన్నారు. పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వం దారిమళ్లించడం దుర్మార్గమైన చర్య అన్నారు. నిధుల దారిమళ్లింపుపై గత మూడేళ్ల నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని పరిస్థితి నెలకొందన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి పంచాయతీ నిధులు, అధికారాలు, విధులను దొంగిలించేశారని ఆరోపించారు. అవి తిరిగి అప్పగించాలని రాజకీయాలకతీతంగా మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఆందోళనలు నిర్వహించినా చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. అందుకే పార్టీలకతీతంగా వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించాల్సిన అవసరం వచ్చిందన్నారు. రాష్ట్రంలో 12,918 గ్రామాల్లోని 3.50కోట్ల మంది గ్రామీణ ప్రజలకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ప్రభుత్వ విధానాలతో సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా మిగిలిపోవాల్సిన పరిస్థితి నెలకొనడం బాధకరమన్నారు. అంతకు ముందు చర్చి సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం జేసీ గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పగడాల రమేష్, గౌరవ సలహాదారులు వీరభద్రాచారి, రావెళ్ల సుధాకర్, సింగంశెట్టి సుబ్బరామయ్య, కొత్తపు మునిరెడ్డి, చుక్కా ధనుంజయ్, చింతాకిరణ్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ విద్యుత్ ఈయూకి రాజీనామా

మార్కాపురం వన్‌టౌన్, మార్చి 6 : వైఎస్ఆర్ విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్‌కు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపర్తి చంద్రశేఖర్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు బుధవారం ప్రకటనలో తెలిపారు.



కాలువ పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అర్జునరావు

ప్రతి కుటుంబానికి వంద పనిదినాలు కల్పించాలి

● డ్వామా పీడీ అర్జునరావు

పర్చూరు, మార్చి 6: జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా(ఎన్ఆర్ ఈజీఎస్) ప్రతి కుటుంబానికి 100 రోజులు పనికల్పించాలని డ్వామా పీడీ అర్జునరావు సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని చిన్ననందిపాడు, అడుసుమల్లి గ్రామాల్లోని ఉపాధి హామీ ద్వారా నిర్వహిస్తున్న పంట కుంటలు, కాలువ పనులను పరిశీలించారు. అనంతరం ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించి తగుసూచనలు ఇచ్చారు. అన్నీ గ్రామాల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించి ప్రతిపాదనలు వేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ముందుగా పని కల్పించాలన్నారు. కూలీలకు మస్టర్‌ను విధిగా వేయాలన్నారు. పనుల విషయంలో ఎక్కడైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో ఏపీడీ ఎస్.రాజేస్, ఫీల్డ్‌అసిస్టెంట్, సిబ్బంది పాల్గొన్నారు.



పోటీలలో పాల్గొన్న కడవకుదురు ఎడ్లు

హోరాహోరీగా పోలురాదా ఎడ్ల పందాలు

చినగంజాం, మార్చి 6 : మండలంలోని సోపిరాల గ్రామంలోని లలితా పరమేశ్వరి సమేత రామకోటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో మహాశివరాత్రి తిరునాళ్లను పురస్కరించుకొని రాష్ట్ర స్థాయి నాటుబండి పోలు రాదా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు బుధవారం రాత్రి హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలకు కృష్ణ , నెల్లూరు జిల్లాలతో పాటు, బాపట్ల, చీరాల, వేటపాలెం, కడవకుదురు, సోపిరాల తదితర గ్రామాలకు చెందిన 17 ఎడ్ల జతలు వచ్చినట్లు నిర్వహకులు తెలిపారు. సోపిరాల టైర్ల బండ్ల అసోసియేషన్, గ్రామస్థుల సహకారంతో నిర్వహిస్తున్న ఈ నాటుబండి పోలు రాదా ఎడ్ల పందాలను మున్సిపల్‌మాజీ కమిషనర్ టీఎస్ఆర్ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం వలన ప్రజల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందుతాయని అన్నారు. ప్రేక్షకులు ఈలలు, కేరింతలతో దేవస్థానం ప్రాంగణం తిరునాళ్ల వాతావరణం నెలకొంది. పోటీలను తిలకించేందుకు పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పోటీలలో విజేతలైన ఎడ్ల జతల యజమానులకు గురువారం బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యూబీ.వరప్రసాద్, ఈవోపీఆర్డీ ఎన్‌వీజీ.మూర్తి, కడవకుదురు ఎంపీటీసీ ఆమంచి వెంకటసుబ్బారావు, చెరుకూరి పుల్లయ్య, ఎ.రామకృష్ణ, నిర్వహణ కమిటీ సభ్యులు టి.జయరావు, చెరుకూరి భాస్కరరావు, గ్రామ పెద్దలు, గ్రామ కార్యదర్శి ఎ.మస్తాన్‌రావులు పాల్గొన్నారు.



సోలార్ సబ్సిడీ యూనిట్‌ల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు

సోలార్ యూనిట్లతో గృహాలకు ఉచిత విద్యుత్

ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ

అద్దంకి, మార్చి 6: ఇళ్ల పైకప్పుపై సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గృహవినియోగానికి ఉచిత విద్యుత్ పొందవచ్చు అని విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. బుధవారం విద్యుత్ కార్యాలయంలో వివరాలతో కూడిన కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. దేశ వ్యాప్తంగా ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా సుమారు కోటి ఇళ్ళపై సోలార్ యూనిట్‌లు సబ్సిడీపై ఏర్పాటు చేసుకోవచ్చునని అన్నారు. 1 కేవీ యూనిట్‌కు మొత్తం రూ. 55 వేలు ఖర్చు కాగా రూ. 30 వేలు సబ్సిడీ ఉంటుందన్నారు. 2కేవి యూనిట్‌కు మొత్తం ఖర్చు లక్ష రూపాయలు కాగా రూ. 60 వేలు, 3కెవి మొత్తం రూ. 1.40లక్షలు ఖర్చు కాగా 78 వేల రూపాయలు సబ్సిడీ పొందవచ్చు అన్నారు. 3 కేవీ యూనిట్ ఏర్పాటు చేసుకున్న ఇళ్లకు నెలకు 300 యూనిట్‌ల వరకు ఉచిత విద్యుత్ పొందవచ్చు అన్నారు. ఇంటి వాడకానికి మించి విద్యుత్ ఉత్పత్తి చేస్తే యూనిట్‌కు రూ.4.17 పైసలు చొప్పున జమచేస్తామన్నారు. ఇందుకోసం నేరుగా వెబ్ సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. యూనిట్ నిర్మాణం పూర్తి అయిన తరువాత సబ్సిడీ మొత్తాన్ని వారి బ్యాంక్ ఖాతాలలో జమ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ సత్యనారాయణ, ఈఆర్‌వో కార్యాలయం జేఏవో రమేష్, టెక్నికల్ ఏఈ బాలకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల నుంచి నమూనాల వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ బేతపూడి ప్రసాద్, సీఐ శేషగిరిరావు, పక్కన స్కూల్ ప్రతినిధులు

సైన్స్ ఎగ్జిబిషన్లు విద్యార్థులకు ఎంతో ఉపయోగం

● డీఎస్పీ బేతపూడి ప్రసాద్

చీరాల,మార్చి 6 : విద్యార్థుల్లో నిబిడీకృతమైన మేధో సంపత్తిని వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో ఉపయోగపడతాయాని డీఎస్పీ బేతపూడి ప్రసాద్ అన్నారు. స్థానిక విజ్ఞానభారతి స్కూల్‌లో బుధవారం నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను సీఐ శేషగిరిరావుతో కలిసి డీఎస్పీ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రతినిధులు మేజర్ టి.రోశయ్య, మన్నేపల్లి బ్రహ్మయ్య తదితరులతో కలసి విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తాము తయారు చేసిన నమూనాల ప్రత్యేకతలను వివరించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రాథమిక దశ నుంచి ఏ విద్యార్థి దేనిపై ఆసక్తి కనబరుస్తారో గుర్తించి, అందుకు అనుగుణంగా వారిని ప్రోత్సహిస్తే సత్ఫలితాలు సాధిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ బొనిగల జైసన్‌బాబు, స్కూల్ డైరెక్టర్లు టి. భూపేంద్ర, జి. సుబ్బారావు, ప్రిన్సిపల్ షేక్ కరిముల్లా, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముందుచూపు లేకుంటే తాగునీటికి తిప్పలే..!

ఎస్ఎస్‌ట్యాంకును నింపాలి ముందస్తు చర్యలు తీసుకోవాలి

చీరాల,మార్చి 6 : చీరాల పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు చీరాల, కారంచేడు రోడ్డులోని సమ్మర్ స్టోరేజీ ట్యాంక్ ప్రధాన వనరు. మున్సిపల్ పరిధిలో సుమారు లక్ష మంది జనాభా ఉన్నారు. సుమారు 25వేల గృహాలు ఉన్నాయి. ఒక్కో మనిషికి సగటున రోజుకు 80 లీటర్లు అవసరం. మున్సిపల్ పరిధిలో ఐదు ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉన్నాయి. 10వేల ట్యాప్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ క్రమంలో సమ్మర్ స్టోరేజి ట్యాంకులో ఎప్పుడూ తాగునీరు పుష్కలంగా ఉంటుంది. చెరువులో నీటి మట్టం తగ్గినపుడు అవకాశం లభించిన సమయంలో కొమ్మమూరు కాలువ నుంచి నీటిని చెరువుకు నింపుతుంటారు. ఈక్రమంలో ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. ఏప్రిల్, మే మాసాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని చెప్తున్నారు. ఈ నేపథ్యంలో మళ్లీ వర్షాకాలం వచ్చే వరకు పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఎదురుకాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, లేదంటే ఇబ్బంది పడతామని పురప్రజలు అంటున్నారు. ఎస్ఎస్ ట్యాంక్‌లో 24 అడుగులమేర నీటి మట్టం ఉండే సామర్థ్యం కలిగి ఉంది. ప్రస్తుతం 19 అడుగుల నీటి మట్టం నిల్వఉంది. కొమ్మమూరు కాలువకు నీటి విడుదల ఆగింది. అయితే త్వరలో తాగునీటి చెరువులను నింపుకునేందుకు కొమ్మమూరు కాలువకు నీరు విడుదల చేసే అవకాశం ఉంటుందన్నారు. అప్పుడు వెంటనే ఎస్.ఎస్ ట్యాంకును పూర్తిస్థాయిలో నింపాల్సిన అవసరం ఉంది. లేదంటే ఎండల తీవ్రత నేపథ్యంలో పెరిగే నీటి అవసరతకు సరిపడా సరఫరా చేయలేరు. ప్రస్తుతం రోజూ ఉదయం పూట ఒక గంట పాటు మున్సిపల్ నీటి సరఫరా జరుగుతోంది.



చీరాల - కారంచేడు రోడ్డులోని మంచినీటి చెరువు

సాధారణంగా నీటి మట్టం తగ్గి కాలువ నుంచి చెరువులకు నీటిని నింపే పరిస్థితి లేనప్పుడు, ఉన్న నీటిని రోజు మార్చి రోజు సరఫరా చేసిన సందర్భాలు గతంలో ఉన్నాయి. ఈ క్రమంలో పాలకులు, అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి పనుల్లో దొంగ మస్టర్లు

● మండల సర్వసభ్య సమావేశంలో నిలదీసిన అధికార పార్టీ సర్పంచ్

అద్దంకిటౌన్, మార్చి 6: ఉపాధి పనులు చేయనివారికి దొంగ మస్టర్లు వేసి డబ్బులు చెల్లిస్తున్నారని, దీనికంతటికి కారణం ఏపీవో అని రామాయపాలెం గ్రామ అధికారపార్టీ సర్పంచ్ రామాంజనేయరెడ్డి సమావేశంలో అధికారిని నిలదీశాడు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ అవిశన జ్యోతి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి వచ్చిన అయా శాఖల అధికారులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సౌకర్యాల గురించి వివరించారు. అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో గాయత్రిదేవి మాట్లాడుతుండగా రామాయపాలెం సర్పంచ్ లేచి హైదరాబాద్‌లో ఉద్యోగం చేసే వారికి, అద్దంకిలో ఉండేవారికి, జీఎస్టీ కట్టేవారికి, మంచంలో ఉండేవారికి ఉపాధి పనులు చేయకుండానే వారికి మస్టర్ వేసి డబ్బులు వేస్తున్నారన్నారు. వెంటనే ఆవిషయంపై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఉపాధి హామీ పనుల గ్రామ సభల విషయం సర్పంచ్‌కి తెలియజేయకుండా వారే సభలు నిర్వహించుకుంటున్నారని ఎంపీడీవోకు ఫిర్యాదు చేశాడు. అనంతరం



సమావేశంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవోను ప్రశ్నిస్తున్న అధికారపార్టీ సర్పంచ్

ఎంపీడీవో సత్యనారాయణ కలుగజేసుకుని విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గ్రామ సభలు సర్పంచ్ అధ్యక్షతన జరగాలని మరో సారి అలా జరగకుండా చూడాలన్నారు. అలాగే అద్దంకి నుంచి మోదేపల్లి వెళ్లే ఆర్టీసీ బస్సు ఉదయం 6 గంటలకు వస్తుందని దాని వలన పిల్లలు తిమ్మయపాలెం పాఠశాలకు రావాలంటే ఇబ్బంది పడుతున్నారని, బస్సు సమయాన్ని ఉదయం, సాయంత్రం వేళలలో విద్యార్థులకు సౌకర్యంగా ఉండేలా మార్పులు చేయాలని కోటికలపూడి సర్పంచ్ పూనాటి విక్రం అధికారులను కోరారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు అందరూ లేకపోవడం, వచ్చిన కొందరు ఎంపీటీసీలు సమావేశంలో కూర్చోకుండానే కిందనే అధికారుల వద్ద పుస్తకంలో సంతకాలు చేసి వెళ్ళిపోవడం సర్వ సాధారణం అయ్యింది.

పేదల కంటి వెలుగు ప్రదాత 'ఏలూరి'

టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఆదినారాయణ

ఉచిత మెగా కంటివైద్య శిబిరానికి వి శేష స్పందన

మార్టూరు, మార్చి 6 : ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, నోవా అగ్రి గ్రూప్స్ ఆధ్వర్యంలో శంకర్ కంటి వైద్యశాల సౌజన్యంతో బుధవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరానికి 327 మంది హాజరు కాగా 207 మందికి శస్త్ర చికిత్సలకు వైద్యులు రిఫర్ చేశారు. ఈ క్యాంపుకు హాజరయిన వారికి రక్త, బి.పి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. పురుషులకు, మహిళలకు వేర్వేరుగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు.తొలుత స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహానికి, ఏలూరి నాగేశ్వరరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు తొండెపు ఆదినారాయణ, మార్టూరు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాటి నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు కామేపల్లి హరిబాబులు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలందించడంలో ఎమ్మెల్యే ఏలూరికి సాటిలేరన్నారు. ప్రజా ఆరోగ్యం పట్ల ఒక బాధ్యతగా నెలనెలా నిరంతరం ఎమ్మెల్యే ఏలూరి కంటి వైద్య శిబిరాలు, మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నారన్నారు. మచ్చలేని నాయకుడిగా,సేవే పరమావధిగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికీ కంటి వెలుగు ప్రదాతగా ఏలూరి నిలిచాడన్నారు. 15 ఏళ్ళుగా కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ లక్ష మందికి కంటి వైద్య శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు అడుసుమల్లి శ్రీనివాసరావు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు షేక్ ఫారూక్, మార్టూరు మండల ఉపాధ్యక్షుడు దిరిశాల రామకృష్ణ, యద్దనపూడి మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి ఈదల అనిల్, నాయకులు కృష్ణయ్య, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



దివంగత ఎన్టీఆర్, ఏలూరి నాగేశ్వరరావు చిత్ర పటాల వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



కంటి వైద్య శిబిరానికి హాజరయిన ప్రజలు

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం - ఎమ్మెల్యే బలరాం

చీరాల,మార్చి 6 : చీరాల నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు అన్నారు. మండల పరిధిలోని తోటవారిపాలెంలో రూ.40లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. దీంతో పాటు ఐదేళ్ల కాలంలో రూ.3.55 కోట్లు వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే బలరాం మాట్లాడుతూ నియోజకవర్గంలో 2019 ముందు, తరువాత నెలకొన్న పరిణామాలను వివరించారు. రాజకీయంగా వేసిన అడుగులు పరిస్థితులు, పరిణామాలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, పీఆర్ డీఈ శేషయ్య, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, ఆసాది అంకాళరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు,కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

టీడీపీ హయాంలోనే బీసీల అభ్యున్నతి

ఇంకొల్లు,మార్చి 6: వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ గెలుపొందితే బీసీల కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని మంగళవారం మంగళగిరిలో జరిగిన జయహో బీసీల బహిరంగసభలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ప్రకటించడం పట్ల స్థానిక బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. . బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బీసీ నేతలు సమావేశమయ్యారు. బీసీల అభ్యున్నతి కోసం తెలుగుదేశం పార్టీ కృషి చేసిందన్నారు. ఈ సమావేశంలో బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుంజి వెంకట్రావు, పార్టీ పట్టణ అధ్యక్షులు వలేరు మార్కు, ఇంకొల్లు పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వెంకట్రావు, కొలిమర్ల వసంతరావు, మల్లం శ్రీనివాసరావు, షేక్ మీరావలి, బట్టు శ్రీనివాసరావు, మోహనరావు, గుంజి గోపి, కాంతారావు, జరుబుల శ్రీనివాసరావు,సాంబయ్య, వెంకటేశ్వర్లు, శివయ్య, సతీష్ పాల్గొన్నారు.



ఇంకొల్లులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

సీనియర్ న్యాయవాదికి ఘన సన్మానం

పర్చూరు, మార్చి 6: పర్చూరు కోర్టు భవనాల సముదాయంలో సీనియర్ న్యాయవాది యార్లగడ్డ వెంకటేశ్వరరావు(వైవీరావు)ను బుధవారం పర్చూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనసన్మానం నిర్వహించారు. న్యాయవాద వృత్తిని చేపట్టి 40 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా బార్‌అసోసియేషన్ అధ్యక్షులు కొల్లా నరేంద్రకుమార్ నేతృత్వంలో సభ్యులు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయవాది వృత్తిలో వైవీరావు సేవలను కొనియాడారు. ఈసందర్భంగా వైవీరావు రూ.40 వేల నగదును బార్‌అసోషియేషన్‌కు అందజేశారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి రావి శ్రీనివాసరావు, న్యాయవాదులు రావి సత్యన్నారాయణ, చాగంటి సుబ్బారావు, పోతిని సురేంద్ర, రావి రమేష్ బాబు, మేకల రవీంద్రనాద్‌రెడ్డి, వెంగళశెట్టి తిరుమలరావు, మండవ వీరాంజనేయులు, కట్టా సాల్మన్, దగ్గుబాటి రాఘవయ్య, తులసి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



న్యాయవాది వైవీఆర్‌ను సన్మానిస్తున్న బార్‌అసోసియేషన్ ప్రతినిధులు

బీసీ డిక్లరేషన్‌పై హర్షం

పర్చూరు, మార్చి 6: తెలుగుదేశం, జనసేన పార్టీల సారధ్యంలో నిర్వహించిన జయహో బీసీ సదస్సులో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌పై పర్చూరు నియోజకవర్గ యాదవ జేఏసీ కన్వీనర్ పాలేరు నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. బీసీల అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న చట్టాల మాదిరిగానే బీసీల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలను ఏర్పాటు చేయాలని తీసుకున్న నిర్ణయం చారిత్రకమన్నారు. బడుగు బలహీన వర్గాలకు 50 సంవత్సరాలకే నెలకు రూ.4వేల చొప్పున పెన్షన్ ఇస్తామనటం శుభపరిణామం అన్నారు.

375 మందికి వైద్య పరీక్షలు

చినగంజాం, మార్చి 6 : మండలంలోని కడవకుదురు మండల ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం నిర్వహించిన వైద్య శిబిరంలో 375 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కే.కీర్తిసరోజ్, బి.నాగేంద్రలు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కంటి వైద్యులు డాక్టర్ సుధాకర్ పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఎన్.వీ.గోపాలకృష్ణమూర్తి, గ్రామ సర్పంచ్ జి.శివకుమారి, గ్రామ కార్యదర్శి ఎన్. సూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ, హెచ్‌వీ.వరదానం, సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్ల పరిశీలన

స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ద్వారా రెండు లక్షల రూపాయిల నిధులతో నిర్మించిన రెండు మరుగుదొడ్లను బుధవారం యూబీఐ చీఫ్ మేనేజర్, ఆర్‌ఎల్‌పీ హెడ్ ఆర్.అరుణ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.సుమాంజలి అధ్యక్షతన జరిగిన సభలో ఆమె మాట్లాడారు

దారి కోసం ధర్నా

మేదరమెట్ల, మార్చి 6: ఇంటి దారి విషయంలో తమకు న్యాయం చేయాలని హైదరాబాద్‌లోని నేషనల్ ఎస్సీ కమిషన్ కార్యాలయం ఎదుట బుధవారం సుధారాణి ధర్నా చేసింది. మండలంలోని బొడ్డువానిపాలెంకు చెందిన గొట్టిపాటి సుధారాణి తమ ఇంటి దారి విషయమై న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్, రాష్ట్ర ఎస్సీ కమిషన్‌కు గతంలో వివిధ స్థాయిలలోని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదుపై జిల్లా స్థాయి అధికారులు బొడ్డువానిపాలె వచ్చి ఇరువర్గాలకు చెందిన వారి పత్రాలను పరిశీలించారు. ఈ విషయంపై ఇప్పటికే ఇరువురూ కోర్టును ఆశ్రయించారు. తాజాగా ఆమె హైదరాబాద్‌లో న్యాయం చేయాలని ధర్నా చేపట్టింది.

రేషన్ బియ్యం పట్టివేత

బల్లికురవ. మార్చి 6 : పేదల నుంచి కొనుగోలు చేసిన 45 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమ మార్గంలో తరలిస్తుండగా బుధవారం తెల్లవారుజామున కొప్పెరపాడు సమీపంలో అద్దంకి ఎన్‌ఫోర్సుమెంట్ డీటీ వాసుదేవరావు పట్టుకొన్నారు. గొర్రెపాడు రోడ్డు నుంచి అద్దంకి నార్కెట్‌పల్లి రోడ్డుకు ఏపీ 39 టీటీ 2125 గల నాలుగు చక్రాల వాహనంలో రేషన్ బియ్యంను అక్రమంగా తరలిస్తున్నట్లు ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులకు సమాచారం అందింది. ఆమేరకు తనిఖీలు నిర్వహించగా వాహనంలో 90 బస్తాల బియ్యం ఉండటంతో వెంటనే డ్రైవర్ కె. రమేష్‌ను ను అదుపులోకి తీసుకొని బల్లికురవ పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని గుంటుపల్లి డీలర్‌కు అప్పగించిన్నట్లు డీటీ తెలిపారు. ఎన్‌ఫోర్సుమెంట్ అధికార్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రేషన్ బియ్యం తరలిస్తున్న డ్రైవర్‌పై కేసు నమోదు చేసిన్నట్లు ఎస్ఐ నాగ శివారెడ్డి తెలిపారు.



రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకొన్న డీటీ వాసుదేవరావు

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు

చీరాలటౌన్, మార్చి 6 : మైనర్‌లు పట్టణంలో వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ శేషగిరిరావు అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు బుధవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన యజమానులపై కూడా చర్యలుంటాయన్నారు. పెరిగిన రద్దీ కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనదారులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యే సహకారంతో కుట్టు మిషన్లు అందజేత



పేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న అసోయేషన్ సభ్యులు

అద్దంకి, మార్చి 6: అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవి కుమార్ సహకారంతో పేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేసినట్లు అద్దంకి టౌన్, మండల టైలర్స్ సంఘం అధ్యక్షుడు గోరంట్ల అచ్చయ్య తెలిపారు. బుధవారం సాయంత్రం అసోసియేషన్ సభ్యులు 8 మంది పేద మహిళలకు కుట్టు మిషన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు షేక్ మదీనా, ట్రెజరర్ నాగేశ్వరరావు, ఆంజనేయులు, కరిముల్లా, ముస్తాఫ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

చినగంజాం, మార్చి 6 : మండలంలోని కడవకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి 2023-24 విద్యా సంవత్సరం విద్యార్థుల వీడ్కోలు సభ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం కుర్రా రామారావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంఈవో బి.అజయ్‌బాబు, కోటేశ్వరావులు మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలలో విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని అన్నారు. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సోపిరాల గ్రామానికి చెందిన పోలకం నరసింహారావు రూ.25,000ల విలువ గల ప్రింటర్‌ని పాఠశాలకు బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విద్యార్థులు

ఉపకారవేతనం, ప్రశంసాపత్రం అందుకున్న విద్యార్థులు



ప్రశంసాపత్రాలతో కొండమంజులూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు

పంగులూరు, మార్చి 6 : గత ఏడాది పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో జరిగిన దీనదయాల్ స్పర్శ యోజన ఉపకారవేతన పోటీ పరీక్షలో ప్రతిభచాటిన విద్యార్థులకు ఆ శాఖ అధికారులు ఉపకారవేతనం, ప్రశంసాపత్రాలు అందజేశారు. 2023 అక్టోబర్‌లో జరిగిన ఈ పోటీ పరీక్షలో కొండమంజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఉపకార వేతనం పొందేందుకు అర్హత సాధించారు. ఈ విద్యార్థులకు బుధవారం అద్దంకి ఐపీవో విష్ణు రూ. 6 వేల నగదుతో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. పోటీ పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించారు. కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఐ.అణిత, స్థానిక పోస్టల్ అధికారి తిరుమలరావు, పీసీ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి నుంచి పటిష్టంగా పనిచేయాలి

చీరాల,మార్చి 6 :బూత్ స్థాయి నుంచి ప్రతి ఒక్కరూ పటిష్టంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతం, అభ్యర్థుల గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం పిలుపునిచ్చారు. పేరాల టీవీవీ ఆర్యవైశ్య కల్యాణమండపంలో బుధవారం రాత్రి జరిగిన బూత్ కమిటీలు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు, నీలం శామ్యూల్ మోజెస్, సయ్యద్ అలీమ్‌బాబు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బూత్ కమిటీ ప్రతినిధులతో కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

రేపు స్వామివార్ల కల్యాణ మహోత్సవం

బోడవాడ(పర్చూరు) మార్చి 6: మహాశివరాత్రి సందర్భంగా పర్చూరు మండలంలోని బోడవాడ గ్రామంలో వేంచేసియున్న శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివార్ల కల్యాణ మహోత్సవం ఈనెల 8న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి కోడూరి శేషబ్రహ్మాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా స్వామివార్లకు ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రామయ్యకు ఎమ్మెల్యే గొట్టిపాటి నివాళి




కశ్యాపురంలో కావూరి రామయ్య చిత్ర పటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

పంగులూరు, మార్చి 6: ఎమ్మెల్యే గొట్టిపాటి రవి కుమార్ బుధవారం కశ్యాపురంగ్రామంలో పర్యటించారు. గ్రామంలో కావూరి రామయ్య నిర్యాణ కార్యక్రమంలో పాల్గొన్నారు. రామయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చల్లగుండ్ల కోటేశ్వరరావు, ప్రసన్న పలువురు స్థానిక నేతలు పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

బల్లికురవ. మార్చి 6 : సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని బాపట్ల డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని వేమవరం, చెన్నుపల్లి తదితర గ్రామాలను డీఎస్పీ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన పోలీసు సిబ్బందితో మాట్లాడుతూ గ్రామాలకు సిబ్బంది ప్రతి రోజూ వెళ్లాలని, ప్రజల కదలికలను గమనించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు.అలానే అల్లర్లను ప్రోత్సహించే వారిని గుర్తించి వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. ఎవరైన చట్టాన్ని అతిక్రమిస్తే వారిపై కఠిన చర్యలు చేపట్టాలని సూచించారు. అలానే ఫ్యాక్షన్ గ్రామం అయిన వేమవరంను ప్రతి రోజూ సందర్శించాలన్నారు. ఈ పరిశీలనలో సీఐ నరసింహారావు, ఎస్ఐ నాగశివారెడ్డి తదితరులు ఉన్నారు.



ర్యాలీ ఉంది.. విద్యార్థులను తీసుకురండి!

- ఒక్కొక్కరికి రూ.500, బైక్‌కు పెట్రోలు
- లెక్చరర్ల వాట్సప్ గ్రూపులో మెసేజ్‌లు
- విజయసాయి స్వాగత ర్యాలీ కోసం ఓ ప్రైవేటు విద్యా సంస్థ కుస్తీ



లెక్చరర్ల వాట్సప్ గ్రూపులో మెసేజ్‌లు

ఈ ఫొటో చూశారా!? వాట్సప్ గ్రూప్‌లో ఒక ప్రైవేట్ కళాశాల లెక్చరర్ల మధ్య జరిగిన సంభాషణలివి. కేసీడీసీ అనే పొట్టి అక్షరాలు జిల్లాలోని ఏ కాలేజీకి సరిపోలుతాయో అందరికీ తెలుసు. సదరు విద్యా సంస్థ యాజమాన్యం పేరు పెద్దల సభ వరకు వెళ్లింది. ఇక మెసేజ్‌ల సారాంశంలోకి వద్దాం. జాగ్రత్తగా పరిశీలిస్తే ఈ మెసేజ్‌లు ఈ నెల 5వ తేదీ సాయంత్రం 7 గంటల ప్రాంతంలో సర్క్యులేట్ అయ్యాయి. రేపు (బుధవారం) వైసీపీ ర్యాలీకి ప్రతి లెక్చరర్ 25 మంది కాలేజీ విద్యార్థులను లేదా తెలిసినవారిని తీసుకొని రావాలన్నది దాని సారాశం. అలా వచ్చిన ప్రతి ఒక్కరికి రూ.500 ప్లస్ మోటారు సైకిల్‌కు పెట్రోలు చార్జీలు చెల్లిస్తారని కూడా సదరు మెసేజ్‌లో ఉంది. బుధవారం ఉదయం మన ఎమ్మెల్సీ డబ్బులు ఇస్తారని కూడా ఆ మెసేజ్‌లో పేర్కొన్నారు. వాళ్లు మన ఎమ్మెల్సీ అన్నారంటే ఆ ఎమ్మెల్సీ ఎవరై ఉంటారబ్బా!? ఇది కూడా కాస్తో కూస్తో లోకజ్ఞానం ఉన్నవారందరికీ అర్థమైపోతుంది.

ఇంతకూ ఎవరి కోసం ర్యాలీ అనుకుంటున్నారా!? అక్కడకే వద్దాం. నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేయనున్న రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి బుధవారం ఉదయం నెల్లూరులో అడుగుపెట్టారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు హంగామా చేయడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఒక ప్రైవేటు విద్యాసంస్థ లెక్చరర్లు ఈ ర్యాలీని విజయవంతం చేసే బాధ్యతను తీసుకుని వాట్సాప్ గ్రూప్‌లో సమాచారం పంచుకున్నారు. అనుకున్నట్లుగానే భారీ సంఖ్యలో విద్యార్థులను ర్యాలీకి తీసుకెళ్లారు. ఇక్కడ బాధకరం ఏమంటే.. విద్యార్థులను కూలి జనంగా భావించారు. విద్యా ప్రమాణాలను, ఉపాధ్యాయులు, అధ్యాపకుల గౌరవాన్ని కాపాడాల్సిన వ్యక్తి, కాపాడుతానని ప్రమాణం చేసిన వ్యక్తి పేరు మీదే ఈ గ్రూప్ మెసేజ్‌లు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేయడం ఆ వృత్తిలోని చాలా మందిని కలచివేసింది.

- నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

విజయసాయి కార్యక్రమానికి కందుకూరు ఎమ్మెల్యే దూరం

కందుకూరు : నెల్లూరులో విజయసాయిరెడ్డి కార్యక్రమానికి ఆ పార్టీకి చెందిన కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధరరెడ్డి దూరంగా ఉన్నారు. ఇటీవల విజయసాయిరెడ్డి జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నేతలతో కలిసి మహీధరరెడ్డి నివాసానికి వచ్చి మద్దతు కోరిన విషయం తెలిసిందే. అయితే అనూహ్యంగా బుధవారం జరిగిన కార్యక్రమానికి విజయసాయిరెడ్డి స్వయంగా ఆహ్వానించినా మహీధరరెడ్డి హాజరుకాకపోవటం చర్చనీయాంశమైంది. కాగా, మహీధరరెడ్డి మంగళవారం సీఎంఓకు వెళ్లి కీలక నేతలతో చర్చలు జరిపి వచ్చినట్లు సమాచారం.

● మాగుంట కుమారుడితో భేటీ

కాగా బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే మహీధరరెడ్డితో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు రాఘవరెడ్డి భేటీ అయ్యారు. తెలుగుదేశం పార్టీలో చేరేందుకు మాగుంట కుటుంబం సిద్ధమైందని వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో ఆయన మహీధరరెడ్డితో భేటీ కావడం చర్చనీయాంశమైంది. ఒంగోలు పార్లమెంటుతో కందుకూరు నియోజకవర్గానికి సంబంధం లేనప్పటికీ ఆయన మహీధరరెడ్డితో ప్రత్యేకంగా భేటీకావటం వెనుక రాజకీయ ప్రాధాన్యత ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

నవ్విపోదురుగాక మాకేటి..!

- ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో వైసీపీ సభ



సభలో బుర్రా మధుసూదన్ మాట్లాడుతుండగానే వెళ్లిపోతున్న జనం

ఉలవపాడు : మండల కేంద్రమైన ఉలవపాడులో బుధవారం జరిగిన కందుకూరు వైసీపీ సమన్వయకర్త, కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పరిచయ బహిరంగ సభ విమర్శలకు తావిచ్చింది. ప్రభుత్వ కార్యాలయాలైన సచివాలయం-3, రైతు భరోసా కేంద్రాల ప్రాంగణంలో సభకు అధికారులు అనుమతులు అనుమతి ఇవ్వడంపై ప్రతిపక్ష పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. గత ఏడాది కరేడు పంచాయతీ పరిధిలోని పెద్దపల్లెపాలెం గ్రామంలో ప్రాథమిక పాఠశాల ముందున్న సిమెంట్ రోడ్డుపై టీడీపీ కార్యక్రమం నిర్వహించింది. పైగా ఆ రోజు సెలవు అయినా విద్యాశాఖ ఉన్నతాధికారులచేత పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసులు జారీచేసి ఇబ్బందులకు గురిచేశారు. అలాంటిది ఇప్పుడు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో రాజకీయ సభను నిర్వహించడంపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు పట్టుపడుతున్నాయి.

● మహీధర్‌రెడ్డి వర్గం దూరం

బుర్రా మధుసూదన్ పరిచయ సభకు కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి వర్గీయులు గైర్హాజరయ్యారు. కరేడు పంచాయతీని శాసించే రెడ్డి సామాజికవర్గం నాయకులు సభకు హాజరు కాలేదు. అదేవిధంగా భీమవరం, బద్దిపూడి, చాకిచర, ఆత్మకూరు గ్రామాలకు చెందిన నాయకులు కూడా పాల్గొనలేదు. మరోవైపు సభలో మధుసూదన్ మాట్లాడుతుండగానే జనం లేచి వెళ్లిపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. జనసమీకరణలో వలంటీర్లు, వెలుగు వీవోఏలు చెమటోడ్చారు.



వరికుంటపాడు : పెద్దిరెడ్డిపల్లి వద్ద నిలిచిన రిజర్వాయర్ పనులు

మా సంగతేంటి జగనన్నా!

- 'వెలుగొండ' అంతర్భాగాన్ని మరచిపోయారా!.



ప్రకాశం జిల్లాలో పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న జగన్ సర్కారు జిల్లాలోని మెట్టప్రాంత వాసుల చిరకాల వాంఛ అయిన వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మాణాన్ని గాలికి వదిలేసింది. ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాలకు వరప్రసాదినిగా చెప్పుకొనే ఈ ప్రాజెక్టు ఈ ప్రాంత రైతులు, ప్రజలకు అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. మొన్నటివరకు నత్తనడకన సాగిన ఆ రిజర్వాయర్ పనులు ప్రస్తుతం నిలిచిపోవడంతో ఇక పనులు సాగడం కలేనా అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

- రూ.97.39 కోట్లతో పెద్దిరెడ్డిపల్లి వద్ద రిజర్వాయర్
- 2007లో పనులకు శంకుస్థాపన
- దశలవారీగా పెరిగిన గడువు తేదీ
- పైసా విదల్చని వైసీపీ ప్రభుత్వం
- రెండేళ్ల క్రితమే పనులు ఆపేసిన కాంట్రాక్టర్
- ఆందోళనలో మెట్టప్రాంతవాసులు

వరికుంటపాడు, మార్చి 6 : తీవ్ర దుర్భిక్షంలో కొట్టుమిట్టాడుతున్న నెల్లూరు, ప్రకాశం, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని మెట్ట ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణానికి శిలాఫలకాన్ని 2004లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ ప్రాజెక్టుకు అంతర్భాగంగా 1,650 మీటర్ల పొడవు, 32 మీటర్ల ఎత్తుతో 2.501 టీఎంసీల సామర్థ్యంతో వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి వద్ద రిజర్వాయర్ నిర్మాణానికి పూనుకున్నారు. ప్రకాశం జిల్లాలోని వెలుగొండ ప్రాజెక్టు పడమటి కాలువ ద్వారా ఈ ట్యాంకుకు నీటిని తరలించేలా రూపకల్పన చేశారు. రూ.97.39 కోట్లతో చేపట్టే ప్రాజెక్టుకు 2007లో అప్పటి ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు శంకుస్థాపన చేయగా, 2009లో పనులు ప్రారంభమయ్యాయి. ఇక్కడున్న నీటిని ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల పరిధిలోని 65 వేల ఎకరాలకు సాగునీరు, 1.5 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించనున్నారు. అందులో భాగంగా వరికుంటపాడు మండలంలో 13వేల ఎకరాలు, ఉదయగిరిలో 11వేలు, దుత్తలూరులో 20వేల ఎకరాలతోపాటు ఆత్మకూరు నియోజకవర్గంలోని మర్రిపాడు మండలంలో 21వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించారు. తొలుత వేగంగా సాగిన పనులను చూసిన ఈ ప్రాంత రైతులు, ప్రజలు ఇక తమ కష్టాలు తీరినట్లేనని సంబరపడ్డారు. 2012 వరకు అదే జోరుగా సాగిన పనులు ఆపై క్రమేణా నిధులు లేకపోవడంతో 2016 వరకు నిలిచిపోయాయి. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా పనులు మాత్రం ఆశించిన రీతిలో ముందుకు సాగలేదు. పాలకుల నిర్లక్ష్యమో లేదా అధికారుల అలసత్వమో ఏమోగానీ అంతంతమాత్రంగా సాగిన పనుల్లోను అక్రమాలు చోటు చేసుకున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అప్పటిదాకా రూ.44.9 కోట్ల పనులు జరిగాయి. ఈ క్రమంలో నిధులు సైతం



కంపచెట్లు మొలిచి పగుళ్లిస్తున్న కట్ట

సకాలంలో విడుదల కాకపోవడంతో ఆశించిన మేర పనులను పూర్తి చేయలేని దుస్థితిలో కాంట్రాక్టర్ తన యంత్రాలు, సామగ్రిని తీసుకొని అక్కడ నుంచి జారుకున్నాడు. పనులు నిలిపి వేసి సుమారు రెండేళ్లు కావస్తున్నా పట్టించుకొనే నాథులే కరువయ్యారు.

● శిథిలమవుతున్న పనులు

ఇదంతా ఒక వంతైతే చేపట్టిన అరకొర పనులు సైతం నామరూపాలు లేకుండా పోతున్నాయి. ఏళ్ల తరబడి పనులు నిలిచి పోవడంతో పనులు చేపట్టిన ప్రాంతంలో కంపచెట్లు ఏపుగా పెరిగి అడవిని తలపిస్తున్నాయి. వాటి ప్రభావంతో కట్ట సైతం నెర్రలు బారి రోజు రోజుకు గుంతమయంగా మారుతుంది. అలాగే రివిట్‌మెంట్ పనులు సైతం అసంపూర్తిగా నిలిచిపోవడంతో కింది భాగంలోని మట్టి కోతకు గురై ఛిద్రమవుతున్నాయి. దీంతో అటువైపు చూసిన ప్రతి ఒక్కరు రూ.కోట్లు వెచ్చించి చేపట్టిన పనుల లక్ష్యం నీరుగారి పోతోందంటూ అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● ఎన్నటికి పూర్తయ్యేనో

2009లో ప్రారంభమైన ఆ ప్రాజెక్టు పనులను 2013 ఫిబ్రవరి నాటికి పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఆ సమయానికి ఆశించిన మేర పనులు సాగకపోవడంతో మరో రెండేళ్లపాటు గడువును పెంచారు. అయినా మందకొడిగా సాగుతున్న పనులతో ఫలితం లేకపోవడంతో వాయిదాల పర్వం సాగించిన ప్రభుత్వాలు వరుసగా రెండేళ్ల గడువును పెంచుతూ చివరికి 2022, సెప్టెంబరు నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఈ గడువూ ముగిసి ఒకటిన్నర ఏడాది కావస్తున్నా పనులు పూర్తి దశకు చేరుకోలేదు. ప్రభుత్వం సకాలంలో నిధులు మంజూరు చేయకపోగా, సమగ్ర పర్యవేక్షణ లేకపోవడంతో ఇలాంటి పరిస్థితి దాపురించిందని మెట్ట రైతన్న పెదవి విరుస్తున్నాడు. ఇలాంటి తరుణంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన వెలుగొండ ప్రాజెక్టును ప్రారంభించడం విడ్డూరంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతర్భాగమైన ప్రాజెక్టులపై దృష్టి సారిండం మరిచిపోయారా అనే ప్రశ్నలు సైతం వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ప్రాజెక్టు పనులను పునఃప్రారంభించేలా చర్యలు చేపట్టాలని మెట్టవాసులు కోరుతున్నారు.



శేష వాహనంపై విహరిస్తున్న ఆది దంపతులు

శేషవాహనంపై పన్నగ భూషణుడు

నెల్లూరులో జరుగుతున్న శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మూలస్థానేశ్వరా లయంలో ఉదయం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, చప్పర ఉత్సవం, భువనేశ్వరీ అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. రాత్రి శేషవాహన ఉత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా విశేష పూలంగి సేవ, పూజలు జరిగాయి.

● వైభవంగా అంకురార్పణ

రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలోని సుందరేశ్వర స్వామికి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు వైభవంగా అంకురారోపణ జరిగింది. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ పూజలు జరిగాయి.



అమ్మవారికి పుష్పాభిషేకం చేస్తున్న అర్చకులు

యోహం పుష్పం వేదా..!

- రాజరాజేశ్వరికి వైభవంగా పుష్పయాగం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 6 : నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారికి బుధవారం సాయంత్రం పుష్పయాగం నయనానందకరంగా జరిగింది. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగి 49 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ వేడుక నిర్వహించారు. ఆలయమంతా చేసిన విశేష పుష్పాలంకారం, విద్యుద్దీపాలంకరణ భక్తులను ఆకట్టుకున్నాయి. ప్రధాన అర్చకుడు రఘురామ మూర్తి ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పుష్పయాగం సందర్భంగా విష్వక్సేనపూజ, లలితా సహస్ర నామ పూజలు, షోడశోపచారాలు జరిగాయి. రాజరాజేశ్వరి సేవా సంస్థ వ్యవస్థాపకుడు, వైసీపీ నగర అధ్యక్షుడు సన్నపరెడ్డి పెంచలరెడ్డి కుటుంబం ఉభయకర్తలుగా వ్యవహరించింది. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కార్పొరేటర్లు, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ట్రేడ్ నాయకులు, సింహపురి దాల్ మిల్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, సహాయ కమిషనర్ జే వెంకట సుబ్బయ్య, అర్చక బృందం పర్యవేక్షించింది.



నెరవేరిన కల : వైద్య డిగ్రీ పట్టా అందుకున్న కుమార్తెను చూసి మురిసిపోతున్న తల్లిదండ్రులు

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందించండి!

- నవభారత్ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాలి
- అమ్మభాషకు ప్రాధాన్యం ఇవ్వాలి
- యువ డాక్టర్లకు పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య పిలుపు
- ఉత్సాహంగా ప్రభుత్వ వైద్య కళాశాల స్నాతకోత్సవం



నెల్లూరు (వైద్యం), మార్చి 6 : అరవై శాతం ప్రజలున్న గ్రామీణ ప్రాంతాలలో అనేక రకాల వ్యాధులు ప్రబలుతున్నాయని, అలాంటి చోట్ల వైద్య సేవలు అందించాలని పూర్వ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు సూచించారు. బుధవారం నెల్లూరులోని ప్రభుత్వ వైద్య కళాశాల స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. 2018 బ్యాచ్‌కు చెందిన 148 మంది యువ వైద్యులకు వైద్య డిగ్రీపట్టాలు అందించారు. అంతకుముందు యువ వైద్యులచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడారు. నవభారత నిర్మాణానికి వైద్యులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఆత్మనిర్భర్ భారత్ స్వావలంబన కోసం కృషి చేయాలని తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రులు ఎక్కువగా ఉన్నాయని, కొన్నింటిలో రోగులు వెళితే రకరాల పరీక్షల పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారని అలాంటి వాటికి పాల్పడవద్దని హితవు పలికారు. యువతలో 45 శాతం మంది మానసిక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. అలాంటి వారు అధ్యాత్మిక, వ్యాయామం వైపు దృష్టి పెడితే కొంతవరకు ఉపశమనం పొందవచ్చని పేర్కొన్నారు. వారానికి ఒక రోజు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో వైద్యసేవలు అందించాలని కోరారు. గతంలో దొడ్ల సుబ్బారెడ్డి ఆసుపత్రిగా ఉన్న పెద్దాసుపత్రికి ఎంతో పేరు ఉందని తన కుమార్తె కూడా ఈ ఆసుపత్రిలోనే జన్మించిందని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం వైద్య కళాశాలకు అనుబంధంగా రూపాంతరం చెందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల అభివృద్ధికి ఎంతోమంది పూర్వ విద్యార్థులు సహకరిస్తున్నారని అదేవిధంగా ఇక్కడ కూడా సహకరించాలన్నారు. అమ్మభాషా తెలుగుకు ప్రాధాన్యత ఇచ్చి రోగులతో మాట్లాడాలని సూచించారు. జీజీహెచ్ సూపరింటెండెంటెంట్ డాక్టర్ సిద్ధా నాయక్ మాట్లాడుతూ 750 పడకలతో ఉన్న ఆసుపత్రికి సూపర్‌స్పెషాలిటీ వైద్య చికిత్సలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఆర్డీవో మలోల మాట్లాడుతూ వైద్యో నారాయణో హరి అన్న సూక్తిని ఆదర్శంగా తీసుకుని యువ వైద్యులు మెలగాలని కోరారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధరాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ స్నాతకోత్సవంలో వైద్యులు మస్తాన్‌బాషా, నరేంద్ర పాల్గొన్నారు.

● అట్టహాసంగా..

ప్రభుత్వ వైద్య కళాశాల 5వ స్నాతకోత్సవం బుధవారం సాయంత్రం అట్టహాసంగా జరిగింది. 2018 బ్యాచ్‌కు చెందిన మెడికోలకు డిగ్రీ పట్టాల పంపిణీ జరగడంతో తల్లిదండ్రులు తరలివచ్చారు. పట్టాలు అందుకున్న పిల్లలను ఆప్యాయంగా హత్తుకుని తమ ఆనందాన్ని తెలియచేశారు. కేరళకు చెందిన వాయిద్య బృందం ఈ స్నాతకోత్సవంలో ప్రత్యేకతను చాటుకుంది. అలాగే అడుగడున విద్యుత్ దీపాలను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చి దిద్దారు. మెడికోలు ఉత్సాహంగా పాల్గొని తమ అధ్యాపకుల ప్రసంగాలకు కేరింతలు కొట్టారు.



ప్రతిజ్ఞ చేస్తున్న యువ వైద్యులు



కలెక్టర్‌ను కలిసిన జేసీ సేతు మాధవన్

జాయింట్ కలెక్టర్‌గా సేతు మాధవన్

నెల్లూరు (హరనాథపురం) : నూతన జాయింట్ కలెక్టర్‌గా సేతు మాధవన్ బుధవారం తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన వారు. గతంలో ప్రకాశం జిల్లాలో ట్రైనీ కలెక్టర్‌గా, మార్కాపురం సబ్ కలెక్టర్‌గా పని చేశారు. రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ శాఖలో సీఈఓగా పనిచేస్తూ బదిలీపై నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సేతు మాధవన్ మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ, భూసర్వే సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని చెప్పారు. కాగా, జిల్లా సర్వేశాఖ సహాయ సంచాలకులు హనుమాన్‌ప్రసాద్ జేసీకి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలియచేశారు. అనంతరం జేసీ కలెక్టర్ హరినారాయ ణన్‌ను ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు.



కందుకూరు-1లో పొగాకు వేలంను ప్రారంభిస్తున్న అధికారులు, రైతు ప్రతినిధులు

పొగాకు కొనుగోళ్లు ప్రారంభం

- కలిగిరి, కందుకూరు, మర్రిపాడు కేంద్రాలలో వేలం
- తొలిరోజున కిలో పొగాకు రూ.230



కలిగిరిలో ప్రారంభమైన పొగాకు కొనుగోళ్లు

కలిగిరి/కందుకూరు/మర్రిపాడు : 2023-24 సీజన్ పొగాకు కొనుగోళ్లు బుధవారం ప్రారంభమయ్యాయి. కలిగిరి కేంద్రంలో పూజల అనంతరం దుత్తలూరు క్లస్టరు పరిధిలోని రైతులు 18 పొగాకు బేళ్లను తీసుకొచ్చారు. 11 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని పొగాకును కొనుగోలు చేశారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.231, కనిష్ఠ ధర రూ.230 పలికింది. కాగా, రీజనల్ మార్కెట్ ట్రేడ్‌వింగ్ రీజనల్ మేనేజర్ హెచ్‌కే గోపాల్, వేలం నిర్వహణా ధికారి మహేష్ కుమార్ రైతుల సమక్షంలో పొగాకు కొనుగోలు కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. కంపెనీ ప్రతినిధులుగా రైతుకు పూర్తిస్థాయి మద్దతుధర అందించాలని సూచించారు.

● డీసీపల్లిలో...

మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు బోర్డులో బుధవారం వేలం ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజు రైతులు తెచ్చిన 18 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో 12 కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా, కిలో పొగాకు రూ.230లతో కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహనాధికారి జి.రాజశేఖర్ తెలిపారు.

● కందుకూరులో రెండు చోట్ల..

కందుకూరులోని రెండు పొగాకు వేలం కేంద్రాలలో బుధవారం వేలం ప్రక్రియ ప్రారంభమైంది. పొగాకు బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతు ప్రతినిధులతో పూజలు చేయించి వేలం ను ప్రారంభించారు. తొలిరోజు 18 బేళ్ల చొప్పున వేలానికి తెప్పించగా అత్యధిక ధరగా కిలోకు రూ. 230 నిర్ణయించి కొనుగోళ్లు చేశారు. ఈ సందర్భంగా రైతు ప్రతినిధులు మాట్లాడుతూ అత్యధిక ధరను రూ.250కి పెంచాలని సరాసరి ధర గిట్టుబాటయ్యేలా చర్యలు తీసుకోవాలని బోర్డు అధికారులకు విజ్ఞప్తి చేశారు. బోర్డు కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ రైతులు తమ బేళ్లను వేలానికి తెచ్చే ముందురోజు వేలం కేంద్రాలకు వచ్చి మార్కెట్‌ను పరిశీలించుకుని అందుకనుగుణంగా బేళ్లను సిద్ధం చేసుకుని తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణా ధికారులు రాజగోపాల్‌రెడ్డి, మీనా, రైతు ప్రతినిధులు మాదాల రమణయ్య, తాటికొండ రమణయ్య, శివారెడ్డి, వడ్లమూడి రామకృష్ణ పాల్గొన్నారు.



ఇళ్ల నుంచి తెచ్చుకున్న భోజనాన్ని తింటున్న విద్యార్థులు

మనమైతే ఈ అన్నం తినగలమా!?

వలేటివారిపాలెం మండలంలోని చుండి మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉంటోంది. సంగటిలా ఉంటున్న అన్నాన్ని తినలేక విద్యార్థులు పస్తులు ఉంటున్నారు. కొంతమంది ఆ అన్నాన్ని చెత్తకుప్పలో పడేస్తున్నారు. ఈ మోడల్‌స్కూల్లో 415 మంది విద్యార్థులు ఉండగా, 300 మంది వరకు మధ్యాహ్నం భోజనం తింటున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీవేంకటేశన్ చెబుతున్నారు. వడ్డించిన పులిహోర సంగటిలా ఉండటంతో విద్యార్థులు తినలేక ఇబ్బందిపడ్డారు. నీళ్ల సాంబారు తదితర కూరలు రుచిగా లేకపోవడంతో తినలేకపోతున్నామని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. ఇక్కడ అన్నం తినలేక కొంత మంది ఇళ్ల నుంచి క్యారియర్లు తెచ్చుకుంటున్నారు. నాసిరకం బియ్యం వల్ల అన్నం సంగటి అవుతోందని ప్రిన్సిపాల్ తెలిపారు. మరోవైపు రెండు నెలలుగా బిల్లులు కూడా ప్రభుత్వం మంజూరు చేయడం లేదని భోజన నిర్వాహకులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యతగల భోజనం వడ్డించాలని విద్యార్థులు కోరుతున్నారు.



ముద్దగా పులిహోర

- వలేటివారిపాళెం

విద్యార్థి దశలో కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



సీతారామపురం :సరస్వతీ పూజలో పాల్గొన్న ఎంఈవో, సర్పంచ్,ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఉదయగిరి, మార్చి 6: విద్యార్థి దశలో కష్టపడితే చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రధానోపాధ్యాయుడు మాలకొండయ్య అన్నారు. బుధవారం మండలంలోని గడ్డంవారి పల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు సరస్వతి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధిస్తే తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు సంపాదించవచ్చని అన్నారు. పులుగుళ్ల వెంకటరాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గతేడాది పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. అలాగే పాఠశాలలో సరస్వతి పూజకు అవసరం నిమిత్తం రూ.50 వేలు నగదును ట్రస్టు సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరీముల్లాహుస్సేన్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఏఎస్ పేట: స్థానిక ఠాగూర్ పాఠశాలలో బుధవారం సరస్వతీ పూజ నిర్వహించారు. త్వరలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్న సందర్భంగా విద్యార్థులు సరస్వతీ పూజ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రమణారెడ్డి, హెచ్ఎం దొరస్వామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీతారామపురం: మండల పరిధిలోని సీతారామపురం హైస్కూల్, గౌతమి హైస్కూల్, బసినేనిపల్లి హైస్కూల్స్‌లో పదోతరగతి విద్యార్థులు బుధవారం సరస్వతి పూజ నిర్వహించారు. సీతారామపురం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమానికి ఎంఈవో షేక్ మస్తాన్‌వలి, సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి విచ్చేసి సరస్వతి పూజలో పాల్గొన్నారు.

వింజమూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సరస్వతీ పూజ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం మాలకొండయ్య, ఉపాధ్యాయులు, వి ద్యార్థులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: మండలంలోని పెద్దిరెడ్డిపల్లి, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల ఉన్నత పాఠశాలల్లో బుధవారం విద్యార్థులు సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. పెద్దిరెడ్డిపల్లిలో పచ్చవ లక్ష్మయ్య కుమారులు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయగా ప్యాడ్లు, పెన్నులను ఆంగ్ల ఉపాధ్యాయులు రావిళ్ల నాగార్జున అందజేశారు. అలాగే వలంటీరు వంశీ జామెంటరీ బాక్సులను అందించారు. కార్యక్రమంలో ఎంఈవో రమణయ్య, ప్రధానోపాధ్యాయులు చలపతి, మాలకొండయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై భీమేశ్వరస్వామి గ్రామోత్సవం



సింహ వాహనంపై భీమేశ్వరస్వామి

సంగం, మార్చి 6: మండలంలోని వంగల్లులో ఉన్న భీమేశ్వరాలయంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా క్షామాక్షిదేవి, భీమేశ్వరస్వామికి భక్తులు పూలంగిసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వెంగమాంబ సేవలో కాకర్ల

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), మార్చి 6: మండలంలోని నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలమ్మ తల్లిని బుధవారం నియోజకవర్గ టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ఆత్మకూరు, మార్చి 6: రక్తదానం ప్రాణదానంతో సమానం అని ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం తెలిపారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో అపోలో డయాలసిస్ ఇన్‌చార్జ్ రవి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ ఉషాసుందరి, అపోలో వైద్యశాల డయాలసిస్ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ భవనాలు ప్రారంభం

కలువాయి, మార్చి 6: కలువాయి, తెలుగురాయపురం, గోపవరం గ్రామాల్లో సచివాలయాలను బుధవారం తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి వెంకటగిరి వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డితో కలసి ప్రారంభించారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ప్రజలందరూ ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ బి అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మీదేవి, సర్పంచు పెంచలమ్మ, మండల ఉపాధ్యక్షులు పంగా పెంచల నరసారెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సేవాసంఘం జిల్లా అధ్యక్షుడిగా పవన్

సంగం, మార్చి 6: నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా జండాదిబ్బకు చెందిన సూరాయపాళెం పవన్‌కుమార్ నియమింపబడ్డారు. ఈ మేరకు ఆయన బుధవారం సేవాసంఘం జాతీయ అధ్యక్షుడు గుంటుపల్లి నాగేశ్వరావు చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు

బీసీల సంక్షేమమే టీడీపీ ధ్యేయం : కురుగొండ్ల



మహిళలకు కరపత్రాలు అందిస్తున్న కురుగొండ్ల

కలువాయి, మార్చి 6: బీసీల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయం అని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. కలువాయి మండలంలోని వెరుబొట్లపల్లి, కనుపూరుపల్లి గ్రామాల్లో బుధవారం భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అమలుచేసే పథకాల గురించి ఆయన మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా కురుగొండ్ల మాట్లాడుతూ 40ఏళ్లుగా అక్కున చేర్చుకున్న బీసీల రుణం తీర్చుకునేందుకు చంద్రబాబునాయుడు బీసీ డిక్లరేషన్ ప్రకటించారని తెలిపారు. వైసీపీ హయాంలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎన్నికల్లో బీసీలు సైకిల్ గుర్తుపై ఓటు వేసి చంద్రబాబు నాయుడును సీఎం చేయాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు జగదల్ నాయడు, పీర్ల సోమయ్య యాదవ్, కిషోర్‌రెడ్డి, గద్దె వెంకటేశ్వర్లు, చంద్రయ్య నాయడు, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పల్స్‌పోలియో కార్యక్రమం పరిశీలన



సంగం: చిన్నారిని పరిశీలిస్తున్న అధికారి

సంగం, మార్చి 6: మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని కేంద్ర బృందం మానిటరింగ్ అధికారి సురేష్ పరిశీలించారు. బుధవారం ఆయన మండలంలోని దువ్వూరు సచివాలయం పరిధిలోని దళితవాడలో ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలు వేశారా లేదా అని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి, అశోక్ కుమార్, క్షేత్రస్థాయి వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎస్ పేట: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని తెల్లపాడు, గండువారిపల్లిలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మానిటరింగ్ అధికారి సురేష్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు డా. మంజుల, ఎంపీహెచ్‌వోఎం చిన్నయ్య, పిహెచ్ఎన్ వై నీరజ, ఎంపిహెచ్ఎస్ రషీద్, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి : సీపీఎం



సంతకాల సేకరణలో సీపీఎం నాయకులు

ఆత్మకూరు, మార్చి 6: పట్టణంలోని సోమశిల రోడ్డు సెంటర్ నుంచి ఆర్టీసీ డిపో వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సీపీఎం నాయకులు బుధవారం ఆత్మకూరు పట్టణంలోని ఎల్ఆర్‌పల్లి వద్ద సంతకాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సందాని మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనులు జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇకనైనా భూసేకరణకు న్యాయమైన నష్టపరిహారం చెల్లించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సీపీఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ

వింజమూరు, మార్చి 6: పట్టణంలోని శివాలయం ఎదురుగా ఆర్యవైశ్యులచే కన్యకాపరమేశ్వరి ఆలయం నిర్మించేందుకు బుధవారం గోపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ త్వరగా పూర్తిచేయాలి

సీతారామపురం, మార్చి 6: ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించి ఈకేవైసీ త్వరగా పూర్తిచేయాలని సచివాలయ సిబ్బందికి ఎంపీడీవో అబ్దుల్‌కలాం ఆజాద్ సూచించారు. బుధవారం ఆయన సీతారామపురం బిట్-1 సచివాలయాన్ని తనిఖీ చేసి పలు రిజిష్టర్లు పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ రమేష్ చంద్ర, ఇంజనీర్ అసిస్టెంట్ సుమతి వెటర్నరీ అసిస్టెంట్, సచివాలయాల సిబ్బంది హాజరయ్యారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి

వరికుంటపాడు, మార్చి 6: ఆరోగ్య సురక్ష పథకం కింద అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి అన్నారు. బుధవారం వేంపాడులో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మమ్మ సర్పంచ్ తాత పూడి విజయమ్మ, వైద్యులు ఆయేషా, కోటేశ్వరరావు, గవదకట్ల మల్లికార్జున, తాతపూడి అబుసలాం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: మండలంలోని నేలటూరు సచివాలయం గడ్డంవారిపల్లి ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి నాగూర్‌బీ తదితరులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డిని కలిసిన మేకపాటి

ఉదయగిరి, మార్చి 6: నెల్లూరు వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని బుధవారం ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కావలి సమీపంలో ఘన స్వాగతం పలికారు. ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి సత్కరించారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పాఠశాలలో సరస్వతీదేవి పూజ

అల్లూరు : అల్లూరుపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు గదులను విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ మేరకు బుధవారం సరస్వతీ పూజ నిర్వహించారు. విద్యా కమిటీ ఛైర్మన్ మేడా రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ చెంచయ్య పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆలయాల ముస్తాబు



ముస్తాబవుతున్న మొగిలిచెర్ల దత్తాత్రేయ ఆలయం

లింగసముద్రం, మార్చి 6 : ఈ నెల 8న జరగనున్న మహాశివరాత్రి పండుగకు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన మొగిలిచెర్ల దత్తాత్రేయస్వామి ఆలయం, లింగసముద్రంలోని తిరుమణిశెట్టి కోటయ్య మందిరం ముస్తాబయ్యాయి. భక్తులు స్వామి వారిని దర్శించుకొనేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొగిలిచెర్లకు రాష్ట్రం నుంచే కాక తెలంగాణాతో పాటు పలు నగరాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజలు చేస్తారు. దీంతో పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే కందుకూరు, కావలి డిపోల నుంచి ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పవని నాగేంద్రప్రసాద్ చెప్పారు.

మొగిలిచర్లకు ప్రత్యేక బస్సులు

కావలి : మహాశివరాత్రిని పురస్కరించుకుని లింగసముద్రం మండలం మొగిలిచర్లలో వెలసి ఉన్న దత్తాత్రేయ స్వామి దర్శనార్థం కావలి ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డీఎం రాహూరు శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు కావలి నుంచి సాయిపేట, కొమ్మి, కలిగిరి రూట్లలో ఈ ప్రత్యేక బస్సులు తిరుగుతాయన్నారు. కావలి నుంచి కలిగిరి మీదుగా 10 బస్సులు, కొమ్మి మీదుగా 8 బస్సులు, సాయిపేట మీదుగా 7 బస్సులు నడుతున్నామని పేర్కొన్నారు.

సోమేశ్వరుడుని పట్టించుకోరా?



ముస్తాబు లేక బోసిబోయిన సోమేశ్వరాలయం

బిట్రగుంట, మార్చి 6: మహాశివునికి అతిప్రీతి కరమైన శివరాత్రి పర్వదినం రోజు కూడా సోమేశ్వరుడుని పట్టించుకోరా అని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోగోలు మండలం జక్కేపల్లి గూడూరులో వెలసి ఉన్న కామాక్షి సమేత సోమేశ్వరస్వామి ఆలయం ప్రాచీన ఆలయాల్లో ఒక్కటి. దాతల సహకారంతో స్వామివారి ఉత్సవాలు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. సోమేశ్వరస్వామి ఆస్తులు అధికంగా ఉన్నా పూజలు విషయంలో దేవాదయ శాఖ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా దేవాదయ శాఖ అధికారులు స్పందించి శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు.

బీసీ డిక్లరేషన్‌తో ఎంతో ఉపయోగం : ఇంటూరి



ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న నాగేశ్వరరావు

కందుకూరు, మార్చి 6: తెలుగుదేశం పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌తో బీసీలకు ఎంతో మేలు జరుగుతుందని కందుకూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి పట్టణంలోని 3వ వార్డు ఉప్పుచెరువు ప్రాంతంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాల అమలు గురించి, స్థానిక సమస్యలు తెలుసుకుంటూ టీడీపీ మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, పువ్వాడి కోటయ్య, చిలకపాటి మధుబాబు, వడ్డెళ్ల రవిచంద్ర, రెబ్బవరపు మాల్యాద్రి, రాయపాటి శ్రీనివాసరావు, మున్నా, సలాం తదితరులు పాల్గొన్నారు.

17వ వార్డులో ప్రచారం

తెలుగుదేశం పార్టీ పిలుపుమేరకు పట్టణంలోని 17వ వార్డు బీసీ కాలనీలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి సౌజన్య ఆధ్వర్యంలో బుధవారం శంఖారావం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆమె కాలనీలో ఇంటింటికీ తిరిగి టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దివి శ్రీనివాసరావు, యనమల రాజేశ్వరి, తన్నీరు లక్ష్మి, సుగుణ, మరియమ్మ, కత్తి ఆశీర్వాదం పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు మహిళలు చేరిక



టీడీపీలో చేరిన మహిళలతో కావ్య క్రిష్ణారెడ్డి

కావలి, మార్చి 6: బీజేపీ మాజీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు, కాపు నేత పద్మావతి శ్రీదేవి తన అనుచరులతో కలసి బుధవారం టీడీపీలో చేరారు. ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో పార్టీలో చేరిన ఆమెతో పాటు 20 కుటుంబాల వారికి కావలి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పార్టీ కండువా వేసి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రతి ఒక్కరికి పార్టీలో సముచిత స్థానం కల్పించి అందరి సహకారంతో కావలిని అభివృద్ధి పథంలో నడుపుతానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, 18వ వార్డు ఇన్‌చార్జి శానం హరి తదితరులు పాల్గొన్నారు.

34వ వార్డులో టీడీపీ ఎన్నికల ప్రచారం

కావలి పట్టణంలోని 3వ క్లస్టర్ ఇన్‌చార్జి మలిశెట్టి వెంకటేశర్లు అధ్యక్షతన మాజీ కౌన్సిలర్ మలిశెట్టి విజయలక్ష్మి బుధవారం 34వ వార్డులో టీడీపీ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని, పార్లమెంట్ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు లోకేష్, సుందర శ్రీనివాస్, రామయ్య, హరీష్, వినోద్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

కావలిలో జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపిస్తాం

కావలి, మార్చి 6: కావలిలో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపిస్తామని పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ నియోజకవర్గ అధ్యక్షుడుగా ఎన్నికైన ఆలా శ్రీనాథ్, పట్టణ అధ్యక్షుడు మన్నేపల్లి రుషికేష్‌లు తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో బుధవారం జనసేన కావలి ఇన్‌చార్జి అళహరి సుధాకర్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అఖిల భారత చిరంజీవి యువత గౌరవాధ్యక్షుడు నాగబాబు సూచనల మేరకు జిల్లాతో పాటు కావలిలో పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ నూతన కమిటీని నియమించామన్నారు. నూతనంగా ఏర్పడిన కమిటీకి జనసేన ఇన్‌చార్జి సుధాకర్ శుభాకాంక్షలు తెలిపారు.

పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ నూతన కమిటీ :

పవన్‌కల్యాణ్ ఫ్యాన్స్ కావలి నియోజకవర్గ అధ్యక్షుడిగా ఆలా శ్రీనాథ్, ప్రధాన కార్యదర్శిగా బొమ్మల విద్యాసాగర్, కార్యదర్శిగా మండ శ్రీను, కోశాధికారిగా సూరిపోగు రాజేష్ లను నియమించారు. పట్టణ అధ్యక్షుడిగా మన్నెపల్లి రుషికేష్, ప్రధాన కార్యదర్శిగా భవనాసి రాంబాబు, ఉపాధ్యక్షుడుగా కామిశెట్టి మురళీకృష్ణ, రూరల్ కమిటీ అధ్యక్షుడిగా గుడిపల్లి వెంకయ్యగౌడ్, ఉపాధ్యక్షుడిగా వాయిల వెంకయ్యబాబులను నియమించారు.

ఇంటూరి నాగేశ్వరరావుకు టికెట్ కేటాయించాలి

లింగసముద్రం, మార్చి 6 : కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావుకు టికెట్ కేటాయించాలని ఐటీడీపీ ప్రధాన కార్యదర్శి ముళ్లపాటి మహేష్ చౌదరి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో కష్టాల్లో ఉన్న వారిని ఆదుకొంటూ ప్రజల మనస్సు గెలిచారని, అలాగే గెలుపు రేసులో మొదటి స్థానంలో ఉన్నారని తెలిపారు. 20 ఏళ్ల తర్వాత టీడీపీ జెండాను ఎగుర వేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ అధిష్ఠానం నాగేశ్వరరావుకు టికెట్ కేటాయించి కార్యకర్తల అభీష్టాన్ని గుర్తించాలని తెలిపారు.

డివిజనల్‌స్థాయి క్రికెట్ విజేత బిట్రగుంట లోకో టీం

బిట్రగుంట, మార్చి 6: సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ బిట్రగుంట బ్రాంచ్ ఆధ్వర్యంలో ఏడు రోజులుగా జరిగిన విజయవాడ డివిజనల్ స్థాయి క్రికెట్ పోటీలలో బిట్రగుంట లోకో టీం బుధవారం విజేతగా నిలిచింది. బిట్రగుంట సంఘ్ బ్రాంచ్ కార్యదర్శి రాజశేఖర్, రన్నింగ్ బ్రాంచ్ కార్యదర్శి జీవన్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో 40 జట్లు తలపడ్డాయి. ఫైనల్స్‌లో రాయంపాడు వర్క్‌షాపు - బిట్రగుంట జట్లు హోరాహోరిగా తలపడగా బిట్రగుంట జట్టు విన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకు పీఎస్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పసుపులేటి సుధాకర్ ట్రోఫీతో పాటు నగదు బహుమతి అందజేశారు. రన్నర్‌గా నిలిచిన రాయంపాడు జట్టుకు రైల్వే వైద్యుడు రమణరావు బహుమతి అందచేశారు. ఈ కార్యక్రమంలో సంఘ్ బ్రాంచ్ అధ్యక్షుడు గోవిందరాజు, అసిస్టెంట్ డివిజనల్ కార్యదర్శి జీ.శ్రీనివాసులు, సభ్యులు కిరణ్‌కుమార్, మురళీ, స్టేషన్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

వలేటివారిపాలెం, మార్చి 6 : జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దారు నాగమల్లేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌వోలు, బూత్ ఏజెంట్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. తహసీల్దారు మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని, ఓటరు లిస్టులో డబుల్ ఎంట్రీలు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో విద్యుత్, తాగునీరు, ఫ్యాన్‌లు, మరుగుదొడ్లు తదితర వసతులు కల్పించాలని తెలిపారు.

ఏరియా వైద్యశాలలో మహిళా దినోత్సవం

కావలి, మార్చి 6 : కావలి ఏరియా వైద్యశాలలో బుధవారం మహిళా దినోత్సవం జరిగింది. వైద్యశాల సూపరింటెండెంట్ పద్మావతి, ఆర్ఎంవో ప్రమీల, నర్సింగ్ సూరింటెండెంట్ ప్రసన్న తదితరులు మహిళాదినోత్సవం యొక్క ఆవశ్యకతను గురించి వివరించారు. మహిళా వైద్యులు, నర్సులు, పారా మెడికల్, శానిటరీ, సిబ్బంది తదితరులు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ పద్మజ, డాక్టర్ ఉషారాణిలు ఆసుపత్రికి 36 కుర్చీలు, బీరువాను బహూకరించారు.

మృతుడి కుటుంబానికి కావ్య పరామర్శ

అల్లూరు, మార్చి 6 : మండలంలోని ఇందుపూరుకు చెందిన టీడీపీ నాయకుడు అంబటి రాజేంద్ర తండ్రి అంబటి గోపాలయ్య ఇటీవల మరణించగా బుధవారం ఆయన కుటుంబాన్ని కావలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కావ్య కృష్ణారెడ్డి పరామర్శించారు. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బండి శ్రీనివాసులు, అరగల రమణయ్య, హజరత్తయ్య, దాసరి వెంకటేశ్వర్లు, ఎండేటి హరికృష్ణ, కావలి జగన్ పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాలకు వేలం

కందుకూరు, మార్చి 6: రవాణా శాఖ తనిఖీలలో భాగంగా సీజ్‌చేసి వాటిని విడిపించుకునేందుకు యజమానులు ఆసక్తి చూపని వాహనాలకు బుధవారం కందుకూరులో వేలం నిర్వహించగా రూ.4.85 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆర్‌టీవో సుధాకరరెడ్డి తెలిపారు. కందుకూరు ఎంవీఐ ఎస్కేఎండీ రఫీ, ఇతర రవాణా శాఖ అధికారులతో కలిసి ఆయన వేలం ప్రక్రియలో పాల్గొన్నారు. మొత్తం 26 వాహనాలను వేలం వేయగా ఈ మొత్తం వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో కావలి ఎంవీఐ సుందరరావు, ఏవో సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ల బహూకరణ

కలిగిరి, మార్చి 6: స్థానిక పొగాకు వేలం కేంద్రానికి పాలూరు మాలకొండారెడ్డి చారిటబుల్ ట్రస్టు ద్వారా రెండు వాటర్‌కూలర్‌లను వారి కుమారులు, జడ్పీటీసీ పాలూరు మాల్యాద్రిరెడ్డి, కలిగిరి పంచాయతీ ఉపసర్పంచు పాలూరు కొండారెడ్డిలు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పొగాకుబోర్డు వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


ఇద్దరూ అవినీతి పరులే : పసుపులేటి



మాట్లాడుతున్న పసుపులేటి

కావలిటౌన్, మార్చి 6: కావలి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులిద్దరూ అవినీతిపరులేనని పీఎస్సార్ ట్రస్ట్ అధినేత పసుపులేటి సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం ట్రస్ట్ కార్యాలయం వద్ద ప్రచార రథాలు ప్రారంభించిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. దేశంలోనే మొదటి ఇండిపెండెంట్ అభ్యర్థిగా మేనిఫెస్టో ప్రకటించి ఆదర్శంగా నిలుస్తానన్నారు. ఒక ప్రధాన పార్టీ తనని పిలిచి మంచి కార్యక్రమాలు చేస్తున్నావు మాపార్టీలో రమ్మని ఆహ్వానించారని, తీరా ఎన్నికల సమయంలో టికెట్ ఇవ్వలేమని చెప్పారన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని, గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

కోదండరాముడికి లక్ష తులసి పూజ



కందుకూరు, మార్చి 6: పట్టణంలోని పెద్ద బజారులో ఉన్న కోదండరాముడికి బుధవారం లక్ష తులసి పూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు రామనామస్మరణ చేస్తూ తులసిని స్వామివారికి సమర్పించటంతో ఆలయ ప్రాంగణం రామనామస్మరణతో మార్మోగింది. పట్టణంలోని ఆర్యవైశ్య వ్యాపారులంతా దుకాణాలు మూసివేసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీ సత్యనారాయణస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ మురారిశెట్టి వెంకటసుబ్బారావు, శ్రీను, ఆలయ అర్చకులు రామచంద్రాచార్యులు పాల్గొన్నారు.

ప్రత్యేక రక్షణ చట్టం బీసీలకు వరం



డిక్లరేషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ నేతలు

కావలి, మార్చి 6: ప్రత్యేక రక్షణ చట్టం బీసీలకు వరమని, 50 ఏళ్లకే పెన్షన్ అమలు చేయటం హర్షణీయమని బీసీ నేతలు పేర్కొన్నారు. స్థానిక ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో బుధవారం బీసీసెల్ రాష్ట్ర అధికారప్రతినిధి ఉప్పుటూరు బాలగురుస్వామి, రాష్ట్ర బీసీ సాధికారిక కమిటీ సభ్యుడు కావేటి చినకోటయ్య, బీసీసెల్ కావలి పట్టణ అధ్యక్షుడు గుండ్లపల్లి శివాజీ, ఉపాధ్యక్షుడు పసుపులేటి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఏటూరి శివకుమార్, యువత అధ్యక్షుడు పూడిపర్తి మురళీక్రిష్ణలు సమావేశమై బీసీ డిక్లరేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. బీసీ డిక్లరేషన్‌ను ప్రజలకు వివరించి కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు కమ్మిశెట్టి రమణయ్య, గంజాం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

10వ తరగతి విద్యార్థులకు అట్టల పంపిణీ

వలేటివారిపాలెం, మార్చి 6 : వలేటివారిపాలెం హైస్కూల్‌లో చదువుతున్న 10వ తరగతి విద్యార్థులకు పూర్వ విద్యార్థి కొల్లు కిషోర్ బుధవారం అట్టలు, పెన్నులు, జామెంట్రీబాక్సులు పంపిణీ చేశారు. ముందుగా ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కమల్‌కుమార్, ఉపాధ్యాయులు చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, కత్తి ఐజాక్, సుబ్బరామయ్య, యోగా టీచరు ఈర్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.